


# శివసూర్య

SHIVA SURYA TELUGU DAILY

RNI APTEL : 2023/88704

తెలుగు దిన పత్రిక




శివసూర్య
విలేకర్లు కావలెను
కర్నూలు జిల్లా, నంద్యాల జిల్లాల నుండి విడుదలవుతున్న సంచలన సమాచార దినపత్రిక శివసూర్య తెలుగు దినపత్రికలో పని చేయుటకు అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు, ఆర్సీ ఇంచార్జులు & మండల విలేకర్లు కావలెను.
ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి.
ఎడిటర్ : బి. శివరాముడు
9494741301, 9346185399.



కర్నూలు సంపుటి : 03, సంచిక : 334చీఫ్ ఎడిటర్.. పేజిలు : 08, వెల రూ. 2రూ/బుధవారం - 12 - ఆగష్టు - 2026

Published From Kurnool : Circulated at Srikakulam,VishakaPatanam,Vijayanagaram, East Godavari, West Godavari, Krishna, Guntur, Prakasam, Nellore, Chittoor,, Kadapa,




## మయన్మార్‌లో చిక్కుకున్న ఏపీ యువతను ఆదుకుంటాం

- మయన్మార్‌లో చిక్కుకున్న ఏపీ యువతకు మంత్రి లోకేశ్ హామీ
- బాధితులను స్వదేశానికి రప్పించాలని అధికారులకు ఆదేశం
- బ్యాంకాక్ ఉద్యోగాల పేరుతో మోసపోయిన బాధితులు

## 2025-26 రెండో త్రైమాసికంలో
# 10.7శాతం వృద్ధిరేటు నమోదు
### ఏపీ ఆర్థిక వృద్ధిపై సీఎం చంద్రబాబు సమీక్ష

- సామాన్యుడిపై ధరల భారం వద్దు.. ఎల్ నినోను అధిగమించి 15శాతం వృద్ధి సాధించాలి
- ఎల్ నినో ప్రభావం, ధరల పెరుగుదలపై సీఎం ఆందోళన
- 15 శాతం వృద్ధిరేటు సాధించాలని అధికారులకు కొత్త లక్ష్యం
- సామాన్యుడిపై ధరల భారం పడకుండా కమిటీ ఏర్పాటుకు సూచన



అమరావతి: ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ బలంగా పుంజుకుంటూ సానుకూల వృద్ధిరేటుతో దూసుకెళ్తోంది. గడిచిన రెండేళ్లుగా జాతీయ సగటును మించి ప్రగతి సాధిస్తున్న ఏపీ, 2025-26 ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో 10.7 శాతం వృద్ధిరేటును నమోదు చేసింది. అయితే, ఈ సానుకూల వాతావరణంలోనూ ఎల్ నినో రూపంలో పొంచివున్న ముప్పును ముందుగానే పసిగట్టిన మిగతా 2 లో

## యుద్ధ నేరాల కేసులో సిరియా మాజీ అధ్యక్షుడు అసద్‌కు మరణశిక్ష



- బషర్ అల్ అసద్‌కు మరణశిక్ష
- అసద్ తమ్ముడు మహెర్‌కూ అదే శిక్ష
- సమీప బంధువు అతీఫ్ నజీబ్‌కూ మరణశిక్ష



## ప్రతి ఇంటా త్రివర్ణ పతాకం.. ఆగస్టు 15ను పండుగలా జరుపుకుందాం: మోదీ

- 'హర్ ఘర్ తిరంగా'లో పాల్గొనాలని మోదీ పిలుపు
- ఆగస్టు 15న ప్రతి ఇంటా త్రివర్ణ పతాకం ఎగరేయాలని సూచన
- స్వాతంత్ర్య సమరయోధులకు నివాళు లర్పించాలని విజ్ఞప్తి
- 'వికసిత్ భారత్' నిర్మాణానికి ప్రతిజ్ఞ చేయాలని పిలుపు
- ఈ ఏడాది 'వందేమాతరం'కు ప్రత్యేక ప్రాధాన్యం

## చరిత్ర మన్మోహన్ సింగ్‌ను గౌరవంగా గుర్తుంచుకుంటుంది: బొగ్గు కుంభకోణం కేసు క్లీన్ చిట్‌పై సోనియా గాంధీ



- మన్మోహన్ పై రాజకీయ దుష్ప్రచారాలకు తెరపడిందన్న సోనియా
- విచారణ కోర్టు తీర్పును సుప్రీంకోర్టు తప్పుపట్టడాన్ని స్వాగతించిన సోనియా

## నేతాజీ అస్థికల తరలింపు.. కుమార్తె పిటిషన్‌పై కేంద్రానికి సుప్రీంకోర్టు నోటీసులు



- నేతాజీ అస్థికలను జపాన్ నుంచి భారత్‌కు తీసుకురావాలని పిటిషన్
- సుప్రీంకోర్టును ఆశ్రయించిన నేతాజీ కుమార్తె అనితా బోస్ ఫఫ్
- పిటిషన్‌పై స్పందించాలని కేంద్ర ప్రభుత్వానికి సుప్రీం నోటీసులు
- గతంలో ఇదే అంశంపై దాఖలైన పిటిషన్‌ను తిరస్కరించిన ధర్మాసనం



## సీఎం సోదరులు షెల్ కంపెనీలతో లబ్ధి పొందుతున్నారు

- సీఎం రేవంత్ రెడ్డి సోదరులపై కేటీఆర్ సంచలన ఆరోపణలు
- టెసరాక్ కంపెనీకి రూ.200 కోట్ల విలువైన భూమి కేటాయించారని విమర్శ




## 18 నుంచి అమల్లోకి..

- పార్కు చుట్టూ అండర్‌పాస్‌ల నిర్మాణం నేపథ్యంలో ఈ నిర్ణయం
- "కేబీఆర్ పార్కు చుట్టూ అవసరమైన ప్రదేశాల్లో సరైన లేన్ మార్కింగ్‌లు, లేన్ ఛేంజర్లు ఏర్పాట్లు చేశాం
- కీలకమైన కూడళ్లలో దిశానిర్దేశం చేసేందుకు ట్రాఫిక్ సైన్ బోర్డులు ఉంచాం

## పాతబస్తీ మెట్రో రైల్ పనులను
# వేగవంతం చేయాలి
### ఈ కారిడార్‌లో పనులకు సంబంధించిన టెండర్ ప్రక్రియను ప్రారంభించాలి

- ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కిలోమీటర్ల మెట్రో విస్తరణ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలి

హైదరాబాద్: హైదరాబాద్ మెట్రో విస్తరణ రెండో దశలో భాగంగా పాతబస్తీ మెట్రో రైల్ పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ పై ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షలో ముఖ్యమంత్రి పలు ఆదేశాలిచ్చారు. ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కిలోమీటర్ల మెట్రో విస్తరణ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. ఈ కారిడార్‌లో పనులకు సంబంధించిన టెండర్ ప్రక్రియను ప్రారంభించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న భూ సేకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. హైదరాబాద్ మెట్రోకు పెరుగుతున్న ప్రయాణికుల



రద్దీకి అనుగుణంగా అదనపు కోచ్‌లను జత చేయాలని చెప్పారు. ఇందుకు అవసరమైన కోచ్‌ల కొనుగోలు ప్రక్రియకు చర్యలు తీసుకోవాలన్నారు. మెట్రో ఫేజ్-2లో భాగంగా ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణ గుట్ట వరకు 7.5 కిలోమీటర్ల కారిడార్‌కు సంబంధిం చి ప్రస్తుత సాంకేతికతపై ఢిల్లీ మెట్రోను సంప్రదించి, అవసరమైన సలహాలు తీసుకోవాలని సూచించారు.

ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు , ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ , సలహాదారులు రామకృష్ణా రావు , ఎస్వీఎస్ రెడ్డి మెట్రో రైల్ ఎండీ సర్ఫరాజ్ అహ్మద్ , అదనపు ఎండీ అజిత్ రెడ్డి పాల్గొన్నారు.



## చంద్రుడిపై శాశ్వత స్థావరం.. భారత్‌ను భాగస్వామిగా ఆహ్వానించిన నాసా

- మూన్ బేస్ కార్యక్రమంలో చేరాలని నాసా ఆహ్వానం
- చంద్రుడి దక్షిణ ధ్రువం వద్ద స్థావరం ఏర్పాటుకు ప్రణాళిక
- చంద్రయాన్-3 విజయంతో భారత్‌కు ప్రత్యేక గుర్తింపు
- ఆర్టెమిస్ ఒప్పందం కింద సహకారం మరింత విస్తరణ
- ఇస్రో గగన్‌యాన్, స్పేస్ విజన్ 2047కు కొత్త ఆశలు



## ప్రతి చిన్నారికి ప్రపంచ స్థాయి విద్యను అందించడమే లక్ష్యం

- తెలంగాణ మోడల్ దేశానికే స్ఫూర్తిగా నిలుస్తుంది
- పేద పిల్లల కలలకు బలమైన పునాదులు వేయాలంటే నిజమైన సంకల్పం ఉండాలి: రేవంత్ రెడ్డి
- యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణాలు వేగంగా సాగుతున్నాయన్న రేవంత్

# దళారుల వ్యవస్థను నిర్మూలించి, కళాకారులకు అండగా నిలవడమే లక్ష్యం
### హస్త కళాకారులకు నాణ్యమైన కలప సరఫరాపై పవన్ సమీక్ష

- హస్త కళాకారులకు అండగా ప్రభుత్వం.. లాభం లేకుండా కలప సరఫరాకు పవన్ ఆదేశం
- కేవలం నిర్వహణ ఖర్చులకే కలప అందించాలని ఆదేశం
- రాష్ట్రంలోని ఆరు ప్రాంతాల్లో క్రాఫ్ట్ వుడ్ బ్యాంకుల ఏర్పాటుకు చర్యలు



అమరావతి: రాష్ట్రంలోని సంప్రదాయ హస్తకళాకారులకు అండగా నిలిచేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వారికి అవసరమైన నాణ్యమైన కలపను ఎటువంటి లాభాపేక్ష లేకుండా, అసలు ధరకే మిగతా 2 లో

## తప్పులకు 'ఏఐ'ని నిందిస్తే కుదరదు
# బ్యాంకులకు ఆర్బీఐ గట్టి హెచ్చరిక

ఢిల్లీ: కృత్రిమ మేధ (ఏఐ) వినియోగంలో బ్యాంకులు అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) గవర్నర్ సంజయ్ మల్హోత్రా స్పష్టం చేశారు. 'ఏఐ' వ్యవస్థలు తీసుకునే నిర్ణయాలకు సంబంధించి పూర్తి జవాబుదారీతనం బ్యాంకులదేనని, పొరపాటు జరిగినప్పుడు ఏఐ మోడళ్లను నిందించడం ఆమోదయోగ్యం కాదని గట్టిగా హెచ్చరించారు. మంగళవారం ముంబైలో ఫిక్కీ, ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహించిన 'ఫైబాక్ 2026' సదస్సులో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. ఏదైనా నిర్ణయం విషయంలో అంతిమ బాధ్యత బ్యాంకుదే తప్ప, సేవలు అందించిన వెండార్‌ది, అల్గారిథమ్‌ది కాదని మల్హోత్రా స్పష్టం చేశారు. "ఈ నిర్ణయం తీసుకున్నది మోడల్ అని చెప్పడం సమర్థనీయం కాదు. రెగ్యులేటర్‌గా మేము కానీ, కస్టమర్లు కానీ ఇటువంటి సమాధానాలను ఎప్పటికీ అంగీకరించం" అని ఆయన తేల్చి చెప్పారు. మానవ మేధస్సుకు ప్రత్యామ్నాయంగా కాకుండా, దానికి అదనపు తోడ్పాటునిచ్చే సాధనంగా మాత్రమే ఏఐని వినియోగించుకోవాలని సూచించారు. ఏఐ అందించే సిఫార్సులను విశ్లేషించగలగడం, అవసరమైనప్పుడు జోక్యం చేసుకుని వాటిని సవరించగలగడం వంటి పటిష్టమైన మానవ పర్యవేక్షణ వ్యవస్థలో అంతర్భాగంగా ఉండాలని మల్హోత్రా నొక్కిచెప్పారు. ప్రతి బ్యాంకు బోర్డు ఆమోదించిన నిర్దిష్ట ఏఐ విధానాన్ని కలిగి ఉండాలని, థర్డ్-పార్టీల నుంచి సేవలు పొందినప్పటికీ ఫలితాలకు బ్యాంకులే జవాబుదారీగా ఉండాలని స్పష్టం చేశారు. కస్టమర్ సేవలను మెరుగుపరచడం, జీఎస్టీ ఫైలింగ్స్, డిజిటల్ ఫుట్‌ప్రింట్స్ వంటి డేటా ఆధారంగా రుణ సదుపాయాలను విస్తరించడం, మోసాలను గుర్తించడం వంటి అంశాల్లో ఏఐకి అపారమైన సామర్థ్యం ఉందని గవర్నర్ పేర్కొన్నారు. అదే సమయంలో, మోడల్ పక్షపాతం, డేటా గోప్యత, సైబర్ భద్రతా ముప్పుల పట్ల బ్యాంకులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఏఐ ద్వారా జరిగే మోసాలను అడ్డుకోవడానికి కూడా తిరిగి అదే ఏఐ సాంకేతికతను ఆయుధంగా వినియోగించుకోవాలని వ్యాఖ్యానించారు.

## రాజకీయ వైరాలు పక్కనబెట్టి ఒకే చోట.. రేవతి సూలే రిసెప్షన్‌లో ప్రధాని మోదీ, అమిత్ షా, రాహుల్ గాంధీ

ఢిల్లీ : ఢిల్లీ వేదికగా దేశ రాజకీయాలలోని దిగ్గజ నేతలందరూ ఒకే వేదికపై కొలువుదీరిన ఒక అరుదైన, ఆసక్తికర ఘట్టం ఆవిష్కృతమైంది. ఎన్సీపీ (ఎస్పీ) వర్కింగ్ ప్రెసిడెంట్, ఎంపీ సుప్రియా సూలే కుమార్తె రేవతి సూలే - సారంగ్ లఖానీల వివాహ రిసెప్షన్ వేడుక దేశ రాజధానిలోని శరద్ పవార్ నివాసంలో అత్యంత వైభవంగా జరిగింది. నిత్యం రాజకీయ ప్రత్యర్థులుగా పార్లమెంటులోనూ, పబ్లిక్ వేదికలపై సవాళ్లు విసురుకునే అగ్ర నేతలందరూ తమ వైరి వర్గాలను పక్కనబెట్టి ఈ వేడుకకు హాజరయ్యారు. ఈ రిసెప్షన్‌కు ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీలతో పాటు కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, ప్రియాంక గాంధీ, మల్లికార్జున ఖర్గే, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భగవత్ తదితర ప్రముఖులు విచ్చేసి కొత్త దంపతులను ఆశీర్వదించారు. ప్రధాని మోదీ, అమిత్ షా, శరద్ పవార్ ఒకే ఫ్రేమ్‌లో నిలిచి ఆప్యాయంగా పలకరించుకోవడం, రాహుల్-సోనియా కుటుంబ సమేతంగా పవార్ కుటుంబంతో ముచ్చటించడం నెటిజన్లు, మీడియా దృష్టిని విశేషంగా ఆకర్షించింది.

## త్వరలో రూ.10, రూ.20 ప్లాస్టిక్ నోట్లు..
# ఫీల్డ్ ట్రయల్స్‌కు కేంద్రం గ్రీన్ సిగ్నల్

ఢిల్లీ: దేశంలో త్వరలో పాలిమర్ (ప్లాస్టిక్) కరెన్సీ నోట్లు చెలామణిలోకి రానున్నాయి. రూ.10, రూ.20 విలువ కలిగిన పాలిమర్ నోట్లను క్షేత్రస్థాయి ప్రయోగాల కోసం జారీ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఒక్కో డినామినేషన్‌లో వంద కోట్ల చొప్పున నోట్లను ప్రయోగాత్మకంగా జారీ చేసే ప్రతిపాదనను ఆమోదించినట్టు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నేడు పార్లమెంటుకు వెల్లడించారు. భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) సెంట్రల్ బోర్డు సిఫార్సు మేరకు 'ఆర్‌బీఐ చట్టం-1934'లోని సెక్షన్ 25 ప్రకారం ఈ ప్రతిపాదనను ప్రభుత్వానికి పంపింది. ఈ క్షేత్రస్థాయి ప్రయోగాలు విజయవంతమైతే భవిష్యత్తులో ఈ రెండు విలువల్లోని పాలిమర్ నోట్లను క్రమబద్ధంగా జారీ చేసే అవకాశం ఉంటుంది. అయితే, ప్రస్తుతం చెలామణిలో ఉన్న కాగితపు నోట్ల స్థానంలో వీటిని తీసుకురావడం లేదని, వాటితో పాటే ఈ కొత్త నోట్లు కూడా అందుబాటులో ఉంటాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. పాలిమర్ నోట్ల సేకరణ ప్రక్రియ ఇంకా ప్రాథమిక దశలోనే ఉందని ఆర్‌బీఐ పేర్కొంది. అందువల్ల, వీటిని ఎప్పుడు ప్రవేశపెడతారు, దీనికి ఎంత ఖర్చవుతుంది అనే విషయాలపై ఇప్పుడే కచ్చితమైన వివరాలు చెప్పలేమని తెలిపింది. అంతర్జాతీయంగా చూస్తే, కాగితపు నోట్లతో పోలిస్తే పాలిమర్ నోట్లు ఎక్కువ కాలం మన్నుతాయి. ఈ ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకునే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

## సీఎం సోదరులు షెల్ కంపెనీలతో లబ్ధి పొందుతున్నారు

హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరులు నామమాత్రపు అర్హతలతో భారీ కంపెనీలను రిజిస్టర్ చేస్తూ, రాష్ట్ర ప్రభుత్వం ద్వారా పెద్ద ఎత్తున లబ్ధి పొందుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆరోపణలు చేశారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి సోదరులు బడా కంపెనీలకు యజమానులుగా మారుతున్నారని కేటీఆర్ ఆరోపించారు. కనీసం ఒక్క ఉద్యోగి కూడా లేని కంపెనీలను చిన్న నివాసాల చిరునామాలతో రిజిస్టర్ చేయించారని పేర్కొన్నారు. అటువంటి ఒక కంపెనీకే దాదాపు రూ. 200 కోట్ల విలువైన ఐదు ఎకరాల భూమిని ప్రభుత్వం కట్టబెట్టిందని విమర్శించారు. ముఖ్యంగా, అనుముల కొండల్ రెడ్డి తన లింక్డ్ఇన్ ప్రొఫైల్‌లో 'టెసరాక్' కంపెనీకి ఛైర్మన్‌గా ఉన్నట్లు పేర్కొన్నారని తెలిపారు. మరో సోదరుడు జగదీశ్ రెడ్డి కాంట్రాక్టులు దక్కించుకుంటుండగా, ముఖ్యమంత్రి బావమరిది సృజన్ రెడ్డికి సింగరేణిలో కాంట్రాక్ట్ కట్టబెట్టారని ఆరోపించారు. ప్రతిపాదిత ఫోర్త్ సిటీ పరిధిలోని భూముల కేటాయింపులపై బీఆర్ఎస్ అధికార ప్రతినిధి మన్నె క్రిశాంక్ ఒకరోజు ముందే ఇవే తరహా ఆరోపణలు చేసిన నేపథ్యంలో కేటీఆర్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. కొండల్ రెడ్డి ఛైర్మన్‌గా ఉన్న టెసరాక్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు మహేశ్వరం మండలం రావిర్యాలలో సుమారు ఐదు ఎకరాల భూమిని కేవలం రూ. 7 కోట్లకు కేటాయించారని, దాని అసలు మార్కెట్ విలువ రూ. 100 కోట్లకు పైగా ఉంటుందని క్రిశాంక్ పేర్కొన్నారు. ఆ కంపెనీకి కేవలం రూ.లక్ష మూలధనం ఉందని, పటాన్‌చెరులోని ఒక చిన్న నివాసం నుంచి కార్యకలాపాలు సాగిస్తోందని ఆరోపించారు. కాగా, క్రిశాంక్ చేసిన ఆరోపణలను మంత్రి డి.శ్రీధర్ బాబు తీవ్రంగా ఖండించారు.

## తెలంగాణలో ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తి..
# 73 లక్షల ఓట్లు పోయినట్టే

హైదరాబాద్: తెలంగాణ వ్యాప్తంగా ఎంతో ఆసక్తి రేపిన ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ఎన్యూమరేషన్ ప్రక్రియ ముగిసింది. ఈ భారీ సవరణ ప్రక్రియలో భాగంగా రాష్ట్రంలో మొత్తం 3.38 కోట్ల మంది ఓటర్లు ఉన్నట్లు ఎన్నికల అధికారులు ప్రాథమికంగా లెక్క తేల్చారు. సేకరించిన సమాచారంలో ఇప్పటి వరకు దాదాపు 2.64 కోట్ల ఫారాలను డిజిటలైజేషన్ పూర్తి చేయగా, నమోదు ప్రక్రియ 78.30 శాతానికి చేరింది. అయితే ఈ నమోదు సరళిని గమనిస్తే రాబోయే రోజుల్లో రాష్ట్ర ఓటర్ల జాబితా స్వరూపమే మారిపోనుందని స్పష్టమవుతోంది. మరోవైపు, క్షేత్రస్థాయి పరిశీలనలో అధికారులకు సవాలుగా మారిన అనేక అంశాలు వెలుగుచూశాయి. మొత్తం 73.39 లక్షల ఎన్యూమరేషన్ ఫారాలను (21.70 శాతం) వివిధ కారణాల వల్ల సేకరించలేకపోయినట్లు అధికారులు 'అన్‌కలెక్టబుల్'గా వర్గీకరించారు. ఇందులో అత్యధికంగా 45.18 లక్షల మంది ఓటర్లు తమ నివాస ప్రాంతాల నుంచి శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లినట్లు గుర్తించగా, 9.22 లక్షల మంది ఓటర్లు మరణించినట్లు నమోదైంది. మరో 11.25 లక్షల మంది అసలు జాడ తేలక అడ్రస్ దొరకని స్థితిలో ఉండగా, 6.70 లక్షల మందికిపైగా ఇప్పటికే వేర్వేరు ప్రాంతాల్లో ఓటర్లుగా నమోదై ఉన్నట్లు అధికారులు తేల్చారు. ఈ భారీ వ్యత్యాసాలు, వలసల గణాంకాల నేపథ్యంలో తుది ఓటర్ల జాబితా ప్రక్షాళనలో ఊహించని పెద్ద మార్పులు చోటుచేసుకోనున్నాయి.

## తిరుమలలో భారీ రద్దీ.. శ్రీవారి సర్వదర్శనానికి 18 గంటలు

తిరుపతి: శ్రీ వేంకటేశ్వర స్వామి దర్శనానికి భక్తులు పోటెత్తడంతో తిరుగిరులు భక్తజనసందోహంతో కిటకిటలాడుతున్నాయి. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని కంపార్ట్‌మెంట్లన్నీ భక్తులతో నిండిపోగా, వేలాది మంది భక్తులు వెలుపల క్యూలైన్లలో వేచి ఉన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న విపరీతమైన రద్దీ దృష్ట్యా, ఎలాంటి దర్శన టోకెన్లు లేని సాధారణ భక్తులకు శ్రీవారి సర్వదర్శనం లభించడానికి సుమారు 18 గంటల సమయం పడుతోందని టీటీడీ అధికారులు వెల్లడించారు. క్యూలైన్లలో గంటల తరబడి వేచి ఉన్న భక్తుల సౌకర్యార్థం టీటీడీ యంత్రాంగం నిరంతరాయంగా పాలు, తాగునీరు మరియు అన్నప్రసాదాలను పంపిణీ చేస్తోంది. నిన్న (ఆగస్టు 10న) ఒక్కరోజే 81,064 మంది భక్తులు స్వామివారిని దర్శించుకోగా, వారిలో 33,136 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. ఇక భక్తులు సమర్పించిన కానుకల ద్వారా హుండీ ఆదాయం రూ. 5.36 కోట్లుగా నమోదైందని టీటీడీ వెల్లడించింది. భక్తుల రద్దీ అధికంగా ఉన్నందున, దర్శన ప్రక్రియ సజావుగా సాగేందుకు భక్తులందరూ యంత్రాంగానికి సహకరించాలని, ఆలయ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని అధికారులు కోరారు.

## ప్రతి చిన్నారికి ప్రపంచ స్థాయి విద్యను అందించడమే లక్ష్యం

హైదరాబాద్: భవనాలు నిర్మించడం ఎవరికైనా సులభమే కావచ్చు.. కానీ పేద పిల్లల కలలకు బలమైన పునాదులు వేయాలంటే ప్రభుత్వానికి నిజమైన సంకల్పం ఉండాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్' నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయంటూ సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. కులం, మతం, ప్రాంతం, పేదరికం అనే అసమానతలను చెరిపేస్తూ... ప్రతీ చిన్నారికీ కార్పొరేట్‌తో సమానమైన ప్రపంచ స్థాయి విద్యను అందించడమే తమ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ఆయన ప్రకటించారు. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో అత్యాధునిక మౌలిక వసతులతో రూపుదిద్దుకుంటున్న ఈ సమీకృత గురుకులాలు సాధారణ పాఠశాలలు మాత్రమే కావని... పేద కుటుంబాల పిల్లలను రేపటి శాస్త్రవేత్తలుగా, పరిపాలకులుగా, పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే జ్ఞాన మందిరాలని సీఎం అన్నారు. పేద పిల్లల ఉన్నత కలలకు శాశ్వత చిరునామాగా నిలుస్తూ, దేశానికే 'తెలంగాణ మోడల్' విద్యారంగానికి ప్రతీకగా నిలిచేలా ఈ యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్లు తరతరాల భవిష్యత్తును మార్చబోతున్నాయని రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

# 2025-26 రెండో త్రైమాసికంలో 10.7శాతం వృద్ధిరేటు నమోదు

మొదటి పేజి తరువాయి

ఏపీ, 2025-26 ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో 10.7 శాతం వృద్ధిరేటును నమోదు చేసింది. అయితే, ఈ సానుకూల వాతావరణంలోనూ ఎల్ నినో రూపంలో పొంచివున్న ముప్పును ముందుగానే పసిగట్టిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, దానిని అధిగమించి రాష్ట్రాన్ని 15 శాతం వృద్ధిరేటు పథంలో నడిపించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో ప్రణాళికా విభాగం అధికారులు సమర్పించిన జూలై నెల ఆర్థిక నివేదికపై ఆయన సమీక్ష నిర్వహించారు.

అన్ని రంగాల్లోనూ అద్భుత ప్రగతి

ప్రణాళికా విభాగం నివేదిక ప్రకారం, రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్‌డీపీ) వృద్ధి రేటు 2023-24లో 6.5 శాతం ఉండగా, 2025-26 నాటికి 9.9 శాతానికి పెరిగింది. ముఖ్యంగా వ్యవసాయం, పరిశ్రమలు, సేవా రంగాల్లో గణనీయమైన వృద్ధి నమోదైంది. 2025-26 రెండో త్రైమాసికంలో వ్యవసాయ రంగం 13.5 శాతం, పారిశ్రామిక రంగం 10.6 శాతం, సేవా రంగం 9.9 శాతం చొప్పున వృద్ధి సాధించి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు మూలస్తంభాలుగా నిలిచాయి. పశుసంవర్ధక శాఖలో మాంసం, గుడ్ల ఉత్పత్తి పెరగడంతో పాటు, ఐటీ, రవాణా, వాణిజ్య కార్యకలాపాలు ఊపందుకున్నాయి. టెక్నాలజీ వినియోగంతో జీఎస్టీ వసూళ్లు 21 శాతం పెరిగి రూ.13,282



కోట్లకు చేరగా, రాష్ట్రంలో పెట్టుబడుల ప్రవాహం కూడా ఆశాజనకంగా ఉంది. రూ.2.88 లక్షల కోట్ల విలువైన మెగా ప్రాజెక్టులు, రూ.60 వేల కోట్ల ఎంఎస్ఎంఈ పెట్టుబడులు గ్రౌండింగ్‌లో మంచి వృద్ధిని కనబరిచాయి.

ఎల్ నినో సవాల్.. సీఎం దిశానిర్దేశం

ఈ ఆర్థిక ప్రగతిపై సంతృప్తి వ్యక్తం చేసినప్పటికీ, ఎల్ నినో ప్రభావంపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఆందోళన వ్యక్తం చేశారు. "రాష్ట్రంలో లోటు వర్షపాతం ఉంది. కృష్ణా నదిలో ప్రవాహాలు లేక శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టులు నిండలేదు. గోదావరి జలాలను కృష్ణా డెల్టాకు మళ్లించి ఆదుకున్నాం. భూగర్భ జలాలు కూడా తగ్గుతున్నాయి. ఈ పరిస్థితుల్లో జీఎస్‌డీపీ పడిపోకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి" అని ఆయన సూచించారు. ప్రజలపై ఎలాంటి ధరల భారం పడకుండా చూసేందుకు తక్షణమే ఒక కమిటీని ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు. "సామాన్యుడిపై భారం పడకూడదు. నీటి లభ్యత, ఉత్పత్తులకు విలువ జోడింపు వంటి అంశాలపై తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలి. వాణిజ్య పన్నుల శాఖ మాదిరిగా అన్ని శాఖల్లో టెక్నాలజీని వాడి లక్ష్యాలు సాధించాలి" అని స్పష్టం చేశారు. జిల్లా, నియోజకవర్గం, మండలాల వారీగా నివేదికలు సిద్ధం చేస్తే లక్ష్య సాధన సులభమవుతుందని తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్లకు ఎగుమతి అయ్యే ఉత్పత్తులపై ప్రభావం పడకుండా చూడాలని, మొత్తంగా రాష్ట్రాన్ని 15 శాతం వృద్ధిరేటు దిశగా నడిపించేందుకు అవసరమైన సమగ్ర కార్యాచరణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షలో ఆర్థిక, ప్రణాళికా శాఖ ముఖ్యకార్యదర్శి పీయూష్ కుమార్, ప్రణాళికా విభాగం ఈడీ వీఆర్ అలపర్తి, సీఎంఓ అధికారులు పాల్గొన్నారు.

## మయన్మార్‌లో చిక్కుకున్న ఏపీ యువతను ఆదుకుంటాం: మంత్రి లోకేశ్

అమరావతి: ఉద్యోగాల పేరుతో మోసపోయి మయన్మార్‌లో చిక్కుకున్న ఆంధ్రప్రదేశ్ యువతకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ భరోసా ఇచ్చారు. బ్యాంకాక్‌లో ఉద్యోగాలంటూ నమ్మించి కొందరిని మయన్మార్‌కు తరలించిన నేపథ్యంలో బాధితులను సురక్షితంగా స్వస్థలాలకు రప్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన ఏపీ భవన్ అధికారులను ఆదేశించారు. వివరాల్లోకి వెళితే.. బ్యాంకాక్‌లో మంచి ఉద్యోగాలు ఇప్పిస్తామన్న సైబర్ నేరగాళ్ల మాటలు నమ్మిన పలువురు నిరుద్యోగ యువకులు మయన్మార్‌లో చిక్కుకుపోయారు. ఈ విషయంపై స్పందించిన మంత్రి లోకేశ్, బాధితులకు ప్రభుత్వం అన్ని విధాలా సహాయం అందిస్తుందని స్పష్టం చేశారు. వారిని సురక్షితంగా వెనక్కి తీసుకువచ్చేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ యువతకు కీలక సూచనలు చేశారు. సైబర్ నేరగాళ్లు పన్నే ఉచ్చులో పడొద్దని, ఉద్యోగాల విషయంలో పూర్తిస్థాయిలో ఆరా తీయకుండా ఎవరినీ నమ్మవద్దని హితవు పలికారు. ఇలాంటి మోసాలపై యువత చైతన్యవంతులై అప్రమత్తంగా ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## చరిత్ర మన్మోహన్ సింగ్‌ను గౌరవంగా
# గుర్తుంచుకుంటుంది
# బొగ్గు కుంభకోణం కేసు క్లీన్ చిట్‌పై సోనియా గాంధీ

ఢిల్లీ: బొగ్గు బ్లాకుల కేటాయింపు కేసులో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు సుప్రీంకోర్టు క్లీన్ చిట్ ఇవ్వడం చారిత్రాత్మక ఘట్టమని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షురాలు సోనియా గాంధీ పేర్కొన్నారు. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రికకు ఆమె రాసిన ప్రత్యేక వ్యాసంలో... సుప్రీంకోర్టు తీర్పుతో మన్మోహన్ సింగ్‌పై ఇన్నాళ్లూ జరిగిన రాజకీయ కక్షసాధింపులకు, దుష్ప్రచారాలకు తెరపడిందని స్పష్టం చేశారు. "నాడు (2014 జనవరిలో) మన్మోహన్ సింగ్ చెప్పినట్లుగానే చరిత్ర ఆయన పట్ల చాలా దయతో, గౌరవంగా ప్రవర్తిస్తుంది" అని ఆమె గుర్తుచేశారు. సీబీఐ దాఖలు చేసిన క్లోజర్ నివేదికను ఆమోదిస్తూ, విచారణ పరిధి దాటి వ్యాఖ్యలు చేసిన విచారణ కోర్టు తీరును సుప్రీంకోర్టు తప్పుపట్టడాన్ని సోనియా గాంధీ స్వాగతించారు. మన్మోహన్ సింగ్ సమగ్రతను, మచ్చలేని రాజకీయాన్ని దెబ్బతీసేందుకు అప్పట్లో రాజకీయ ప్రత్యర్థులు, కొందరు అధికారులు మరియు మీడియా ప్రణాళికాబద్ధంగా కుట్ర పన్నారని ఆరోపించారు. ప్రస్తుత మోదీ ప్రభుత్వంపై మండిపడుతూ... సీబీఐ, ఈడీ వంటి దర్యాప్తు సంస్థలను రాజకీయ అవసరాలకు వాడుకుంటున్నారని విమర్శించారు. యూపీఏ హయాంలో సాధించిన ఆర్థిక పురోగతి, ఉపాధి హామీ, విద్యా హక్కు, ఆహార భద్రత చట్టాల ప్రాధాన్యతను వివరిస్తూ.. మన్మోహన్ సింగ్ ప్రశాంతంగా ఉన్నప్పటికీ దేశానికి అత్యంత కీలకమైన సేవలు అందించిన ప్రధానిగా నిలిచిపోతారని కొనియాడారు.

## దళారుల వ్యవస్థను నిర్మూలించి, కళాకారులకు అండగా నిలవడమే లక్ష్యం

అమరావతి: రాష్ట్రంలోని సంప్రదాయ హస్తకళాకారులకు అండగా నిలిచేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వారికి అవసరమైన నాణ్యమైన కలపను ఎటువంటి లాభాపేక్ష లేకుండా, అసలు ధరకే అందించాలని ఉప ముఖ్యమంత్రి, అటవీ పర్యావరణ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో 'క్రాఫ్ట్ వుడ్ బ్యాంకుల' ఏర్పాటుపై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. కలప సేకరణ, రవాణా, నిల్వకు అయ్యే వాస్తవ వ్యయాన్ని మాత్రమే వసూలు చేస్తూ చేతివృత్తుల వారికి ముడిసరుకును సరఫరా చేయాలని స్పష్టం చేశారు. ముడిసరుకు కొరతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న కళాకారులకు ఈ వుడ్ బ్యాంకులు ఒక భరోసాగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ ప్రక్రియలో దళారుల ప్రమేయాన్ని పూర్తిగా తొలగించడం ద్వారా కళాకారుల ఉత్పత్తి వ్యయం తగ్గి, వారికి ఆర్థిక భరోసా లభిస్తుందని వివరించారు. రాష్ట్రంలోని కొండపల్లి, ఏటికొప్పాక, సెట్టిగుంట, మాధవమాల, ఉదయగిరి, బొబ్బిలి వంటి ఆరు ప్రధాన కేంద్రాల్లో ఈ క్రాఫ్ట్ వుడ్ బ్యాంకులను ఏర్పాటు చేయనున్నారు. కొండపల్లి బొమ్మలకు అవసరమైన తెల్లపొనికి, ఏటికొప్పాక హస్తకళలకు వినియోగించే అంకుడు, బొబ్బిలి వీణల తయారీకి వాడే పనస, రోజ్‌వుడ్ వంటి కలపను ఈ బ్యాంకుల ద్వారా సరఫరా చేస్తారు. అలాగే, రాజమండ్రి సెంట్రల్ వుడ్ బ్యాంకులో వెదురు, టేకు వంటివి అందుబాటులో ఉంటాయి. అరుదైన కలప జాతుల లభ్యతను మ్యాపింగ్ చేసి, వాటిని అటవీ నర్సరీలలో సాగు చేసేలా చర్యలు తీసుకోవాలని పవన్ అధికారులను ఆదేశించారు.

## ప్రతి ఇంటా త్రివర్ణ పతాకం.. ఆగస్టు 15ను పండుగలా జరుపుకుందాం: మోదీ

ఢిల్లీ: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో ప్రజలు చురుగ్గా పాల్గొనాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఆగస్టు 15న ప్రతి ఇంటా త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులర్పించాలని కోరారు. 'హర్ ఘర్ తిరంగా.. ఘర్ ఘర్ తిరంగా.. హర్ మన్ తిరంగా' అంటూ దేశ ప్రజల్లో స్ఫూర్తి నింపారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ రీల్‌ను షేర్ చేసుకున్న ప్రధాని.. ఆగస్టు 15ను గర్వంగా జరుపుకోవాలని సూచించారు. 'వికసిత్ భారత్' నిర్మాణానికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయాలని పిలుపునిచ్చారు. "ప్రతి ఇంటా హర్ ఘర్ తిరంగాను ఓ వేడుకగా మార్చుకుందాం" అని పేర్కొన్నారు. ఇటీవల 'ఎక్స్' వేదికగానూ మోదీ 'హర్ ఘర్ తిరంగా'లో ఉత్సాహంగా పాల్గొనాలని ప్రజలను కోరారు. త్రివర్ణ పతాకం దేశ గర్వానికి ప్రతీక అని తెలిపారు. దేశం కోసం అత్యుత్తమంగా పనిచేయాలనే స్ఫూర్తిని అది అందిస్తుందని పేర్కొన్నారు. ఈ ఏడాది 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని 'వందేమాతరం' 150వ వార్షికోత్సవానికి అంకితం చేస్తున్నట్లు ప్రధాని తెలిపారు. దేశభక్తి, త్రివర్ణం పతాకంపై గర్వం, మాతృభూమిపై ప్రేమను చాటేలా కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్'లో భాగంగా ప్రారంభమైన 'హర్ ఘర్ తిరంగా' ద్వారా జాతీయ పతాకంతో ప్రజలకు మరింత వ్యక్తిగత అనుబంధం ఏర్పడేలా ప్రోత్సహిస్తున్నారు.

# డీఎస్సీ వ్యవహారంపై సీబీఐ విచారణ జరగాల్సిందే..
## నారా లోకేశ్ తక్షణమే రాజీనామా చేయాలి: రోజా

అమరావతి: కూటమి ప్రభుత్వం చేపట్టిన మెగా డీఎస్సీలో భారీగా అక్రమాలు, అవకతవకలు జరిగాయని, ఈ కుంభకోణానికి బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని మాజీ మంత్రి, వైసీపీ నాయకురాలు ఆర్కే రోజా డిమాండ్ చేశారు. నిరుద్యోగులను నట్టేట ముంచిన డీఎస్సీ ప్రక్రియపై సీబీఐ చేత తటస్థ విచారణ జరిపించాలని కోరుతూ నగరి నియోజకవర్గం పుత్తూరు పట్టణంలో ఆమె ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహం వద్ద ఆమె మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇచ్చిన మొట్టమొదటి ఉద్యోగ నోటిఫికేషన్‌లోనే పేపర్ లీకేజీలు, అవినీతి అక్రమాలు రాజ్యమేలాయని రోజా తీవ్రస్థాయిలో ఆరోపించారు. ప్రశ్నాపత్రాన్ని తయారు చేసిన నవీన్ అనే వ్యక్తికే మొదటి ర్యాంక్ రావడమే పేపర్ లీక్ అయిందనడానికి సజీవ సాక్ష్యమని స్పష్టం చేశారు. పేపర్ లీకేజీ నిజం కాకపోతే మొదటి ర్యాంకర్ నవీన్‌కు ఉద్యోగం ఇవ్వకుండా, రెండో ర్యాంక్ నుంచి ఎందుకు నియామకాలు చేపట్టారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. మరోవైపు స్పోర్ట్స్ కోటా పేరుతో దొంగ జీవోలను తెచ్చి, పోస్టులను విచ్చలవిడిగా అమ్ముకుని రూ. కోట్లు దోచుకున్నారని మండిపడ్డారు. విద్యార్థులు, నిరుద్యోగుల భవిష్యత్తుతో ఆడుకోవడం ఆపి, వెంటనే పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పాటు నిరుద్యోగ భృతిని విడుదల చేయాలని ఆర్కే రోజా డిమాండ్ చేశారు.

## కేబీఆర్ పార్కు చుట్టూ వన్‌వే.. 18 నుంచి అమల్లోకి..

హైదరాబాద్: నగరంలోని కేబీఆర్ పార్కు చుట్టూ ఈనెల 18 నుంచి వన్ వే అమలు చేయనున్నారు. ఈ మేరకు హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు వెల్లడించారు. పార్కు చుట్టూ అండర్‌పాస్‌ల నిర్మాణం నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. వన్ వే కోసం ఇప్పటికే అన్ని ఏర్పాట్లను పూర్తిచేసినట్లు సీపీ సజ్జనర్ వెల్లడించారు. "కేబీఆర్ పార్కు చుట్టూ అవసరమైన ప్రదేశాల్లో సరైన లేన్ మార్కింగ్‌లు, లేన్ ఛేంజర్‌లు ఏర్పాట్లు చేశాం. కీలకమైన కూడళ్లలో దిశానిర్దేశం చేసేందుకు ట్రాఫిక్ సైన్ బోర్డులు ఉంచాం. వాహనదారులకు మార్గనిర్దేశం, సహాయం అందించడానికి ముఖ్యమైన ప్రదేశాల్లో 24ఐ7 ట్రాఫిక్ సిబ్బందిని నియమించాం. ప్రయాణికులు తమ ప్రయాణాన్ని సులభంగా ప్లాన్ చేసుకునేందుకు గూగుల్ మ్యాప్స్/నావిగేషన్ రూట్లలో అవసరమైన మార్పుల ప్రక్రియ చేశాం. ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్/సీసీటీవీ నెట్‌వర్క్ ద్వారా నిరంతర పర్యవేక్షణ ఉంటుంది. ట్రాఫిక్ రద్దీని ఎప్పటికప్పుడు అంచనా వేయడానికి డ్రోన్ల ద్వారా రియల్-టైమ్ పర్యవేక్షణ ఉంటుంది. వన్‌వే అమలు ప్రారంభంలో ట్రాఫిక్ పరిస్థితులను సమీక్షించి దానికి అనుగుణంగా అవసరమైన సర్దుబాట్లు చేస్తాం. వన్ వే ట్రాఫిక్ విధానాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజలు తమ ప్రయాణాలను ముందుగానే ప్లాన్ చేసుకోవాలి" అని సీపీ సూచించారు.

## చంద్రుడిపై శాశ్వత స్థావరం.. భారత్‌ను భాగస్వామిగా ఆహ్వానించిన నాసా

ఢిల్లీ: చంద్రుడిపై శాశ్వత స్థావరం ఏర్పాటు చేయాలన్న అమెరికా ప్రణాళికలో భారత్ భాగస్వామి అయ్యే అవకాశం ఉంది. నాసా ప్రతిపాదించిన 'మూన్ బేస్' కార్యక్రమంలో చేరాలని ఇస్రోను అమెరికా ఆహ్వానించింది. బెంగళూరులో ఆగస్టు 5, 6 తేదీల్లో జరిగిన భారత్-అమెరికా సివిల్ స్పేస్ జాయింట్ వర్కింగ్ గ్రూప్ సమావేశంలో ఈ ఆహ్వానం అందింది.

చంద్రుడిపై శాశ్వత స్థావరం

చంద్రుడి దక్షిణ ధ్రువం సమీపంలో మానవులు నివసించే తొలి శాశ్వత స్థావరాన్ని ఏర్పాటు చేయాలన్నది నాసా ప్రణాళిక. వ్యోమగాములు అక్కడ నివసించడంతో పాటు పరిశోధనలు చేయనున్నారు. ఇందుకోసం మానవ సహిత, మానవ రహిత మిషన్ల ద్వారా అవసరమైన మౌలిక వసతులను దశలవారీగా ఏర్పాటు చేయనున్నారు. చంద్రుడి దక్షిణ ధ్రువానికే నాసా ప్రాధాన్యం ఇస్తోంది. అక్కడ శాశ్వతంగా నీడలో ఉండే కొన్ని ప్రాంతాల్లో మంచు రూపంలో నీరు ఉండొచ్చని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. ఆ నీటిని తాగడానికి, ఆక్సిజన్, రాకెట్ ఇంధనంగా మార్చుకునే అవకాశం ఉంది. భవిష్యత్తులో అంగారకుడిపై మానవ యాత్రలకు చంద్రుడిని కీలక కేంద్రంగా ఉపయోగించుకోవాలన్నది నాసా లక్ష్యం.

భారత్ అనుభవానికి గుర్తింపు

చంద్రుడి దక్షిణ ధ్రువానికి సమీపంలో విజయవంతంగా సాఫ్ట్ ల్యాండింగ్ చేసిన తొలి దేశంగా భారత్‌కు ప్రత్యేక గుర్తింపు ఉంది. 2023 ఆగస్టులో చంద్రయాన్-3లోని విక్రమ్ ల్యాండర్, ప్రజ్ఞాన్ రోవర్ అక్కడ దిగాయి. ల్యాండింగ్ ప్రాంతానికి 'శివశక్తి పాయింట్'గా పేరు పెట్టారు. నాసా ఇప్పుడు అదే ప్రాంతంలో స్థావరం ఏర్పాటుకు సిద్ధమవుతున్న నేపథ్యంలో ఇస్రో అనుభవం కీలకంగా మారనుంది.

ఆర్టెమిస్ ఒప్పందంతో ముందుకు

మూన్ బేస్ సహకారం ఆర్టెమిస్ అకార్డ్స్ కింద భారత్-అమెరికా భాగస్వామ్యానికి కొనసాగింపుగా ఉండనుంది. శాంతియుత, పారదర్శక, సుస్థిర అంతరిక్ష అన్వేషణకు ఈ ఒప్పందం మార్గదర్శకంగా ఉంటుంది. 2023 జూన్ 21న భారత్ ఆర్టెమిస్ అకార్డ్స్‌పై సంతకం చేసింది.

బెంగళూరు సమావేశంలో అంతరిక్ష పరిశోధనల నుంచి లభించే శాస్త్రీయ సమాచారాన్ని పరస్పరం పంచుకోవడంపైనా చర్చలు ముందుకు తీసుకెళ్లాలని ఇరు దేశాలు నిర్ణయించాయి.

నిసార్ నుంచి చంద్రుడి వరకు

భారత్, అమెరికా ఇప్పటికే నిసార్ ఉపగ్రహం ద్వారా భారీ అంతరిక్ష సహకారాన్ని కొనసాగిస్తున్నాయి. భవిష్యత్‌లో శాస్త్రీయ పరిశోధనలు, మానవ అంతరిక్ష ప్రయాణ సాంకేతికతపై కలిసి పనిచేయాలని తాజా సమావేశంలో నిర్ణయించారు. భారత్ గగన్‌యాన్ కార్యక్రమంతో మానవ అంతరిక్ష యాత్రకు సిద్ధమవుతోంది. అంతరిక్ష కేంద్రం ఏర్పాటు, భవిష్యత్తులో చంద్రుడిపై మానవ కార్యకలాపాల వంటి లక్ష్యాలను 'స్పేస్ విజన్ 2047'లో భారత్ నిర్దేశించుకుంది. ఈ నేపథ్యంలో నాసా ఆహ్వానం ఇస్రోకు కీలక అవకాశంగా మారనుంది.

## యుద్ధ నేరాల కేసులో సిరియా మాజీ అధ్యక్షుడు అసద్‌కు మరణశిక్ష

ఢిల్లీ: సిరియా మాజీ అధ్యక్షుడు బషర్ అల్ అసద్‌కు మరణశిక్ష విధించారు. 14 ఏళ్ల సిరియా అంతర్యుద్ధం సమయంలో జరిగిన యుద్ధ నేరాలు, మానవ హక్కుల హననానికి సంబంధించిన కేసులో ఆయన్ను దోషిగా తేల్చిన కోర్టు కఠిన శిక్ష విధించింది. అసద్ ప్రస్తుతం దేశంలో లేకపోవడం గమనార్హం. అసద్ తమ్ముడు మహెర్ అల్ అసద్‌కు కూడా ఇదే కేసులో మరణశిక్ష పడింది. సిరియా సైన్యంలో కీలక బాధ్యతలు నిర్వహించిన ఆయన.. మాజీ పాలకుడి పాలనలో సైనిక వ్యవహారాల్లో ముఖ్య పాత్ర పోషించారు. అసద్‌కు మరో దగ్గరి బంధువు అతీఫ్ నజీబ్‌కు కూడా మరణశిక్ష విధించారు. 2011లో దక్షిణ సిరియాలోని దారా ప్రావిన్స్‌లో రాజకీయ భద్రతా విభాగానికి ఆయన అధిపతిగా ఉన్నారు. ఆ సమయంలో ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనలను అణచివేయడంలో కీలక పాత్ర పోషించినట్లు కోర్టు పేర్కొంది. 15 ఏళ్లలోపు చిన్నారులను ఉద్దేశపూర్వకంగా హతమార్చడం, హింసకు పాల్పడి మరణాలకు కారణం కావడం వంటి నేరాలకు నజీబ్ పాల్పడ్డారని కోర్టు నిర్ధారించింది. సిరియాలో కొత్తగా ఏర్పడిన తాత్కాలిక పాలకుల హయాంలో మాజీ ప్రభుత్వ నేతలపై జరుగుతున్న విచారణల్లో ఇది కీలక పరిణామంగా నిలిచింది. గత ప్రభుత్వంలో పనిచేసిన పలువురిపై ప్రస్తుతం కేసులు నడుస్తున్నాయి. ఇస్లామిస్ట్ నేతృత్వంలోని బలగాలు డమాస్కస్ వైపు దూసుకెళ్లడంతో 2024 డిసెంబరులో అసద్ కుటుంబంతో కలిసి సిరియా నుంచి పారిపోయారు. అనంతరం మాస్కోలో ఆశ్రయం పొందారు. మరోవైపు నజీబ్‌ను అరెస్టు చేసి విచారణకు హాజరుపరిచారు. మాజీ ప్రభుత్వంలో విచారణ ఎదుర్కొంటున్న అత్యున్నత స్థాయి అధికారుల్లో ఆయన ఒకరు.

## నేతాజీ అస్థికల తరలింపు.. కుమార్తె పిటిషన్‌పై
# కేంద్రానికి సుప్రీంకోర్టు నోటీసులు

ఢిల్లీ: స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ భౌతిక అవశేషాలను జపాన్ నుంచి భారత్‌కు తీసుకువచ్చేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ ఆయన కుమార్తె అనితా బోస్ పఫ్ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. ఈ పిటిషన్‌పై స్పందన తెలియజేయాలని కేంద్ర ప్రభుత్వానికి, విదేశాంగ, హోం మంత్రిత్వ శాఖలకు నేడు నోటీసులు జారీ చేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్ మాల్యా బాగ్చి, జస్టిస్ వి. మోహనతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించింది. నేతాజీ కుమార్తె తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపించారు. తదుపరి విచారణను సెప్టెంబర్ 28వ తేదీకి ధర్మాసనం వాయిదా వేసింది. దశాబ్దాలుగా జపాన్ రాజధాని టోక్యోలోని రెంకోజీ ఆలయంలో భద్రపరిచిన నేతాజీ అస్థికలను భారత్‌కు తీసుకురావాలని పిటిషన్‌లో కోరారు. నేతాజీ కుమార్తెగా, చట్టబద్ధమైన వారసురాలిగా తనకు ఈ అంశాన్ని కోర్టు ముందు ప్రస్తావించే హక్కు ఉందని అనితా బోస్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. కొన్ని నెలల క్రితం ఇదే అంశంపై దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించిన విషయం తెలిసిందే. ఈ ఏడాది మార్చిలో నేతాజీ సోదరుడి మనవడు ఆశిష్ రే దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనమే విచారించడానికి నిరాకరించింది. ఆ సమయంలో పిటిషన్‌ను వెనక్కి తీసుకునేందుకు అనుమతి కోరిన న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ, నేతాజీ కుమార్తె నేరుగా సుప్రీంకోర్టును ఆశ్రయిస్తారని తెలిపారు. ఆనాటి విచారణలో నేతాజీకి ఏకైక చట్టబద్ధమైన వారసురాలు అనితా బోస్ అని, ఆమె కూడా అస్థికలను వెనక్కి తీసుకురావాలనే కోరుకుంటున్నారని సింఘ్వీ వాదించారు. అయితే, "వారసురాలు పిటిషనర్‌గా లేరు. వారే స్వయంగా మా ముందుకు రావాలి. తెర వెనుక ఉండి పోరాటం చేయలేరు" అని ధర్మాసనం స్పష్టం చేసింది. నేతాజీ కుటుంబ సభ్యుల భావోద్వేగాలను గౌరవిస్తామని, అయితే చట్టపరమైన ప్రక్రియను సంబంధిత వారసులే ప్రారంభించాలని అప్పుడు సూచించింది. కోర్టు సూచనల మేరకే తాజాగా అనితా బోస్ పిటిషన్ దాఖలు చేయడంతో ధర్మాసనం విచారణకు స్వీకరించి కేంద్రానికి నోటీసులు జారీ చేసింది. తన తండ్రికి దేశంలో అంత్యక్రియలు నిర్వహించేందుకు వీలుగా అస్థికలను తీసుకురావడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని ఆమె తన పిటిషన్‌లో ఆరోపించారు.

## మంత్రాలయం మండల ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీ ఎన్నిక - డోన్ రంగనాథ్ శెట్టి అధ్యక్షుడిగా ఎన్నిక




మంత్రాలయం, శివ సూర్య, ఆగస్టు 11: మంత్రాలయం మండల ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీని జిల్లా అధ్యక్షుడు బిలేహళ్ భాస్కర్, జిల్లా కార్యదర్శి వెంకటగిరి, ట్రెజరర్ ప్రతాప్ రంగయ్య శెట్టి, పట్టణ అధ్యక్షుడు వెంకటేష్ శెట్టి, పట్టణ ఉపాధ్యక్షుడు మురారి కృష్ణయ్య శెట్టి ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. కార్యక్రమం జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమైంది. అనంతరం మంత్రాలయం వాసవి మహిళా సంఘం ఆధ్వర్యంలో వాసవి మాత ప్రార్థన నిర్వహించారు. ఎన్నికైన నూతన కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా విచ్చేసిన జిల్లా అధ్యక్షుడు బిలేహళ్ భాస్కర్, జిల్లా కార్యదర్శి వెంకటగిరి, ట్రెజరర్ ప్రతాప్ రంగయ్య శెట్టి, పట్టణ అధ్యక్షుడు వెంకటేష్ శెట్టి, ఉపాధ్యక్షుడు మురారి కృష్ణ శెట్టి తదితరులకు శాలువాలతో సత్కరించి పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు.పట్టణ అధ్యక్షుడు వెంకటేష్ శెట్టి మాట్లాడుతూ "ఆర్యవైశ్య సంఘం ఐక్యతతో ముందుకు సాగుతుంది. సంఘ సభ్యులందరి సహకారంతో సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తాము" అన్నారు. జిల్లా అధ్యక్షుడు బిలేహళ్ భాస్కర్ మాట్లాడుతూ "మండల స్థాయిలో సంఘాన్ని బలోపేతం చేయాలి. యువతను సంఘంలోకి ఆహ్వానించి సామాజిక సేవలో భాగస్వామ్యం చేయాలి" అని పిలుపునిచ్చారు.అధ్యక్షుడిగా డోన్ రంగనాథ్ శెట్టి, కార్యదర్శిగా కందుకూరి బసవరాజు, వైస్ అధ్యక్షుడిగా అరవింద్ శెట్టి, ట్రెజరీగా అవినాష్, సెక్రటరీగా ఎస్.ఆర్.నరసింహ, ట్రెజరీగా కప్ప రఘు, సభ్యులుగా వెంకటేష్ శెట్టి, సత్యనారాయణ, సంతోష్, రాజేష్ తదితరులు ఎన్నికయ్యారు.నూతన అధ్యక్షుడు డోన్ రంగనాథ్ శెట్టి మాట్లాడుతూ "సంఘ అభివృద్ధికి పూర్తిగా కట్టుబడి ఉంటాను. ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేసి సంఘాన్ని ముందుకు తీసుకెళ్లాలి. పేద విద్యార్థులకు, అవసరమైన వారికి అండగా నిలుస్తాము" అని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మంత్రాలయం మండలంలోని వివిధ గ్రామాల నుండి, అలాగే మంత్రాలయం పట్టణ కేంద్రంలోని ఆర్యవైశ్య సోదర సోదరీమణులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## 355వ రాఘవేంద్ర స్వామి ఆరాధన మహోత్సవాల ఏర్పాట్లపై అధికారులతో సమావేశం



మంత్రాలయం,శివ సూర్య, ఆగస్టు 11: శ్రీమఠం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థ స్వామీజీ ఆదేశాల మేరకు మంత్రాలయం రాఘవేంద్ర స్వామి 355వ ఆరాధన మహోత్సవాల ఏర్పాట్లపై మఠం మేనేజర్ , స్.కె.శ్రీనివాసరావు, ఏఏవో మాధవ శెట్టి ,రాజా అప్రమయ్యాచార్ అధికారులతో సమావేశం నిర్వహించారు.ఆగస్టు 27 నుండి సెప్టెంబర్ 2 వరకు జరిగే ఆరాధన ఉత్సవాలను విజయవంతం చేయడానికి అన్ని శాఖల అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో మంత్రాలయం రెవెన్యూ అధికారి రమాదేవి,



డిప్యూటీ ఎంపీడీవో ఉపేందర్ రెడ్డి, సిఐ దస్తగిరి బాబు, మాధవరం ఎస్సై విజయ్ కుమార్, మంత్రాలయం ఎస్సై మల్లికార్జున, విద్యుత్ ఏఈ గోవిందు, ఎమ్మిగనూరు ఫైర్ అధికారులు, ఆరోగ్యశాఖ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సురేష్, మేనేజర్ వెంకటేష్, ఇంజనీర్ సురేష్ కోనాపూర్, ఏపీఎస్ఆర్టీసీ ఎమ్మిగనూరు డిపో, కె.ఎస్.ఆర్.టి.సి రాయచూర్ డిపో అధికారులు పాల్గొన్నారు.మఠం మేనేజర్ ఎస్.కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ "లక్షలాది భక్తులు వచ్చే ఈ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించాలి. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలి" అని సూచించారు.రెవెన్యూ అధికారి రమాదేవి మాట్లాడుతూ "ఆరాధన ఉత్సవాల్లో భక్తులకు త్రాగునీరు, నీడ, కూర్చోవడానికి ఏర్పాట్లు చేయాలి. అధికారుల డ్యూటీలు స్పష్టంగా కేటాయించి ఎలాంటి అసౌకర్యం లేకుండా చూస్తాము" అన్నారు.డిప్యూటీ ఎంపీడీవో ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ "డ్రైనేజీలు, మురుగు కాలువలు అడ్డంకులు లేకుండా శుభ్రం చేస్తాము. త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా ట్యాంకర్ల ఏర్పాటు చేస్తాము" అని తెలిపారు.సీఐ దస్తగిరి బాబు మాట్లాడుతూ "ఆరాధన సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తాము. దొంగల నివారణకు ప్రత్యేక బృందాలు, సీసీ కెమెరాలతో నిఘా ఉంటుంది" అన్నారు.మంత్రాలయం ఎస్సై మల్లికార్జున మాట్లాడుతూ "ఆరాధన ఉత్సవాల్లో భక్తుల రక్షణకు తన సిబ్బందితో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేస్తాము. గుడి ప్రాంగణం, రద్దీ ప్రాంతాల్లో 24 గంటలు పోలీసులు గస్తీ నిర్వహిస్తారు. భక్తులు ప్రశాంతంగా దర్శనం చేసుకునేలా చర్యలు తీసుకుంటాము" అని తెలిపారు.మాధవరం ఎస్సై విజయ్ కుమారు మాట్లాడుతూ "ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఆరాధన ఉత్సవాల సమయంలో మంత్రాలయంలోకి భారీ వాహనాలను మాధవరం వద్ద ఆదోని వైపు డైవర్ట్ చేస్తాము. ఆటోలను కట్టడి చేసి ట్రాఫిక్ సజావుగా సాగేలా చర్యలు తీసుకుంటాము" అని చెప్పారు.విద్యుత్ ఏఈ గోవిందు మాట్లాడుతూ "ఆరాధన ఉత్సవాల్లో నిరంతరం విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకుంటాము. విద్యుత్ అంతరాయం లేకుండా ప్రత్యేక బృందాలను సిద్ధంగా ఉంచుతాము" అని హామీ ఇచ్చారు.ఆరోగ్యశాఖ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ మాట్లాడుతూ "ఉత్సవాల్లో ప్రత్యేక మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేస్తాము. అత్యవసర పరిస్థితుల కోసం అంబులెన్సులు సిద్ధంగా ఉంచుతాము" అని తెలిపారు.ఉత్సవాల్లో ఫైర్ శాఖలు అప్రమత్తంగా ఉండాలని, ఆర్టీసీ అధికారులు అదనపు బస్సులు నడపాలని అధికారులను ఆదేశించారు.

## ఎల్ నినో నేపథ్యంలో మంత్రాలయంలో రైతులకు అవగాహన,క్షేత్ర సందర్శన




మంత్రాలయం, శివ సూర్య, ఆగస్టు 11: ఎల్ నినో నేపథ్యంలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం నంద్యాల శాస్త్రవేత్తలు,కృషి విజ్ఞాన కేంద్రం బనవాసి,వ్యవసాయ శాఖ కర్నూలు ఆధ్వర్యంలో మంత్రాలయం మండలంలో రైతులకు ఎల్ నినో అవగాహన,క్షేత్ర సందర్శన కార్యక్రమాలు చేపట్టారు.వివిధ పంటలలో సమగ్ర పోషక యాజమాన్యం,తేమ సంరక్షణ పద్ధతులు రైతులకు వివరించారు.ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో అధిక నీటి అవసరం ఉన్న వరి,మొక్కజొన్న సాగు చేయవద్దని,ఆరుతడి పంటలైన కంది,సజ్జ,మినుము,ప్రొద్దుతిరుగుడు,కొర్రలు సాగు చేయాలని సూచించారు.క్షేత్ర సందర్శనలో ప్రత్తి,కంది పంటలను సందర్శించి బెట్ట యాజమాన్య పద్ధతులు తెలిపారు.పొటాషియం నైట్రేట్ 5గ్రా/లీ,19-19-19




10గ్రా/లీ లేదా యూరియా 20గ్రా/లీ పిచికారీ చేయాలని,పూత పిందె రాలకుండా ప్లానోఫిక్స్ 90మి.లీ/ఎకరా స్ప్రే చేయాలని సూచించారు.పత్తిలో రసం పీల్చే పురుగులకు ఇమిడాక్లోప్రిడ్ 80మి.లీ/లీ లేదా అసిటమిప్రిడ్ 40గ్రా/లీ లేదా ప్రొఫెనోఫోస్ 500మి.లీ/ఎకరా వాడాలని,గులాబీ రంగు పురుగుకు లింగాకర్షక బుట్టలు 4/ఎకరా పెట్టాలని తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారి జీ.గణేష్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని,ప్రతి రైతు పంట బీమా చేయించుకోవాలని కోరారు.అనంతరం నూనె గింజల మిషన్,అపరాలు మిషన్ పొలాలను సందర్శించారు.పొలం పిలుస్తుంది కార్యక్రమంలో పాల్గొన్నారు. వరప్రసాద్,వెటర్నరీ అసిస్టెంట్ పశుగ్రాస పంటలు సాగు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో డా.శివరామకృష్ణ,డా.నసీరుద్దీన్,డా.చైతన్య,డా.జయలక్ష్మి,డా.ఇషా పర్వీన్,డా.సతీష్ బాబు,డా.రమదేవి,తిరుమల రెడ్డి వ్యవసాయ విస్తరణ అధికారి,శాంతి రాజు,మాదన్న వి ఏ ఏ,వ్యవసాయ శాఖ సిబ్బంది,రైతులు పాల్గొన్నారు.

## జాతీయ ఆర్థికంగా వెనుకబడిన ప్రతిభావంతుల స్కాలర్షిప్ పరీక్షలో రచుమరి ఆదర్శ పాఠశాల నుండి 6 మంది ఎంపిక




మంత్రాలయం, శివ సూర్య, ఆగస్టు 11:గత డిసెంబర్ లో నిర్వహించిన జాతీయ ఆర్థికంగా వెనుకబడిన ప్రతిభావంతుల స్కాలర్షిప్-2025 పరీక్ష ఫలితాల్లో మంత్రాలయం మండలం రచుమరి ఆంధ్రప్రదేశ్ ఆదర్శ పాఠశాల నుండి 6 మంది విద్యార్థులు అర్హత సాధించారని ప్రిన్సిపాల్ అశోక్ నాయక్ తెలిపారు.సుశాంత్,కిరణ్,ఖాసు,హుస్సేన్ బాషా,మోక్షిత్,నిశ్వ ఎంపికయ్యారు.మండలంలో అత్యధికంగా ఈ పాఠశాల నుండే ఎంపిక కావడం గర్వకారణమన్నారు.ప్రిన్సిపాల్ అశోక్ నాయక్ మాట్లాడుతూ"విద్యార్థుల కష్టం,ఉపాధ్యాయుల కృషి ఫలితంగా ఈ విజయం సాధ్యమైంది.భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని"ఆకాంక్షించారు.విద్యార్థుల విజయానికి కృషి చేసిన ఉపాధ్యాయ బృందాన్ని ప్రిన్సిపాల్ ప్రత్యేకంగా అభినందించారు.ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్,ఉపాధ్యాయులు అందరూ అభినందించారు.ఈ s ా ం ్ ృ ్ర s ్ వ ు ం ల ో ప్రసాద్,సచిన్,సోమలింగం,సూర్య,భాగ్యలక్ష్మి,సుధ,యజ్ఞేశ్,మనోజ్,కిషన్,చెన్నకేశవులు,హైమవతి,శరత్,వెంకటేష్,ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## పేదల ఆరోగ్యమే కూటమి ప్రభుత్వ ధ్యేయం రూ.47.37 లక్షల సీఎంఆర్ఎఫ్ పంపిణీ





మంత్రాలయం, శివ సూర్య ,ఆగస్టు 11::పేదల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోంది.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అందిస్తున్న సీఎం సహాయనిధిలో భాగంగా 18వ విడతగా మంత్రాలయం నియోజకవర్గంలో 83 మంది లబ్ధిదారులకు రూ.47,37,394/- విలువైన చెక్కులను మంత్రాలయం టీడీపీ ఇంచార్జి ఎన్.రాఘవేంద్ర రెడ్డి,సొసైటీ చైర్మన్ ఎన్.రామకృష్ణ రెడ్డి,యువ నాయకులు ఎన్.రాకేష్ రెడ్డి,ఎన్.రాజారెడ్డి పంపిణీ చేశారు.మండలాల వారీగా కౌతాళం 24 మందికి రూ.10.83 లక్షలు,కోసిగి 24 మందికి రూ.11.93 లక్షలు,మంత్రాలయం 15 మందికి రూ.15.08 లక్షలు,పెద్దకడుబూరు 20 మందికి రూ.9.53 లక్షలు అందించారు.ఇప్పటివరకు 572 మంది లబ్ధిదారులకు సుమారు రూ.3 కోట్ల మేర సీఎంఆర్ఎఫ్ ద్వారా సహాయం అందింది.ఈ సందర్భంగా ఇంచార్జి రాఘవేంద్ర రెడ్డి మాట్లాడుతూ "సీఎం చంద్రబాబు నాయుడు,మంత్రి నారా లోకేష్ పేద ప్రజలను సొంత కుటుంబ సభ్యులుగా భావించి ఆపద సమయంలో అండగా నిలుస్తున్నారు.నియోజకవర్గంలో ఏ కుటుంబానికైనా అనారోగ్య సమస్య వచ్చి ఆర్థిక ఇబ్బందులు ఎదురైతే నా దృష్టికి తీసుకురండి.వీలైనంత వరకు ప్రభుత్వ సహాయాన్ని అందేలా చేసి ప్రతి కుటుంబానికి అండగా నిలబడతాను" అని తెలిపారు.సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక భరోసా కల్పించిన కూటమి ప్రభుత్వానికి,సహాయం అందేలా కృషి చేసిన ఇంచార్జి రాఘవేంద్ర రెడ్డికి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల అధ్యక్షులు,సీనియర్ నాయకులు,ప్రజాప్రతినిధులు,క్లస్టర్,యూనిట్,బూత్ ఇంచార్జిలు,గ్రామ అధ్యక్షులు,టీడీపీ,ఐటీడీపీ కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## 355వ రాఘవేంద్ర ఆరాధనకు కర్ణాటక సీఎం, మాజీ సీఎంలకు ఆహ్వానం





మంత్రాలయం, శివ సూర్య, ఆగస్టు 11:మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి వారి 355వ ఆరాధన ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. పీఠాధిపతి శ్రీ సుభుధేంద్ర తీర్థ స్వామి వారి ఆధ్వర్యంలో ఈ నెల 27 నుంచి సెప్టెంబర్ 2 వరకు సప్తరాత్రోత్సవాలు జరగనున్నాయి.ఈ ఉత్సవాలకు హాజరు కావాలని కోరుతూ పీఠాధిపతి ఆదేశానుసారం శ్రీ మఠం అసిస్టెంట్ మేనేజర్/పిఆర్ఓ ఐపి.నరసింహమూర్తి బెంగళూరులో కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే.శివకుమార్, మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్యలకు వేర్వేరు సమయాల్లో ఆహ్వాన పత్రికలను అందజేశారు.ఆరాధన ఉత్సవాల విశిష్టతను వివరించిన నరసింహమూర్తి, రెండు తెలుగు రాష్ట్రాలు, కర్ణాటకతో పాటు దేశవ్యాప్తంగా ఉన్న భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారని తెలిపారు. భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని, ఉత్సవాలను విజయవంతం చేయడానికి శ్రీ మఠం సిబ్బంది కృషి చేస్తున్నారని చెప్పారు.సప్తరాత్రోత్సవాల్లో ప్రత్యేక పూజలు, అన్నదానాలు, ప్రవచనాలు జరుగుతాయని, భక్తులందరూ పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

## మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జ్ఞాన జ్యోతి శిక్షణ



మంత్రాలయం,శివ సూర్య, ఆగస్టు 11: మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంగన్వాడీ కేంద్రాలను బలోపేతం చేయడానికి చేపట్టిన కార్యక్రమంలో భాగంగా ఆర్ఎస్ఎస్ ఎంపీపీ పాఠశాలలో మూడురోజుల జ్ఞాన జ్యోతి శిక్షణ ప్రారంభమైంది.జ్ఞాన జ్యోతి కార్యక్రమం ద్వారా అంగన్వాడీ కార్యకర్తలు ఏ విధంగా విద్యార్థులకు విద్యాబోధన చేయాలనే అంశంపై అవగాహన కల్పించారు. జీరో నుండి మూడు సంవత్సరాల వరకు ఉన్న పిల్లలని నవచేతన అని, మూడు నుండి ఆరు సంవత్సరాల విద్యార్థులను ఆదర్శ శీల అని అంటారని శిక్షకులు వివరించారు.చిన్న పిల్లలకు ఆటల ద్వారా, కథల ద్వారా, బొమ్మల ద్వారా విద్యాబోధన చేయాలని, ఎల్ఎన్ఎస్ మెటీరియల్ అంటే భాష, గణితం, సైన్స్ కిట్లను ఉపయోగించి అక్షరాలు, సంఖ్యలు, రంగులు గుర్తింపు నేర్పించాలని సిఆర్పిలు ట్రైనింగ్ ఇచ్చారు. అలాగే పిల్లలకు పోషకాహారం, ఆరోగ్యం, పరిశుభ్రత గురించి అవగాహన కల్పించాలని, తల్లిదండ్రులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. పిల్లల స్థాయికి తగ్గట్టు గ్రూప్ యాక్టివిటీస్, ప్లే వే మెథడ్ ద్వారా నేర్పించాలని తెలిపారు.కార్యక్రమానికి మండల విద్యాధికారి రాగన్న ముఖ్యఅతిథిగా వచ్చారు. మండలంలో మొత్తం అంగన్వాడీ కార్యకర్తలు హాజరైనట్టు తెలిపారు. సూపర్వైజర్లు వీరగోవిందమ్మ, సుమిత్రమ్మ పాల్గొన్నారు. ఈ కార్యక్రమం మూడురోజుల పాటు కొనసాగుతుందని అధికారులు తెలిపారు.

## లక్ష్మమ్మ అవ్వ ఏరియాలో మౌలిక వసతులు కల్పించాలి: సిపిఐ డిమాండ్




మంత్రాలయం ,శివ సూర్య, ఆగస్టు 11: భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా ఈనెల 6 నుండి 15 వరకు జిల్లా వ్యాప్తంగా చేపట్టిన పాదయాత్రలో భాగంగా మంత్రాలయం పట్టణం రామచంద్ర నగర్ లక్ష్మమ్మ అవ్వ ఏరియాలో ప్రజా సమస్యల పాదయాత్ర నిర్వహించారు.ఈ కార్యక్రమానికి సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు భాస్కర్ యాదవ్, మండల కార్యదర్శి లక్ష్మణ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. రామచంద్ర నగర్ లక్ష్మమ్మ అవ్వ ఏరియా ఏర్పడి 25 సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటివరకు సిసి రోడ్లు, త్రాగునీటి సదుపాయం, వీధి కరెంటు స్తంభాలు, వీధి లైట్లు వంటి కనీస మౌలిక వసతులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత వర్షాకాలంలో చినుకు పడితే చిత్తడిగా మారుతుందని, కాలినడకన వెళ్లడానికి కూడా అవకాశం లేకుండా ఉందని స్థానికులు ఆందోళన తెలిపారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని సిపిఐ డిమాండ్ చేసింది.అదేవిధంగా మంత్రాలయం నుండి ఇబ్రహీంపురం పొలాలకు వెళ్లే పాత రస్తా వద్ద నల్ల వంకపై వంతెన నిర్మాణం చేపట్టాలని కోరారు. గత 25 సంవత్సరాలుగా రైతులు పంట పొలాలకు వెళ్లి రావడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పలుమార్లు అర్జీలు ఇచ్చినా అధికారులు పట్టించుకోలేదని విమర్శించారు. తక్షణమే వంతెన నిర్మాణం చేపట్టి రైతులకు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి ఎం.రాజు, సహాయ కార్యదర్శులు మణికంఠ, కేశవులు, రవిచంద్ర, మెహబూబ్ తదితరులు పాల్గొన్నారు.

## రమణీయం శ్రీ రాఘవేంద్రుడి సువర్ణ పల్లకోత్సవం. శ్రీ మఠం లో ఘనంగా సువర్ణ పల్లకి సేవ.




మంత్రాలయం, శివ సూర్య, ఆగస్టు 11:పవిత్ర తుంగభద్ర నది తీరాన వెలసిన సుప్రసిద్ధ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రం మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి మఠం లో మంగళవారం శ్రీ రాఘవేంద్ర స్వామి మఠం దివాన్ సుజయీంద్ర ఆచార్, బృందావనం అర్చకులు వేదవ్యాస స్వామి,సహాయ పీఆర్వో హోన్నళ్ళి వ్యాసరాజ్ ఆచార్ ఆధ్వర్యంలో మృత్తికా బృందావనాన్ని బంగారు పల్లకి లో ఉంచి అశేష జనవాహిని నడుమ, భాజా భజంత్రీల నడుమ, మంగళ వాయిద్యాల నడుమ, నమో రాఘవేంద్ర నామస్మరణతో శ్రీ మఠం ప్రాంగణంలో అంగరంగ వైభవంగా ఘనంగా ఊరేగించారు. ప్రవచన మండపంలో బంగారు పల్లకి సేవ చేయించిన భక్తుల పేరు,గోత్ర నామాల పై సంకల్ప పూజలు నిర్వహించారు.సేవ చేయించిన భక్తులకు విశేష దర్శన భాగ్యం కల్పించారు.వీరికి శ్రీ మఠం పీఠాధిపతి శ్రీ సుభుధేంద్ర తీర్థ స్వామీజి వారు శేష వస్త్రం, పుష్ప,ఫల, మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో శ్రీ మఠం ధార్మిక అధికారి శ్రీపతి స్వామి,శ్రీ మఠం పీఆర్వో పురాణిక్ అనంత స్వామి,సెక్యూరిటీ ఇంచార్జ్ రమేష్ స్వామి, సెక్యూరిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఏలినినో ప్రభావం పైన కార్యచరణ ప్రణాళిక పైన రైతులకు అవగాహన సదస్సు

---మండల వ్యవసాయ అధికారి ఎస్ దాన కర్ణుడు




మెళియాపుట్టి, శివ సూర్య, ఆగస్టు 11: మెళియాపుట్టి మండలంలో రైతు సేవా కేంద్ర పరిధిలో మంగళవారం రైతన్న మీకోసం కార్యక్రమం నిర్వహించారు.గొడ్డ, ఎల్లయ్యపురం రైతు సేవ కేంద్రం పరిధిలో చిన్న సున్నాపురం, డాబారు గ్రామాలలో రైతన్న మీకోసం కార్యక్రమంలో పాల్గొని రైతులకు తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యంగా ప్రస్తుతం ఏలినినో ప్రభావం ఉన్నందువలన వ్యవసాయ, అనుబంధ రంగాల అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొని, రైతులు పండిస్తున్న పంట పొలాలను సందర్శించి పంట స్థితిగతులను ఆన్లైన్లో ఏ పి ఏ ఐ ఎం ఎస్ యాప్ ద్వారా సబ్మిట్ చేయడం జరుగుతుంది అని తెలియజేశారు.అలాగే ఈ కార్యక్రమం ద్వారా వాతావరణ సానుకూల పంటల ప్రణాళిక గురించి తెలియజేస్తూ....ప్రస్తుతం ఉన్న ఏలినినో పరిస్థితులపై రైతులకు సరైన సలహాలు సాంకేతిక మార్గదర్శకాలు ఇవ్వడంతో




దీని ద్వారా రైతులను ఏలినినో ప్రభావం నుంచి సమర్థవంతంగా ఎదుర్కొనే విధంగా ఈ రైతన్న మీకోసం కార్యక్రమము రైతులకు సూచనలు ఇవ్వడం జరుగుతుంది అని తెలిపారు. రైతులు ప్రస్తుతం నాట్లు వేయని వరి పొలాలలో ఆరుతడి పంటలు పండించుకోవాలని సూచించారు. పెసర ,ఉలవ, మినుము, రాగి వంటి ఆరుతడి పంటలు పండించుకోవాలని తెలియజేశారు. రైతులందరూ ఈ యాప్ ఇన్స్టాల్ చేయాలని కోరారు. రైతులు ఆగస్టు 15వ తేదీ లోపల వరి పంట బీమా నమోదు చేసుకోవాలని సూచించారు, పంట రుణం తీసుకున్న రైతులు బ్యాంకుల ద్వారా,పంట రుణం తీసుకోకపోయినా రైతులు మీసేవ కేంద్రాల ద్వారా వరి పంటలు బీమా చెల్లించుకోవాలని కోరారు. ఈ అవకాశాన్ని రైతులందరూ వినియోగించుకోవాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఉద్యాన సహాయకులు షణ్ముఖ, ధనలక్ష్మి ,ప్రకృతి వ్యవసాయ సిబ్బంది జయలక్ష్మి, బ్రెడ్ సంస్థ ప్రతినిధులు, కూటమి నాయకులు ధర్మారావు పలువురు రైతులు పాల్గొన్నారు.

## తుక్కాపూర్‌లో బాధిత కుటుంబాన్ని పరామర్శించిన చెరుకు శ్రీనివాస్ రెడ్డి

తొగుట ఆగస్ట్ 11 తొగుట మండలం తుక్కాపూర్ గ్రామానికి చెందినరాజూ డైరెక్టర్ లింగాల నర్సవ్వ ఇటీవల మృతి చెందడంతో దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి మంగళవారం ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ సందర్భంగా నర్సవ్వ కుటుంబ సభ్యులను కలిసి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. నర్సవ్వ మృతి కుటుంబానికి, గ్రామానికి తీరని లోటని అన్నారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యం ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పంది రాజు, మాజీ అధ్యక్షుడు ఆక్కం స్వామి, నాయకులు పాగాల కొండల్ రెడ్డి, నిరంజన్ రెడ్డి, దేవునూరి పోచయ్య, బండారు రమేష్ గౌడ్, బైతి స్వామి, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఊళ్లేంగల సాయి, చిక్కుడు ఉపలయ్య, చెరుకు మధుసూదన్ రెడ్డి, భర్రెంకల స్వామి, లింగాల కృష్ణ, మహేష్, వెంకట్, చిక్కుడు కర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణాన్ని కాపాడాలి

### విద్యార్థులకు అవగాహన కల్పించిన లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు



-- ఆమనగల్లు, ఆగస్టు 11:ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు ప్రతినిధులు పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా తొలి రోజు రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి లో పాఠశాలలో విద్యార్థులకు ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.లయన్స్ క్లబ్ కార్యదర్శి లయన్ గంగుల శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణానికి, మానవాళికి కలిగే నష్టాలను విద్యార్థులకు వివరించారు. ప్లాస్టిక్ వ్యర్థాలు భూమి, నీరు, గాలి కాలుష్యానికి కారణమవుతున్నాయని, వాటి వినియోగాన్ని తగ్గించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని సూచించారు.అనంతరం విద్యార్థులతో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, పర్యావరణాన్ని పరిరక్షిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. పాఠశాల స్థాయి నుంచే పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రీన్ కమిటీ సభ్యులు శ్రీకాంత్‌రెడ్డి, రాధిక, కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ధృతిక, గ్రీన్ హౌస్ కెప్టెన్ వర్షిణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ప్రజా సంబంధాల అధికారి లయన్ పాషా మాట్లాడుతూ “మన భవిష్యత్తు కోసం ప్లాస్టిక్‌ను తగ్గిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం” అనే నినాదంతో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా పునర్వినియోగ వస్తువులను ఉపయోగించే అలవాటును పెంపొందించుకోవాలని సూచించారు.

## ప్రజా.వాణి పిర్యాదు కు వెంటనే స్పందన .

### ఎట్టకేలకు పూర్తి స్థాయిలో వాడుకలోకి కొందుర్గ్ ఆర్టీసీ బస్టాండ్ మూత్రశాల సముదాయం.. ..

### షాద్ నగర్ ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో పూర్తి స్థాయిలో అందుబాటులోకి

11 కొందుర్గ్..కొందుర్గ్ మండలం కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి కి దగ్గరగా ఉన్న ఆర్టీసీ మూత్రశాల సముదాయం దాదాపు ఒక్క సంవత్సరం కాలం నుండి అట్టు ప్రాణికులకు ఇటు మండల కేంద్రాన్ని వచ్చు వివిధ గ్రామాల ప్రజలకు పూర్తిగా నిరుపయోగంగా ఉన్నాయి యితే ఇది గమనించిన సాదా నగర్ జిల్లా సాధన సమితి నాయకులు వివిధ రకాలుగా వినూత్నంగా పోరాటం చేసి మండల స్థాయి నుండి జిల్లా స్థాయి అధికారుల వరకు




వినతులు. సమర్పించారు కానీ మూత్రశాల సమస్యకు పూర్తి స్థాయి పరిస్కరించలేదు కానీ నేడు షాద్ నగర్ ఆర్టీసీ డిపో మేనేజర్ షాద్ నగర్ జిల్లా సాధన సమితి నాయకులు ప్రజా వానిలో వచ్చిన దరఖాస్తు పూర్తి స్థాయిలో పరిష్కరిస్తూ ప్రయాణికులకు మల మూత్ర విసర్జన శాలలు పూర్తి స్థాయిలో వాడుకలోని తెచ్చారు గతంలో మూత్ర శాలకు టెండర్లో మెంటానెన్స్ వచ్చిన అతను సక్రమంగా పనిచేయ లేక పోవటంతో తీవ్ర సమస్య ఏర్పడిందని. ఇప్పుడు అలాంటి సమస్య రాదని వారు తెలిపారు స్థానిక గ్రామ సర్పంచ్ చౌడపురం ప్రభాకర్ సహకారముతో గ్రామంలో నుండి ఒక్కరని మూత్ర శాలల పరిశుభ్రత పరిరక్షణకై పూర్తి స్థాయిలో ఏర్పాటు చేసి ప్రజలకు వాడుకలోకి తెచ్చామన్నారు ప్రజలకు ఇంతకాలానికైన పూర్తి స్థాయిలో మల మూత్ర విసర్జన శాలలు వాడుకలోని రావడం చాలా సంతోషము అని ప్రయాణికులు తెలిపారు..

## కీసర సర్కిల్‌లో అభివృద్ధి పనులు, నీటి నిల్వ సమస్యలపై సమీక్ష

మేడ్చల్ జిల్లా ఆగస్టు 11: మల్కాజిగిరి జోన్ కమిషనర్ చంద్రాపురి, జవహర్‌నగర్‌లలో చేపట్టనున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం పాపయ్య కాలనీలో గుర్తించిన నీటి నిల్వ ప్రాంతాలను



క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, నీటి నిల్వ సమస్యల పరిష్కారానికి సమర్థవంతమైన, సకాలంలో చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పౌర మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని కూడా సూచించారు.లక్ష్యంతో కూడిన చర్యలు, మెరుగైన మౌలిక సదుపాయాలతో పటిష్ఠమైన కాలనీల నిర్మాణమే తమ ధ్యేయమని అధికారులు తెలిపారు.

## కాజీపేట వైఎస్సార్ నగర్ గుడిసెవాసులకు అండగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

హనుమకొండ జిల్లా ప్రతినిధి,ఆగస్టు11:కాజీపేట వైఎస్సార్ నగర్ లో నివసిస్తున్న గుడిసెవాసులు నేడు వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ని కలిసి, కొందరు వ్యక్తులు తమను




భయభ్రాంతులకు గురిచేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని వివరించారు.గుడిసెవాసుల సమస్యలను ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సానుకూలంగా విని, వెంటనే స్పందించారు. వారిని భయభ్రాంతులకు గురిచేస్తున్న వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ,మీకు అండగా నేను ఉన్నాను. ఎవరూ భయపడాల్సిన అవసరం లేదు. మీకు ఎలాంటి ఇబ్బంది కలిగినా నా దృష్టికి తీసుకురండి. చట్టపరంగా మీకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటాను అని గుడిసెవాసులకు భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో హనుమకొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మహమ్మద్ అంకుస్, పసునూరి మనోహర్, మాజీ కార్పొరేటర్లు గుంటి కుమార్, సుంచు అశోక్, 62 డివిజన్ అధ్యక్షులు అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ కార్యకర్త అరుణ్ మృతి బాధాకరం

### బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రవీందర్ యాదవ్



షాద్‌నగర్: షాద్‌నగర్ పట్టణంలోని పద్మావతి కాలనీకి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త అరుణ్ మృతి బాధాకరమని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వై. రవీందర్ యాదవ్ అన్నారు. అరుణ్ మృతి విషయం తెలుసుకున్న రవీందర్ యాదవ్, షాద్ నగర్ చేరుకొని ఆయన పార్థివదేహానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. పార్టీ కోసం అరుణ్ చేసిన సేవలను ఈ సందర్భంగా రవీందర్ యాదవ్ స్మరించుకున్నారు. ఆయన మృతి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు, బీఆర్ఎస్ శ్రేణులకు తీరని లోటని అన్నారు. ఈ కష్ట సమయంలో కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు.

## గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలి.

### అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష నిర్వహించిన ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే వేముల వీరేశం.




నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి. లనకిరేకల్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ పంచాయతీల అభివృద్ధి , సామర్థ్య వృద్ధి కార్యక్రమాలపై ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని గ్రామ పంచాయతీల్లో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి సమీక్షించారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు.గ్రామ పంచాయతీల్లో మౌలిక వసతుల కల్పన, పారిశుధ్యం, తాగునీరు, రహదారులు తదితర ప్రజా అవసరాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత సమయంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.గ్రామ పంచాయతీలను మరింత బలోపేతం చేసి, ప్రజలకు మెరుగైన పాలన, సేవలు అందించేలా అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే వేముల వీరేశం సూచించారు.ఈ సమావేశంలో సంబంధిత అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జిల్లా జనగణన హ్యాండ్‌బుక్ రూపకల్పనకు ఖచ్చితమైన సమాచారం అందించాలి

### అధికారులకు కలెక్టర్ భవేష్ మిశ్రా దిశానిర్దేశం



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి , ఆగస్టు 11 : జిల్లా జనగణన హ్యాండ్‌బుక్ ( డీ . సీ . హెచ్ . బీ ) రూపకల్పన కోసం ఖచ్చితత్వంతో కూడిన నాణ్యమైన సమాచారం అందించాలని కలెక్టర్ భవేష్ మిశ్రా అధికారులకు దిశానిర్దేశం చేశారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్ లో మంగళవారం కలెక్టర్ వివిధ శాఖల అధికారులతో, ఆయా రంగాల ప్రముఖులతో జనగణన--2027కు సంబంధించి జిల్లా స్థాయిలో రూపొందించే హ్యాండ్‌బుక్ కు అందించాల్సిన సమాచారం విషయమై చర్చించి సూచనలు చేశారు. విద్యా, వైద్య సదుపాయాలు, తాగునీరు, పారిశుద్ధ్యం, రవాణా, సమాచార వ్యవస్థ, బ్యాంకింగ్, రుణ సదుపాయాలు, విద్యుత్, ఇంధన వనరులు, భూమి, సాగునీటి వినియోగం, వ్యవసాయం, చేతివృత్తులు, కళలు, సాహిత్యం, ప్రముఖ వ్యక్తులు, గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు, దేవాలయాలు, చారిత్రక ప్రదేశాలు, అటవీ ప్రాంతాలు, ఆహారపు అలవాట్లు, సంస్కృతి, సంప్రదాయాలు, పరిశ్రమలు, పురావస్తు సంపద తదితర అంశాలకు సంబంధించిన జిల్లా సమాచారాన్ని ఖచ్చితత్వంతో అందించేలా చూడాలన్నారు. జిల్లా జనగణన హ్యాండ్‌బుక్ రాబోయే పది సంవత్సరాల పాటు సమాచార సేకరణ, ప్రణాళికల రూపకల్పనకు ఎంతో ఉపయుక్తమైన గ్రంథంగా నిలుస్తుందని, దీనిని దృష్టిలో పెట్టుకుని సమాచార సేకరణలో ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. వారం రోజులలో సంబంధిత శాఖలు సమాచారాన్ని సేకరించి అందించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ఇంచార్జి సీ.పీ.ఓ కిషన్, సంబంధిత శాఖల అధికారులు, వివిధ రంగాల ప్రముఖులు పాల్గొన్నారు.

## రిజర్వాయర్లకు తక్షణమే 30 టీఎంసీల నీటిని ఎత్తిపోసి రైతులను ఆదుకోవాలి: హరీశ్‌రావు



సిద్దిపేట ఆగస్ట్ 11( జిల్లాలోని రిజర్వాయర్లకు తక్షణమే 30 టీఎంసీల నీటిని ఎత్తిపోసి, రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీటి కొరత లేకుండా చర్యలు చేపట్టాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు కోరారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్, ఇరిగేషన్ అడ్వైజరీ కమిటీకి ఆయన లేఖ రాశారు.జిల్లా ఇరిగేషన్ అడ్వైజరీ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరగనున్న నేపథ్యంలో ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజుల్లో ఎదురయ్యే నీటి సమస్యలను దృష్టిలో ఉంచుకుని పలు అంశాలను కమిటీ దృష్టికి తీసుకువచ్చారు. ఇప్పటికైనా తక్షణ చర్యలు చేపడితే వచ్చే వానాకాలం వరకు ఎల్‌నినో ప్రభావాన్ని అధిగమించవచ్చని పేర్కొన్నారు.కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టులో భాగంగా జిల్లాలో నిర్మించిన అన్నపూర్ణ, రంగనాయకసాగర్, కొమురవెల్లి మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ రిజర్వాయర్లలోకి ప్రతిఏటా ఈ సమయానికి మిడ్‌మానేరు నుంచి నీటిని ఎత్తిపోసేవారని, అయితే ఈ ఏడాది ఇప్పటివరకు ఎత్తిపోతలు ప్రారంభించలేదని తెలిపారు.అన్నపూర్ణ, రంగనాయకసాగర్ రిజర్వాయర్లు ప్రస్తుతం డెడ్ స్టోరేజీలో ఉండగా, మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్‌లు కూడా అడుగంటే పరిస్థితిలో ఉన్నాయని హరీశ్‌రావు పేర్కొన్నారు. తక్షణమే 30 టీఎంసీల నీటిని ఎత్తిపోసి చెరువులు, కుంటలు, చెక్‌డ్యామ్‌లను నింపాలని కోరారు. దీనివల్ల భూగర్భజలాలు పెరిగి వానాకాలం పంటలకు రైతులకు ప్రయోజనం కలుగుతుందని అన్నారు.ఈ ఏడాది కేవలం 65 శాతం మంది రైతులే వానాకాలం పంటలు సాగు చేశారని, సాగునీరు అందుబాటులో ఉండదనే కారణంతో పలువురు రైతులు మంచి భూములను సైతం బీడుగా ఉంచారని తెలిపారు. ప్రస్తుతం సాగులో ఉన్న పంటలు గట్టెక్కాలంటే రిజర్వాయర్లను నింపడం అత్యవసరమని అన్నారు.2027 జూలై వరకు ఎల్‌నినో ప్రభావం ఉంటుందని ప్రభుత్వం చెబుతున్న నేపథ్యంలో, అప్పటివరకు సాగు, తాగునీటి అవసరాలకు ఇబ్బందులు రాకుండా ఇప్పటి నుంచే నీటిని నిల్వ చేయాలని సూచించారు. ప్రస్తుతం ఎత్తిపోసిన నీటిని వినియోగించిన తర్వాత యాసంగి పంట సమయంలో మళ్లీ నీటిని ఎత్తిపోసుకునేలా మిడ్‌మానేరులో జిల్లాకు సరిపడా నీటిని నిల్వ ఉంచాలని కోరారు.జిల్లాలో తాగునీటి అవసరాలకే సుమారు 6 నుంచి 7 టీఎంసీల నీరు అవసరమవుతుందని, వరి, ఆయిల్‌పామ్ తదితర పంటలు సాగు చేసిన రైతులు నీటి ఎత్తిపోతల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. “రైతులు నీటి కోసం ఎదురుచూస్తుంటే రిజర్వాయర్ల దుస్థితి చూస్తే దుఃఖం వస్తోంది” అని హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు.గోదావరిలో నీటి ప్రవాహం ఉన్నప్పుడే వేగంగా నీటిని ఎత్తిపోసి ఉంటే ప్రస్తుత పరిస్థితి వచ్చేది కాదని అన్నారు. ఇప్పటికైనా పరిస్థితిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వ్యవసాయ, నీటిపారుదల శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

## వార్డులో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టులు: హరీశ్‌రావు



సిద్దిపేట ఆగస్ట్ 11 మహిళల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆధ్వర్యంలో, హైదరాబాద్‌కు చెందిన సింధు ఆసుపత్రి సౌజన్యంతో సిద్దిపేట పట్టణంలోని ప్రతి వార్డులో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టులు నిర్వహిస్తున్నట్లు మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, వైస్ చైర్మన్ కనకరాజు, పట్టణ అధ్యక్షుడు సంపత్‌రెడ్డి తెలిపారు.స్క్రీనింగ్ టెస్టుల్లో భాగంగా మంగళవారం నాసర్‌పూర్ 31వ వార్డులోని మహిళా భవన్‌లో రెండో రోజు పరీక్షలను నిర్వహించారు. ఈ నెల 10 నుంచి 14వ తేదీ వరకు పట్టణంలోని వివిధ వార్డుల్లో మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ వాహనం ద్వారా పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు.ప్రతి వార్డులో ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేసి, అక్కడికక్కడే రిజిస్ట్రేషన్ అనంతరం మహిళలకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. ముఖ్యంగా 40 ఏళ్లు దాటిన మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ప్రస్తుతం మహిళల్లో బ్రెస్ట్ క్యాన్సర్ ప్రభావం ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ముందస్తుగా గుర్తించడం ద్వారా మెరుగైన చికిత్స అందించే అవకాశం ఉంటుందని తెలిపారు. స్క్రీనింగ్ ద్వారా క్యాన్సర్ లక్షణాలు గుర్తించిన వారికి అవసరమైన తదుపరి పరీక్షలు, చికిత్స, ఆపరేషన్ తదితర వైద్య సేవలను ఆసుపత్రి ద్వారా అందించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.మహిళలు ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా తమ ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ఉచిత స్క్రీనింగ్ పరీక్షలను వినియోగించుకోవాలని నాయకులు కోరారు. కార్యక్రమంలో వార్డు నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# జలసిరి అమలులో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు కలెక్టర్ భవేష్ మిశ్రా

### హౌసింగ్, వన మహోత్సవం, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపుపై అధికారులతో సమీక్ష



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 11 : భూగర్భ జలాలను పెంపొందించేందుకు, వర్షపు నీటిని నిలువ చేసేందుకు వీలుగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జలసిరి కార్యక్రమాల అమలులో నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ భవేష్ మిశ్రా హెచ్చరించారు. ఎల్ నినో వల్ల వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశాలు ఉన్న ప్రస్తుత తరుణంలో జలసిరి కార్యక్రమాలకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ విస్తృత స్థాయిలో ఇంకుడు గుంతలు, ఫాంపాండ్స్ తదితర నిర్మాణాలు జరిపించాలని సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో మంగళవారం జలసిరి, హౌసింగ్, వన మహోత్సవం, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళ కేటాయింపు తదితర అంశాలపై సంబంధిత శాఖల జిల్లా అధికారులతో కలిసి మున్సిపల్ కమిషనర్లు, అన్ని మండలాల ఎంపీడీఓలు, ఎంపీఓలు, ఇంజనీరింగ్ విభాగాల అధికారులతో కలెక్టర్ సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. లక్ష్యానికి అనుగుణంగా ఫాంపాండ్స్, ఇంకుడు గుంతల నిర్మాణాలు జరగని మండలాల ఎంపీడీఓ లపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం రోజుల్లో నిర్దేశిత లక్ష్యానికి అనుగుణంగా నిర్మాణాలు జరిగేలా చొరవ చూపాలని, క్షేత్రస్థాయిలో రైతులను, ప్రజలను కలిసి అవగాహన కల్పించాలన్నారు. ఈ విషయంలో అలసత్వం వహించే వారిని సరెండర్ చేస్తానని కలెక్టర్ స్పష్టం చేశారు. కేవలం జీతాల కోసం పని చేయకూడదని, ప్రస్తుత విపత్కర పరిస్థితుల్లో ప్రతి నీటి బొట్టును వృధా కాకుండా కాపాడుకోవాల్సిన గురుతర బాధ్యతను గుర్తెరిగి అంకిత భావంతో విధులు నిర్వర్తించాలని హితవు పలికారు. నైరుతీ రుతుపవనాలు మొట్టమొదటగా ప్రవేశించే కేరళ రాష్ట్రంలోని వయనాడ్ జిల్లాలో మునుపెన్నడూ లేనివిధంగా సాధారణంతో పోలిస్తే 44 శాతం లోటు వర్షపాతం నెలకొని ఉందని అన్నారు. పరిస్థితి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని నీటి సంరక్షణకు ఉపయుక్తంగా నిలిచే ఫాంపాండ్స్, సోక్ పిట్స్ వంటి వాటిని విరివిగా నిర్మించేలా చూడాలన్నారు. భూగర్భ జలాలు తగ్గిపోయి నీరు అందించక వృధాగా ఉన్న బోరు బావుల వద్ద వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణాలు చేపట్టాలని ఆదేశించారు. తమిళనాడులోని తిరువల్లూరు జిల్లాలో వీటి నిర్మాణాల వల్ల 5 నుండి 10 అడుగుల మేరకు భూగర్భ జలాల వృద్ధి చెందాయని, ఇక్కడ కూడా అలాంటి నిర్మాణాలు చేపట్టేందుకు చొరవ చూపాలన్నారు. కాగా, వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఆయా శాఖలు నిర్దేశిత లక్ష్యం మేరకు మొక్కలు నాటి, వాటిని సంరక్షిన్చేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. నాటిన మొక్కలను ఈ నెల 29న ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో క్షేత్రస్థాయిలో పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. మొక్కలు నాటకుండా తప్పుడు నివేదికలు సమర్పించిన వారి నుండి నిధుల రికవరీ చేపడతామని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణాల ప్రగతిని సమీక్షిస్తూ, సెప్టెంబర్ 15లోపు పూర్తి స్థాయిలో లక్ష్యాన్ని సాధించాలని గడువు విధించారు. జాబ్ కార్డులు కలిగి ఉన్న ఇందిరమ్మ ఇళ్ళ లబ్ధిదారులకు వీబీజీరాంజీ కింద వ్యక్తిగత మరుగుదొడ్లను మంజూరు చేయాలని సూచించారు. ప్రభుత్వం నుండి కేటాయించబడే నిధులు పూర్తిస్థాయిలో వినియోగం అయ్యేలా చొరవ చూపాలన్నారు. గుడిసెలలో నివసిస్తున్న కుటుంబాలకు యుద్ధప్రాతిపదికన ఇందిరమ్మ ఇళ్ళను మంజూరు చేసేందుకు లబ్ధిదారుల జాబితా రూపొందించాలని, రెండు పడక గదుల ఇళ్ళను అర్హులైన వారికి కేటాయించేందుకు వీలుగా లబ్ధిదారుల జాబితాను తక్షణమే తహసిల్దార్లకు సమర్పించాలని ఎంపీడీఓలను ఆదేశించారు. అన్ని గ్రామ పంచాయతీల స్థాయిలో సమావేశాలు నిర్వహించి ఫాంపాండ్స్, సోక్ పిట్ల నిర్మాణాలు చేపట్టేలా, ప్రత్యామ్నాయ పంటలు, ఆయిల్ పామ్ సాగు చేపట్టేలా రైతులను, ప్రజలను అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, ట్రైనీ కలెక్టర్ సురేష్, డీ.ఆర్.ఓ గీత, నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, జెడ్పీ సీ.ఈ.ఓ సాయాగౌడ్, డీ.ఆర్.డీ.ఓ సాయన్న, డీ.పీ.ఓ శ్రీనివాస్ రావు, అన్ని మండలాల ఎంపీడీఓలు, ఎంపీఓలు, పంచాయతీరాజ్ ఈ.ఈలు, ఏ.ఈలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బెల్లంపల్లి ఎమ్మెల్యే దంపతుల వివాహ వేడుకలు...



మంచిర్యాల జిల్లా (ప్రతినిధి)మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ రమ దంపతుల వివాహ మహోత్సవ వేడుకలు స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో మంగళవారం పట్టణ అధ్యక్షులు బండి ప్రభాకర్ యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ఎమ్మెల్యే దంపలు దంపతులకు చరవాణి ద్వారా నాయకులు కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షులు మాట్లాడుతు ఎన్నో ఒడిదొడుకులను ఎదుర్కొంటు సాగిపోతున్న ఎమ్మెల్యే దంపతుల దాంపత్య జీవితం ఆనందమయంగా కొనసాగాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు.అదేవిధంగా బెల్లంపల్లి100 పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో పేషెంట్లకు పాలు పండ్లు బ్రెడ్లు అందజేశారు.ఈ కార్యక్రమంలో 15వ వార్డు కౌన్సిలర్ చింతల వసంత,నాయకులు చిలుముల శంకర్,చినరాజం,దేవసాని ఆనంద్,కన్నూరి వెంకటేష్,జమ్మికుంట విజయ్,నయీం,డి రాజలింగు,కె రాజేష్,బానేష్,కుమార్,ఆకాష్, సత్యవతి,పద్మ,ఖలీల్, ఖదీర్,ఎండి వాజీద్,అలీ తదితరులు పాల్గొన్నారు.

## రేపటి నుంచి శ్రావణ మాసం ... పౌరాణిక ప్రాశస్త్యం



నారాయణపేట ఆగస్టు 11:పవిత్ర శ్రావణమాసం ఈ నెల 13 నుంచి ప్రారంభం అవుతుంది.ఈ మాసంలో ప్రత్యేక పూజ లు,వ్రతాలు చేస్తూ భక్తి పారవశ్యంలో హిందువులు మునిగి తేలుతారు.పౌరాణిక ప్రాశస్త్యంశ్రావణం శివుడు, విష్ణువు, మహాలక్ష్మి, గౌరీదేవులకు అత్యంత ప్రీతిపాత్రమైన పవిత్ర మాసం.ఈ నెలలో వ్రతాలు ఆచరించడం వల్ల కుటుంబంలో ఆయురా రోగ్యాలు, అష్టైశ్వర్యాలు సుమంగళీ యోగం ప్రాప్తిస్తాయనీ బావిస్తారు.ముఖ్యమైన వ్రతాలుఈ మాసంలో మంగళగౌరీ వ్రతం నూతనంగా వివాహ మైన స్త్రీలు మొదటి 5 శ్రావణ మంగళవారాల్లో చేస్తారు. పిండి ప్రమిదలతో దీపారాధన, గౌరీదేవికి తోరాలు సమర్పించడం ద్వారా సౌభాగ్యం స్థిరపడుతుందనీ నమ్మకంవరలక్ష్మీ వ్రతంశ్రావణ పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం ఆచరి స్తారు. కలశ స్థాపన చేసి, మహాలక్ష్మిని ఆవాహన చేసి, 9 ముడుల తోరాన్ని కట్టుకోవడం వల్ల దారిద్ర్యం తొలగి ఐశ్వర్యం సిద్ధిస్తుందనీ బావిస్తారు.నిత్య ఆచరణలు శ్రావణ సోమవారం,శనివారంరోజూ సూర్యోదయానికి ముందే నిద్రలేచి ప్రాతఃకాల స్నానం ఆచరించాలి.ఇంటి ముంగిట కళ్లాపి చల్లి, బియ్యపు పిండి ముగ్గులు వేసి, గుమ్మానికి పసుపు- కుంకుమలు అలంక రించాలి.ఉదయం, సాయంత్రం దీపారాధన వెలిగించి విష్ణుసహ స్రనామం లేదా లలితా సహస్రనామం పఠించాలి.శ్రావణ సోమవారం శివునికి పాలు, తేనె, గంగోదకం, మారేడు దళాలతో అభి షేకం చేసి, ఉపవాసం లేదా ఏకభుక్తం ఉండడం వల్ల మనశ్శాంతి, కోరిన కోరికల ఈడేర్పు లభిస్తాయి.తాంబూల దానం చేస్తారు. సాంప్రదాయ అలంకరణశ్రావణ మంగళ, శుక్రవా రాల్లో ముత్తైదువులను ఇంటికి ఆహ్వానించి పసు పు, కుంకుమ, గాజులు, పండ్లు, గుగ్గిళ్లు,శనగలను వాయనంగా అందించాలి.కాళ్లకు పారాణి, చేతులకు ఎర్రటి,ఆకుపచ్చ గాజులు, నల్లపూసలు, మంగళ సూత్రం ధరించి మంగళక రంగా ఉండాలి.పూజలు, దీపారాధన వేళల్లో జుట్టు విరబోసుకోకూడదు.ముడి వేసుకోవడం లేదా అల్లుకో వడం చేయాలి.నియమాలు, వర్జించవలసినవిఉల్లి, వెల్లుల్లి, మాంసా హారం, మద్యపానానికి పూర్తిగా దూరంగా ఉంటూ సాత్విక ఆహారాన్ని మాత్ర మే తీసుకోవాలి. కుటుం బంలో కలహాలు, కోప తాపాలు, అసత్యాలు మాట్లాడడం వంటివి చేయకూడదు.నెలసరి వస్తే నిరాశ పడాల్సిన పనిలేదు. ఆ సమయంలో పూజలు, కలశాన్ని తాకకుండా విశ్రాం తి తీసుకుని, శుచి అయిన తర్వాత వచ్చే వారం నుం డి వ్రతాన్ని పునఃప్రారం భించవచ్చు.

## మత పెద్దల సమావేశం రేపటికి వాయిదా కలెక్టర్ ప్రియాంక

నారాయణపేట ఆగస్టు 11:కొన్ని అనివార్య కారణాల దృష్ట్యా, నారాయణపేట జిల్లా మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పూజారులు, ఖాజీలు, పాస్టర్లకు నిర్వహించాల్సిన "బాల్య వివాహాల నిషేధంపై అవగాహన కార్యక్రమం ఈ నెల 13కు ఉదయం వాయిదా పడిందనీ కలెక్టర్ ప్రియాంక తెలిపారు.ముందుగా నిర్ణయించిన ప్రకారం 12న ఉదయం 10:00 గంటలకు సింగారం క్రాస్ రోడ్‌లోని స్కిల్ డెవల ప్మెంట్ సెంటర్‌లో నిర్వహించాల్సిన ఈ అవగాహన కార్యక్రమాన్ని 13 వ తేదీ ఉదయం 10 గంటలకు అదే వేదికలో నిర్వహించనున్నట్లు తెలిపారు .సంబంధిత అధికారులు,పూజారులు, ఖాజీలు, పాస్టర్లు ఈ మార్పును గమనించి 13న నిర్వహించనున్న అవగా హన కార్యక్రమానికి తప్పని సరిగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనీ కోరారు.

## కోయిల్‌సాగర్ నీటిని మరికల్ మండల రైతులకు విడుదల చేయాలి బిజెపి డిమాండ్

నారాయణపేట ఆగస్టు 11:కోయిల్ సాగర్ నుంచి మరికల్ మండల రైతులకు సాగు నీరు అందించాలని మండల బిజెపి నాయకులు విలేకరుల సమావేశంలో డిమాండ్ చేశారు.మరికల్ మండల పరిధిలోని రైతులు నాట్లు వేసుకోవడానికి, పంటలు సాగు చేసుకోవడా నికి అవసరమైన సాగునీ టిని కోయిల్‌సాగర్ డ్యామ్ నుండి వెంటనే విడుదల చేయాలనీ కోరారు.సాగునీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారన్నారు. రైతుల పరిస్థితిని దృష్టిలో పెట్టుకొ ని అధికారులు, ప్రజా ప్రతి నిధులు వెంటనే స్పందించి కోయిల్‌సాగర్ డ్యామ్ నుం డి మరికల్ మండల రైతు లకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాల న్నారు.సాగునీరు వెంటనే విడుదల చేయకపోతే, బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో మరికల్ మండలంలోని రైతులందరినీ ఏకతాటిపైకి తీసుకువచ్చి మరికల్ మండల కేంద్రంలో పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమం చేపడతామని హెచ్చరించా రు.ఈ సమావేశము మండ ల బీజేపీ అధ్యక్షులు వేణు గోపాల్, బీజేపీ నాయ కులు వెంకట్ రెడ్డి, రాజేష్ యాదవ్, శ్రీరామ్, బీజేవై ఎం మండల అధ్యక్షులు నరేష్ గౌడ్, రవి యాదవ్,పి సి కుంట నరేష్ గౌడ్, నర్సి ములు, మహేష్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

## రట్టిని గ్రామంలో ఎమ్మెల్యే ఆదేశాలతో పారిశుద్ధ్య పనులు



మెళియాపుట్టి, శివ సూర్య ఆగస్టు 11: పాతపట్నం శాసనసభ్యులు అసెంబ్లీ ప్రివిలేజ్ కమిటీ మెంబర్ మామిడి గోవిందరావు ఆదేశాల మేరకు మెళియాపుట్టి మండలం రట్టిని గ్రామంలో మంగళవారం పారిశు ద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో చాలా కాలంగా పేరుకు పోయిన ముళ్లపొదలు, రోడ్లకు ఇరువైపులా జిగట మట్టి, చెత్తా చెదారాన్ని తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దారు. ముఖ్యంగా ఎస్సీ వీధి, బీసీ వీధి, పరిశుభ్రపరచడమే కాకుండా గ్రామంలోని బ్రాహ్మణ వీధి చివర నుంచి నది వైపు వెళ్లే మార్గంలో పెద్దఎత్తున పేరుకుపోయిన చెత్త, మట్టి, పిచ్చి మొక్కలను తొలగించారు. దీంతో స్థానికులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. కూటమి నాయకులు దగ్గరుండి పారిశుద్ధ్య పనుల్లో పాల్గొని, గ్రామంలోని పలు ప్రాంతాలను పరిశుభ్రం చేయించారు. ప్రజల ఆరోగ్యం, గ్రామ పరిశుభ్రతకు ప్రాధాన్యతనిస్తూ ప్రతి ఒక్కరూ పారిశుద్ధ్య కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని నాయకులు సూచించారు.



ఈ కార్యక్రమం ప్రత్యేక అధికారి కింజరాపు గణేష్, పంచాయతీ కార్యదర్శి సుహాసిని మహాపాత్రో పర్యవేక్షణలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ రవీంద్రనాథ్ జన్న, జనసేన పార్టీ పాతపట్నం మార్కెట్ కమిటీ డైరెక్టర్ చింతల ప్రశాంత్ తదితర కూటమి నాయకులు, ఫీల్డ్ అసిస్టెంట్ లింగరాజు, మీలా సింహాచలం, చరణ్, శ్రీను, గావిరేసు తదితరులు పాల్గొన్నారు. గ్రామంలో చేపట్టిన పారిశుద్ధ్య కార్యక్రమాన్ని వారు అభినందిస్తూ, ఇలాంటి కార్యక్రమాలను నిరంతరం కొనసాగించడం ద్వారా గ్రామాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యకరంగా ఉంచవచ్చని పేర్కొన్నారు. పారిశుద్ధ్య కార్యక్రమంలో కూటమి నాయకులు, స్థానికులు చురుగ్గా పాల్గొనడంతో గ్రామంలో పరిశుభ్రతపై ప్రజల్లో మరింత అవగాహన ఏర్పడింది.

# ఇంటింట ప్రచారంలో తెలుగుదేశం పార్టీ నాయకులు --- హోరహోరీ గా డోర్ టు డోర్ కార్యక్రమం





మెళియాపుట్టి, శివ సూర్య, ఆగస్టు 11 : పాతపట్నం శాసనసభ్యులు అసెంబ్లీ ప్రివిలేజ్ కమిటీ మెంబర్ మామిడి గోవిందరావు ఆదేశాల మేరకు మెళియాపుట్టి మండలంలో కోసమాల పిఏసిఎస్ అధ్యక్షులు సలాన మోహనరావు, తెలుగుదేశం మండల పార్టీ అధ్యక్షుడు నంబాల వెంకటరావు, రాష్ట్ర గౌడ్ కార్పొరేషన్ డైరెక్టర్ భాస్కర్ గౌడ్, ఏఎంసీ ప్రతినిధి బైరిసింగి దినకర్, శ్రీకాకుళం పార్లమెంటరీ నియోజకవర్గ ఆర్గనైజింగ్ సెక్రటరీ అనపాన రాజశేఖర్ రెడ్డి, శ్రీకాకుళం పార్లమెంటరీ అధికార ప్రతినిధి బూర్ల లలిత కుమారి, యువత అధ్యక్షులు బసవ పరమేశ్వర్ రెడ్డి, క్లస్టర్ ఇన్చార్జులు హోరా హోరీగా టిడిపి నాయకులు డోర్ టు డోర్ క్యాంపెయిన్ నిర్వహించారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాలలో పర్యటించి, స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను కరపత్రాల ద్వారా ప్రజలకు వివరించారు. కూటమి ప్రభుత్వ ఏర్పడిన తర్వాత ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు, తల్లికి వందనం, ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, శ్రీ శక్తి పథకం ద్వారా మహిళలందరికీ ఉచిత బస్సు ప్రయాణం, ఆటో డ్రైవర్ల సేవలో వేట 15 వేల రూపాయలు ఆర్థిక భరోసా, అన్నదాత సుఖీభవ ద్వారా ప్రతి రైతుకు ఏట 20 వేల రూపాయలు, రాష్ట్రంలో 269 అన్న క్యాంటీన్ల ద్వారా పేదలకు ఐదు రూపాయలకే భోజన పథకం, పేదలకు ఐదు లక్షల ఇల్లు, పంపిణి సిద్ధంగా మరో ఐదు లక్షలు ఇల్లు, గీత కార్మికులకు మద్యం షాపులు, ఎన్టీఆర్ వైద్య సేవలతో పేదలకు ఉచిత వైద్య సేవలు, సీఎంఆర్ఎఫ్ ద్వారా లక్షలాది కుటుంబాలకు ఆర్థిక సహాయం, మత్స్యకారుల సేవలో ఏట 20వేల రూపాయలు అనేక సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు మండల ఐటీ డిపి అధ్యక్షులు దుక్క శంకర్ రెడ్డి, తెలుగుదేశం పార్టీ నాయకులు వాకాడ గంగారత్నం, హనుమంతు చంద్రశేఖర్, పొట్నూరు రాజు, డాక్టర్ మోహన్ రావు, గోకు మోహన్ రావు, జన్ని రామకృష్ణ, సవర శ్రీరాములు,యూనిట్ ఇన్చార్జులు, బూత్ ఇన్చార్జులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# సైబర్ నేరాలు, డ్రగ్స్‌పై అప్రమత్తంగా ఉండాలి డీఎస్పీ లింగయ్య




నారాయణపేట ఆగస్టు 11: సైబర్ నేరాలు,డ్రగ్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని నారాయణపేట డీఎస్పీ నల్లపూ లింగయ్య అన్నా రు.మంగళవారంమన ఊరు -- మన పోలీస్ కార్య క్రమంలో భాగంగా డీఎస్పీ నల్లపు లింగయ్య నారాయ ణపేట మండలం లింగం పల్లి గ్రామాన్ని సందర్శించి గ్రామ ప్రజలకు పోలీస్ శాఖ చేపడుతున్న కార్యక్రమా లు, ప్రజల భద్రతకు తీసు కుంటున్న చర్యలపై అవగా హన కల్పించారు.ఈ సంద ర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన పోలీస్ వాల్ ప్రాధా న్యతను డీఎస్పీ వివరిం చారు. ప్రజలకు పోలీస్ శాఖతో మరింత సన్నిహిత సంబంధాలు ఏర్పడేలా, గ్రామాల్లో శాంతిభద్రతలు, చట్టపరమైన అంశాలు, ప్రజల భద్రతకు సంబంధిం చిన సమాచారాన్ని చేర వేయడంలో పోలీస్ వాల్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు.అనంతరం గ్రామ ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తూ, సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండా లని సూచించారు. అపరి చిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, అనుమానాస్పద లింకులు, నకిలీ ఆఫర్లు, బ్యాంకింగ్ మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఓ టి పి,పిన్,సి వి వి బ్యాంకు ఖాతా వివరాలు, పాస్‌వ ర్డ్‌లు ఇతరులకు వెల్లడించ వద్దని సూచించారు.ఎవరైనా సైబర్ మోసానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్కు సమా చారం అందించాలని, సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని డీఎస్పీ తెలిపారు.మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతుందని డీఎస్పీ నల్లపు లింగయ్య అన్నారు. యువత గంజాయి, డ్రగ్స్ తదితర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. గ్రామంలో మాదకద్రవ్యాల విక్రయం లేదా వినియోగానికి సంబం ధించిన సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు సమా చారం అందించాలని, డ్రగ్స్ నిర్మూలనలో ప్రజలు పోలీ సులకు సహకరించాలని కోరారు.గ్రామాల్లో నేరాల నియంత్రణ, నేరస్తులను గుర్తించడం, ప్రజల భద్రత ను మరింత పటిష్టం చేయ డంలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని డీఎస్పీ తెలిపారు. ముఖ్యమైన కూడళ్లు, ప్రధాన రహదా రులు, రద్దీ ప్రాంతాలు, గ్రామ ప్రవేశ--నిష్క్రమణ ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా ప్రజలు ముందుకు రావా లని సూచించారు. ప్రజల భద్రత కోసం పోలీస్ శాఖ చేపడుతున్న చర్యలకు గ్రామ ప్రజలు సహకరించా లని డీఎస్పీ కోరారు.ప్రజల భద్రతే పోలీసుల ప్రధాన లక్ష్యం. పోలీసులకు ప్రజలు సహకరిస్తే గ్రామాల్లో నేరాలను మరింత సమ ర్థవంతంగా నియంత్రించ వచ్చు. సైబర్ నేరాలు, డ్రగ్స్‌పై ప్రతి ఒక్కరూ అవ గాహన కలిగి ఉండి, ఇత రులకు కూడా అవగాహన కల్పించాలి అని డీఎస్పీ తెలిపారు.ఈ కార్యక్రమం లో ఎస్సై సతీష్ రెడ్డి, పోలీ స్ సిబ్బంది, లింగంపల్లి గ్రామ ప్రజలు, యువత తదితరులు పాల్గొన్నారు. పరిశుభ్రతపై నిర్లక్ష్యం.. హోటల్‌కు 63% హైజీన్ రేటింగ్మేడ్చల్ జిల్లా ప్రతినిధి, లోకల్ గైడ్, ఆగస్టు 11: ఈసీఐఎల్‌లోని శ్రీ గురు రాఘవేంద్ర ఉడిపి వెజిటేరియన్ హోటల్‌లో కాప్రా, మల్కాజిగిరి ఆహార భద్రత అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా హోటల్‌లో పలు పరిశుభ్రత లోపాలను గుర్తించారు.వంటగది, నిల్వ ప్రాంతాలు అపరిశుభ్రంగా ఉండటంతోపాటు నేలలు, గోడలు, ఎగ్జాస్ట్ జిడ్డుగా, జారుడుగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈగల బెడద అధికంగా ఉన్నట్లు తెలిపారు. సగం వండిన ఆహార పదార్థాలను మూత, లేబుల్ లేకుండా ఉంచినట్లు గుర్తించారు. కుళ్లిన కొబ్బరికాయలు, నేలపై నేరుగా ఉంచిన కూరగాయలు, ఆహార పదార్థాలు బయటపడ్డాయి.సరైన వెంటిలేషన్, చెత్తబుట్టలు లేకపోవడం, కడిగే ప్రాంతాలు, డ్రైనేజీ అపరిశుభ్రంగా ఉండటాన్ని గుర్తించారు. సిబ్బంది రక్షణ దుస్తులు, తగిన శిక్షణ లేకుండా పనిచేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. వైద్య ఫిట్‌నెస్ ధ్రువపత్రాలు, పెస్ట్ కంట్రోల్ రికార్డులు చూపించలేదని తెలిపారు.తనిఖీల్లో హోటల్‌కు 63 శాతం హైజీన్ రేటింగ్ లభించింది. ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన ఆహారం అందేలా తనిఖీలను మరింత కట్టుదిట్టం చేస్తామని అధికారులు తెలిపారు.

# హింసకు స్వస్తి.. సమాజంలో భాగస్వామ్యం కావాలని డిజిపి సివి ఆనంద్ సందేశం.

**లొంగిపోవాలని గణపతి దంపతులకు పోలీసుల పిలుపు.**

**కాకరాల సమత కి 20 లక్షల రూపాయల చెక్ అందజేత.**

**పునరావాస విధానంతో ఇప్పటివరకు లొంగిపోయిన 23 మందికి రూ.2 కోట్ల వరకు సాయం.**



వాజేడు,ప్రతినిధి :- ఆపరేషన్ కగార్ తో తెలంగాణ ఆంధ్ర చత్తీస్గడ్ సరిహద్దు ప్రాంతాలలో ఉన్న కర్రెగుట్టలను జల్లెడ పట్టిన భద్రతా బలగాల కృషి వమ్ము కాలేదు. నాడు కర్రెగుట్టల దండకారణ్యంలో తుపాకుల మోతలతో తూటాల వర్షం కురిసి రక్తమోడిన నేల నేడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల చొరవతో లొంగిన మావోయిస్టుల కంచుకోటలో నేడు అభివృద్ధికి బాటలు పడుతున్నాయి.ఏప్రిల్ 7న కర్రెగుటలలోని సిఆర్పిఎఫ్ 39 పాముసురు బెటాలియన్ ను అప్పటి డిజిపి బి.శివధర్ రెడ్డి సందర్శించి మారుమూల ప్రాంతాల అభివృద్ధి నాంది పలికితే.. సోమవారం కర్రెగుట్టల పర్యటనకు వచ్చిన డీజీపీ సివి ఆనంద్ మరో అడుగు ముందుకు వేసి పాముసురు బెటాలియన్ ను దాటి చెలిమల, డోలి, తడపాల మీదుగా సుమారు 28 కిలోమీటర్ల మేర నిర్మించిన రహదారిని పరిశీలించి కర్రెగుటలలో శాశ్వత అభివృద్ధికి అనుసరించాల్సిన విధానాలపై అధికారులకు స్పష్టమైన సూచనలు చేశారు.డీజీపి గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా కర్రేగుట్టల్లో ఆయన పర్యటించారు.ఆదివారం రాత్రి జిల్లాకు చేరుకున్న డిజిపి జిల్లాలోనే బస చేసి సోమవారం ఉదయం పాముసూరు 39 సిఆర్పిఎఫ్ బేస్ క్యాంపునకు చేరుకున్న ఆయన పోలీసులు గౌరవ వందనం సమర్పించారు.అక్కడి నుంచి కర్రేగుట్టల్లో అభివృద్ధి పనుల్లో భాగంగా చేపట్టిన రహదారి పనులను పరిశీలించారు. పాముసూరు, చెలిమల, డోలి, తడపాల మీదుగా సుమారు 28కిలోమీటర్ల మేర నిర్మించిన రహదారిని పరిశీలించి అక్కడ జెండా ఎగురవేసి, శాంతికపోతాలని గాల్లోకి వదిలారు. ఈ క్రమంలో అక్కడపనుల్లో అనుసరించాల్సిన విధానాలపై అధికారులకు పలు సూచనలు చేశారు.పాముసూరులో నివాసం ఉంటున్న గుత్తి కోయలకు బియ్యం, దుప్పట్లు అందజేసి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.పునరావాస విధానాలతోనే భారీ సంఖ్యలో మావోయిస్టుల లొంగుబాటు.ఈ సందర్భంగా డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. మావోయిస్టుల అణచివేతలో కేంద్ర ప్రభుత్వంతో కలిసి వ్యూహాత్మకంగా అడుగులు వేశామని తెలిపారు. మావోయిస్టుల కంచుకోటలుగా ఉన్న ప్రాంతాలను ఖాళీ చేయించామని, కొందరు ఎన్కౌంటర్లలో మృతి చెందగా.. ప్రభుత్వం తీసుకొచ్చిన పునరావాస విధానాలతో భారీ సంఖ్యలో మావోయిస్టులు లొంగిపోయారని చెప్పారు. లొంగిపోయిన వారికి ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం కూడా అందించామని తెలిపారు. త్వరలోనే ఈ ప్రాంతం అరణ్య ప్రాంతమైనప్పటికీ అటవీశాఖతో కలిసి చూడదగ్గ ప్రదేశాలను గుర్తించి పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేస్తామని డీజీపీ వెల్లడించారు.40 ఏళ్ల మావోయిస్టు జీవితం.. జనజీవన స్రవంతిలోకి..దాదాపు నాలుగు దశాబ్దాలుగా మావోయిస్టు ఉద్యమంలో అండర్‌గ్రౌండ్‌లో కొనసాగిన సీపీఐ (మావోయిస్టు) సీనియర్ నాయకురాలు కాకర్ల సమత అలియాస్ మాధవి, షకీలా, దుర్గా తెలంగాణ పోలీసుల ఎదుట లొంగిపోయారు. ములుగులో డీజీపి సీవీ ఆనంద్ విలేకరుల సమావేశంలో ఆమె నేపథ్యం, పార్టీ బాధ్యతలు, కుటుంబ వివరాలు, ప్రభుత్వం అందిస్తున్న పునరావాస సదుపాయాలను వెల్లడించారు.1985లో వైజాగ్ ప్రాంతంలో నక్సలైట్ కార్యకలాపాలకు ప్రభావితమైన సమత అండర్‌గ్రౌండ్‌లోకి వెళ్లినట్లు డీపిజీ తెలిపారు. అప్పటి నుంచి సుమారు 40 ఏళ్లపాటు వివిధ ప్రాంతాల్లో మావోయిస్టు పార్టీకి పనిచేశారన్నారు. హైదరాబాద్ కమిటీలో సుమారు పదేళ్లు, నల్లమలలో నాలుగేళ్లు, ఉత్తరప్రదేశ్ ఏరియా కమిటీలో రెండేళ్లు, గుజరాత్ గోల్డెన్ కారిడార్ కమిటీ' లో రెండేళ్లు, మహారాష్ట్ర ఏరియా కమిటీలో ఐదేళ్లు, కర్ణాటక--మహారాష్ట్ర ఉమ్మడి కమిటీలో పదేళ్లు పనిచేసినట్లు వివరించారు.సమత సాయుధ కార్యకలాపాలతో పాటు పార్టీ సిద్ధాంతపరమైన, డాక్యుమెంటేషన్ బాధ్యతలు నిర్వహించినట్లు డిజిపి తెలిపారు. సెంట్రల్ కమిటీ తీర్మానాలు, పార్టీ పత్రాల రూపకల్పన, సిద్ధాంతపరమైన అంశాల రచన, అనువాదాలు, మహిళా సమస్యలపై వ్యాసాల రచన, క్యాడర్‌కు అవగాహన కల్పించడం వంటి బాధ్యతలు చేపట్టారన్నారు. మావోయిస్టు పార్టీ జనరల్ సెక్రటరీ ముప్పాళ్ల లక్ష్మణరావు అలియాస్ గణపతికి సీసీ స్టాఫ్ మెంబర్‌గా కూడా పనిచేసినట్లు సమత వెల్లడించిందన్నారు.సమత సోదరి కాకర్ల సునీత అలియాస్ బద్రి కూడా సీనియర్ మావోయిస్టు నాయకురాలిగా పనిచేసి గత ఏడాది తెలంగాణ పోలీసుల ఎదుట లొంగిపోయినట్లు డీజీపి తెలిపారు. మరో కజిన్ సోదరి కాకర్ల పద్మ కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో మావోయిస్టు కార్యకలాపాల్లో పనిచేసిందన్నారు. 2018లో అరెస్టయిన ఆమె ప్రస్తుతం బెయిల్‌పై చెన్నైలో ఉంటున్నట్లు వెల్లడించారు.సమత భర్త పటేల్ సుధాకర్‌రెడ్డి మావోయిస్టు పార్టీలో సీనియర్ క్యాడర్‌గా, మిలిటరీ కమిషన్, పార్టీ ఇంటెలిజెన్స్ విభాగాల్లో కీలకంగా పనిచేసినట్లు డీజీపి తెలిపారు. 2010లో జరిగిన ఎదురుకాల్పుల్లో సుధాకర్‌రెడ్డి మృతి చెందినట్లు చెప్పారు.మావోయిస్టుల పునరావాసంలో తెలంగాణ ప్రభుత్వం మానవీయ దృక్పథంతో వ్యవహరిస్తోందని డిజిపి సీవీ ఆనంద్ తెలిపారు. సరెండర్ అయిన వారికి ఆర్థిక సాయం, సామాజికంగా స్థిరపడేందుకు సహకారం అందిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి హామీ మేరకు ఉచిత వైద్య చికిత్స కోసం ఆరోగ్య రక్షణ కార్డులు జారీ చేసి పంపిణీ చేసినట్లు వెల్లడించారు.సరెండర్ అయిన వారు గౌరవప్రదంగా జీవించేలా ఉపాధి అవకాశాలు కల్పిస్తామని డిజిపి తెలిపారు. వృత్తి లేదా వ్యాపారం చేయాలనుకునే వారికి శిక్షణతో పాటు రుణాలు అందించి స్వయం ఉపాధికి సహకరిస్తామన్నారు. ఆరోగ్య, కేసులు లేదా ఇతర సమస్యలు ఉంటే పోలీసు అధికారులను సంప్రదించాలని సూచించారు. సరెండర్ అయిన వారిని పూర్తిగా జనజీవన స్రవంతిలో కలపడం పునరావాస విధానం లక్ష్యమన్నారు.పునరావాస విధానం కింద ఇప్పటికే 23 మంది సరెండర్ అయిన మావోయిస్టులకు దాదాపు రూ.2 కోట్ల వరకు ఆర్థిక సాయం అందించినట్లు డిజిపి తెలిపారు. సెంట్రల్ కమిటీ, స్టేట్ కమిటీ, పార్టీ మెంబర్ లేదా ఇతర క్యాడర్ అనే తేడా లేకుండా సరెండర్ తర్వాత సాధారణ జీవితంలో స్థిరపడేందుకు ప్రభుత్వం సహకరిస్తుందని స్పష్టం చేశారు.మావోయిస్టు పార్టీ జనరల్ సెక్రటరీ ముప్పాళ్ల లక్ష్మణరావు అలియాస్ గణపతి, ఆయన భార్యతో పాటు అండర్‌గ్రౌండ్‌లో ఉన్న సీనియర్ నాయకత్వం హింసా మార్గాన్ని వీడి లొంగిపోవాలని పోలీసులు మరోసారి విజ్ఞప్తి చేశారు.మావోయిస్టు కార్యకలాపాలకు గతంలో కీలకంగా ఉన్న ప్రాంతం కావడంతో హైదరాబాద్‌కు బదులుగా ములుగులో కార్యక్రమం నిర్వహించినట్లు డిజిపి సివి ఆనంద్ తెలిపారు.తెలంగాణ--ఛత్తీస్‌గఢ్ మధ్య దట్టమైన అటవీ ప్రాంతం గతంలో మావోయిస్టు కార్యకలాపాలకు కారిడార్‌గా ఉండేదని, ఈ ప్రాంతంలో పర్యటించి సరెండర్ క్యాడర్‌తో నేరుగా మాట్లాడినట్లు చెప్పారు. వారి సమస్యలు, పునరావాస విధానంలోని లోపాలు, కేసుల సమస్యలను తెలుసుకున్నామని, అవసరమైతే కేంద్ర, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వాలతో చర్చించి పరిష్కరిస్తామని తెలిపారు.మావోయిస్టులు హింసా మార్గాన్ని విడిచి సమాజంలో కలిసిపోవాలని డిజిపి సీవీ ఆనంద్ పిలుపునిచ్చారు. సరెండర్ అయిన వారు తిరిగి అండర్‌గ్రౌండ్ బాట పట్టకుండా కుటుంబాలతో కలిసి గౌరవప్రదమైన జీవితం గడిపేలా చేయడమే ప్రభుత్వ పునరావాస విధానం లక్ష్యమన్నారు."సరెండర్ అయిన వారికి ఏ సహాయం కావాలన్నా ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఉపాధి, శిక్షణ, రుణాలు, ఆరోగ్య సమస్యలకు వైద్య సాయం అందిస్తాం. వారు సాధారణ పౌరులుగా జీవించాలన్నదే మా ప్రధాన ఉద్దేశం" అని తెలిపారు.కర్రెగుట్టలో పర్యటనలో డిజిపి సివి ఆనంద్ తో పాటు మల్టీజెన్ వన్ ఐజి చంద్రశేఖర్ రెడ్డి, ఇంటెలిజెన్స్ ఐజి కార్తికేయ, రామగుండం సిపి అంబర్ కిషోర్ ఝా, సిఆర్పిఎఫ్ ఎడిజి విక్రమ్ సింగ్, ఇంటెలిజెన్స్ ఎస్పి సింధు శర్మ, ములుగు జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత సహదేవరావు, జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకాన్, డి ఎఫ్ ఓ వికాస్ మీనా, ఏ ఎస్ పి మనన్ భట్ ఐపిఎస్ తదితరులు పాల్గొన్నారు.

# దేశ నిర్మాణంలో భాగస్వాములు కండి

'పార్ట్‌నర్స్ ఇన్ నేషన్ బిల్డింగ్'కు సీఎం చంద్రబాబు పిలుపు

'రోడ్ డాక్టర్' పేరుతో గుంతల్లేని రహదారుల మిషన్

ప్రజలు, ఉద్యోగులు అంతా భాగస్వాములు కావాలని సూచన

జులై నెలలో 10.70 శాతం ఆర్థిక వృద్ధి నమోదు

ఎల్ నినో ప్రభావంపై అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక



అమరావతి: ప్రజలు, ఉద్యోగులు, అధికారుల సమష్టి భాగస్వామ్యంతో 'పార్ట్‌నర్స్ ఇన్ నేషన్ బిల్డింగ్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో గుంతలు లేని రహదారులే లక్ష్యంగా 'రోడ్ డాక్టర్' పేరుతో 'జీరో పాట్ హోల్ మిషన్'ను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి వివిధ శాఖల పనితీరుపై ఆయన ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత సులభతరంగా చేరువ చేయడం ద్వారా ప్రతి ఒక్కరినీ జాతి నిర్మాణంలో భాగస్వాములను చేయాలని ఆకాంక్షించారు. వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర లక్ష్యాల సాధనకు ప్రతి అధికారి, ఉద్యోగి అంకితభావంతో కృషి చేయాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా దెబ్బతిన్న రహదారులకు తక్షణమే మరమ్మతులు చేపట్టేలా 'రోడ్ డాక్టర్' కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి పనులను చిత్తశుద్ధితో చేపట్టినప్పుడు ప్రజల మద్దతు ఎప్పుడూ ఉంటుందని, భోగాపురం విమానాశ్రయ పనుల పురోగతికి లభిస్తున్న స్పందనే ఇందుకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. వాస్తవాలను ప్రజలకు వివరిస్తే వారే ప్రభుత్వానికి అండగా నిలుస్తారని, కర్నూలులో డీఎస్సీ-2025 ఉపాధ్యాయ అభ్యర్థులు చేపట్టిన కార్యక్రమమే ఇందుకు ఉదాహరణ అని తెలిపారు. జులై నెలలో రాష్ట్రం 10.70 శాతం ఆర్థిక వృద్ధిని సాధించిందని వెల్లడించిన ఆయన, రాబోయే రోజుల్లో ఎల్ నినో ప్రభావం తీవ్రంగా ఉండే అవకాశం ఉన్నందున ఎదురయ్యే సవాళ్లను అధిగమించేందుకు సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు. ఈ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## డిసెంబర్‌లో 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'..
# భారీ పెట్టుబడులే లక్ష్యం

సదస్సును అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

గతేడాది వచ్చిన పెట్టుబడులు, సాధించిన పురోగతిపై నివేదిక కోరిన సీఎం

వ్యాపార ప్రముఖులను సదస్సులో సత్కరించేలా ప్రణాళిక

హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్-2 పనులపైనా సీఎం సమీక్ష

రద్దీకి అనుగుణంగా అదనపు కోచ్‌లు సమకూర్చుకోవాలని ఆదేశం



తెలంగాణకు భారీ పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా డిసెంబరులో 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్' నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. సదస్సును అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గత ఏడాది సదస్సు ద్వారా వచ్చిన పెట్టుబడులు, సాధించిన పురోగతిపై సమగ్ర నివేదిక సమర్పించాలని సూచించారు. గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై సీఎం ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. సదస్సు ద్వారా ప్రపంచస్థాయి పెట్టుబడులను తెలంగాణకు తీసుకురావడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. వివిధ వ్యాపార రంగాలకు చెందిన ప్రముఖులను సదస్సులో సత్కరించేలా ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. సంస్థాగత ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. గత ఏడాది సదస్సు తర్వాత తెలంగాణకు వచ్చిన పెట్టుబడులు, వాటి పురోగతిపై వివరాలతో నివేదిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. గత అనుభవాలను పరిగణనలోకి తీసుకుని మరిన్ని పెట్టుబడులు సాధించేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ఇదే సమావేశంలో హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్-2 పనులపైనా సీఎం సమీక్షించారు. పాతబస్తీలో ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కిలోమీటర్ల మార్గంలో రోడ్డు విస్తరణ పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. మెట్రో పనులకు టెండర్ల ప్రక్రియ ప్రారంభించాలని సూచించారు. పెండింగ్ భూసేకరణను పూర్తి చేసి విస్తరణ ప్రణాళికలను ఖరారు చేయాలని చెప్పారు. హైదరాబాద్ మెట్రోలో పెరుగుతున్న ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా అదనపు కోచ్‌లు సమకూర్చుకోవాలని అధికారులను ఆదేశించారు. పాతబస్తీ మెట్రో మార్గంలో అనుసరించాల్సిన సాంకేతికతపై ఢిల్లీ మెట్రో అధికారులతో సంప్రదించాలని సూచించారు.

## పరుగులు పెడుతున్న ఏపీ ఆర్థిక వ్యవస్థ..
# జాతీయ సగటు కంటే మెరుగైన వృద్ధి

జాతీయ సగటును మించి ఏపీ ఆర్థిక వృద్ధి నమోదు

2025-26లో 9.9 శాతానికి చేరిన రాష్ట్ర స్థూల ఉత్పత్తి వృద్ధి రేటు

వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగాల్లో గణనీయమైన ప్రగతి

ఎల్ నినో ప్రభావంపై సీఎం చంద్రబాబు ఆందోళన

సంక్షోభంలోనూ 15% వృద్ధి లక్ష్యంగా పనిచేయాలని అధికారులకు ఆదేశం



ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ స్థిరమైన వృద్ధి పథంలో పయనిస్తోంది. జాతీయ వృద్ధి రేటును అధిగమించి, వరుసగా రెండో ఏడాది కూడా రాష్ట్రం మెరుగైన ప్రగతిని నమోదు చేసింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర స్థూల ఉత్పత్తి (+ూఖా) వృద్ధి రేటు 9.9 శాతానికి చేరుకున్నట్లు జులై 2026 నెలవారీ ఆర్థిక నివేదిక స్పష్టం చేసింది. ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో సీఎం చంద్రబాబు నాయుడుకు ప్రణాళికా విభాగం అధికారులు ఈ నివేదికను సమర్పించారు. నివేదిక ప్రకారం, వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగాల్లో రాష్ట్రం గణనీయమైన వృద్ధిని సాధించింది. 2025-26 రెండో త్రైమాసికంలో వ్యవసాయ రంగం 13.5 శాతం, పారిశ్రామిక రంగం 10.6 శాతం, సేవా రంగం 9.9 శాతం వృద్ధిని నమోదు చేశాయి. ముఖ్యంగా సుగంధ ద్రవ్యాల ఉత్పత్తి 304 శాతం, వాణిజ్య వాహనాల విక్రయాలు 51.6 శాతం, ఎస్‌టిపిఐ (ఞూ×) ఎగుమతులు 32.2 శాతం మేర పెరిగాయి. సాంకేతికత వినియోగం ద్వారా జీఎస్టీ వసూళ్లు 21 శాతం వృద్ధితో రూ.13,282 కోట్లకు చేరాయి. రాష్ట్రంలోకి పెట్టుబడుల ప్రవాహం కూడా ఆశాజనకంగా ఉంది. రూ. 2.88 లక్షల కోట్ల విలువైన మెగా ప్రాజెక్టుల పెట్టుబడుల్లో 75.4 శాతం మేర గ్రౌండింగ్ పూర్తయింది. ఈ నివేదికను సమీక్షించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్రం ఎదుర్కొంటున్న ప్రస్తుత సవాళ్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఎల్ నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా నమోదైందని, కృష్ణా నదిలో నీటి లభ్యత లేక శ్రీశైలం, నాగార్జునసాగర్ వంటి ప్రధాన ప్రాజెక్టులు నిండలేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి సంక్షోభ పరిస్థితుల్లోనూ రాష్ట్ర స్థూల ఉత్పత్తి లక్ష్యాలు దెబ్బతినకుండా పటిష్ఠమైన కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రం 15 శాతం వృద్ధి రేటును సాధించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం స్పష్టం చేశారు. అన్ని ప్రభుత్వ శాఖల్లోనూ సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించుకోవాలని, ప్రజలపై ధరల భారం పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జిల్లా, నియోజకవర్గం, మండలాల వారీగా నివేదికలు రూపొందిస్తే లక్ష్యాల సాధన సులభమవుతుందని పేర్కొన్నారు. ఈ సమీక్షా సమావేశంలో ఆర్థిక, ప్రణాళికా శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# డబ్బుఉందా? డెబిట్! లేదా క్రెడిట్!

స్వైప్ ఒకటే.. స్టైల్ రెండు

భారత్‌లో డెబిట్-కమ్-క్రెడిట్ కార్డు చెల్లింపుల్లో కొత్త ట్రెండు

ఒకే 16 అంకెల నంబర్‌తో డెబిట్, క్రెడిట్ రెండూ

డిజిటల్ పేమెంట్స్‌లో 'ఫ్లెక్సిబుల్' అడుగు´వీసా కార్డు గేమ్‌చేంజర్




భారత్‌లో డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ మరో కీలక మలుపు తీసుకుంటోంది. అంతర్జాతీయ చెల్లింపుల దిగ్గజం వీసా త్వరలో భారత్‌లో ఒకే కార్డుతో అటు డెబిట్‌కి, ఇటు క్రెడిట్‌కి రెండు విధాలుగా ఉపయోగపడేలా 'డెబిట్--కమ్--క్రెడిట్ కార్డు'ను ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతోంది. ఈ కొత్త విధానం వినియోగదారులకు సౌకర్యాన్ని పెంచడమే కాకుండా, దేశంలో క్రెడిట్ వినియోగాన్ని విస్తరించే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.

### యూపీఐ, డెబిట్, క్రెడిట్ కార్డులతో పోలిస్తే

ప్రస్తుతం భారత్‌లో యూపీఐ వేగంగా విస్తరిస్తున్నప్పటికీ, అది ప్రధానంగా బ్యాంక్ సేవింగ్స్ ఖాతా నుంచి నేరుగా డబ్బు కట్ అయ్యే విధానమే. డెబిట్ కార్డులు కూడా ఖాతాలో డబ్బు ఉంటేనే పనిచేస్తాయి. మరోవైపు, క్రెడిట్ కార్డులు సౌకర్యవంతమే అయినా వాటి వినియోగం డిజిటల్ రూపంలో,యూపీఐ చెల్లింపుల విషయంలో ఇంకా పరిమితంగానే ఉంది. ఈ నేపథ్యంలో వీసా తీసుకొస్తున్న కొత్త కార్డు యూపీఐతో అందే సౌలభ్యం, డెబిట్ కార్డుతో చేయగల నియంత్రణ, క్రెడిట్ కార్డు ఫ్లెక్సిబిలిటీ ఈ మూడింటినీ కలిపిన ఉపయోగకరమైన సాధనంగా మారనుందని విశ్లేషకులు అంటున్నారు.

### బ్యాంకులు, వినియోగదారులకు లాభాలు

ఈ కొత్త విధానం ద్వారా బ్యాంకులు తమ రిస్క్ పాలసీలకు అనుగుణంగా క్రెడిట్ వినియోగాన్ని నియంత్రించగలుగుతాయి. వినియోగదారులకు మాత్రం ఒకటి కంటే ఎక్కువ కార్డులని ప్రతిచోటుకూ మోసుకెళ్లాల్సిన అవసరం ఉండదు. ముఖ్యంగా స్థిర ఆదాయం ఉన్నా క్రెడిట్ కార్డు లేని మధ్య తరగతి వర్గానికి ఇది ఉపయోగకరంగా మారే అవకాశం ఉంది.

### ఆర్థిక వ్యవస్థపై ప్రభావం

నిపుణుల అంచనాల ప్రకారం, ఈ విధానం నగదు వినియోగాన్ని తగ్గించడంలో, టైర్--2, టైర్--3 నగరాల్లో కార్డు వినియోగాన్ని పెంచడంలో, ఫార్మల్ ఎకానమీని బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించే అవకాశం ఉంది. అయితే, అతిగా క్రెడిట్ వినియోగం వల్ల వినియోగదారుడు అప్పుల ఊబిలో కూరుకునే ప్రమాదం కూడా ఉందని, అందుకే ప్రజల్లో ఆర్థిక అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. వీసా ప్రతిపాదిస్తున్న ఈ డెబిట్--కమ్--క్రెడిట్ కార్డు భారత్ చెల్లింపుల వ్యవస్థను మరింత స్మార్ట్‌గా, ఫ్లెక్సిబుల్‌గా మార్చే విధానంగా పరిగణించవచ్చు. ఇది వినియోగదారుల సౌకర్యం, బ్యాంకులకు భద్రత ఈ రెండింటికీ మధ్య సమతుల్యత తీసుకురావచ్చని విశ్లేషకుల అభిప్రాయం.

### కార్డు కాదు కాంబోప్యాక్

వీసా అభివృద్ధి చేసిన 'ఫ్లెక్సిబుల్ క్రెడెన్షియల్ (వీసా ఫ్లెక్స్) ' టెక్నాలజీ ఆధారంగా ఈ కార్డు పనిచేస్తుంది. 16 అంకెల ఒకే కార్డు నంబర్ ద్వారా కస్టమర్ లావాదేవీ చేసే సమయంలో అది అవసరాన్ని బట్టి డెబిట్‌గా లేదా క్రెడిట్‌గా వాడుకోవచ్చు. చెల్లింపు ఎలా జరగాలన్నది కస్టమర్ కొనుగోలు చేసే విలువ మొత్తం, లేదా వినియోగదారు ముందుగా ఎంచుకున్న సెట్టింగ్స్ ఆధారంగా ఆటోమేటిక్‌గా నిర్ణయమవుతుంది.ఉదాహరణకు, రోజువారీ చిన్న ఖర్చులు డెబిట్‌గా, పెద్ద కొనుగోళ్లు క్రెడిట్‌లో జరిగేలా ఈ కార్డును సెట్ చేసుకోవచ్చు.

### భారత్ ఎందుకు కీలక మార్కెట్?

భారత్‌లో క్రెడిట్ కార్డు వినియోగం అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే తక్కువ. అదే సమయంలో నగదు లావాదేవీల వాటా చాలా పెద్దది. ఈ పరిస్థితిలో ఒకే కార్డు ద్వారా డెబిట్--క్రెడిట్ సౌకర్యం ఇవ్వడం వల్ల డిజిటల్ చెల్లింపులు మరింత విస్తరించవచ్చని వీసా భావిస్తోంది.

# కొన్ని క్యాన్సర్లను నివారించొచ్చు

38% కేసులకు ముందస్తుగా అడ్డుకట్ట

ఏటా 71 లక్షల మందిని కాపాడవచ్చు

ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక వెల్లడి




స్పెషల్ డెస్క్: క్యాన్సర్.. ప్రపంచాన్ని వణికిస్తున్న అత్యంత భయంకరమైన వ్యాధి. ఏటా ఒక కోటి మంది ఈ వ్యాధి బారినపడి కన్నుమూస్తున్నారంటే ముప్పు ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. వాస్తవానికి కొత్త క్యాన్సర్ కేసుల్లో మూడింట ఒక వంతు కంటే ఎక్కువ నివారించదగినవే. అంటే ఏటా 71 లక్షల మందిని ఈ మహమ్మారి బారిన పడకుండా కాపాడవచ్చన్నమాట. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) శాస్త్రవేత్తల నివేదిక ప్రకారం.. 2022లో 1.87 కోట్ల మందికి కొత్తగా క్యాన్సర్ సోకింది. ఇందులో సుమారు 38% కేసులు ఇన్ఫెక్షన్లు (అంటువ్యాధులు), జీవనశైలి అలవాట్లు, పర్యావరణ కాలుష్య కారకాల వల్ల సంభవించాయని అంచనా. ఇవన్నీ నివారించదగినవే. హ్యూమన్ పాపిలోమా వైరస్ (హెచ్‌పీవీ) ఇన్ఫెక్షన్ల వల్ల కలిగే గర్భాశయ క్యాన్సర్లను సకాలంలో టీకాలు వేయడం ద్వారా అడ్డుకోవచ్చు. అలాగే స్మోకింగ్ వల్ల కలిగే అనేక కణితులను ధూమపానం మాన్పించడం ద్వారా చెక్ పెట్టవచ్చు. ఇలా లక్షలాది మంది ప్రజల జీవితాలను మార్చడానికి 'శక్తివంతమైన అవకాశం'ఉందని పరిశోధకులు అంటున్నారు.

### కొన్ని క్యాన్సర్లు అనివార్యం..

వయసు పెరిగే కొద్దీ మన డీఎన్ఏలో అనివార్యంగా జరిగే నష్టం లేదా వ్యాధి వచ్చే ప్రమాదాన్ని పెంచే జన్యువులు వారసత్వంగా రావడం వల్ల కొన్ని క్యాన్సర్లు అనివార్యం. అయితే 10లో దాదాపు నాలుగు కేసులను నివారించవచ్చన్న అంశం జనంలో ఆసక్తి రేకెత్తిస్తోందని పరిశోధకులు చెబుతున్నారు. క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచే 30 నివారించగల కారకాలను డబ్ల్యూహెచ్ఓలో భాగమైన ఇంటర్నేషనల్ ఏజెన్సీ ఫర్ రీసెర్చ్ ఆన్ క్యాన్సర్ అనే సంస్థ విశ్లేషించింది. ధూమపానం, అతినీలలోహిత (అల్ట్రావయోలెట్) కిరణాలు వీటిలో ఉన్నాయి. ఇవి మన డీఎన్ఏను నేరుగా దెబ్బతీస్తాయి. ఊబకాయం, శరీరంలో వాపు, హార్మోన్లను మార్చే అతి తక్కువ శారీరక శ్రమ క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచుతోంది. వాయు కాలుష్యం వల్ల నిద్రాణమైన క్యాన్సర్ కణాలు మేల్కొంటాయని ఏజెన్సీ వెల్లడించింది.

### ధూమపానం ప్రధాన కారణం

క్యాన్సర్‌కు దారితీసే తొమ్మిది ఇన్ఫెక్షన్లను కూడా ఏజెన్సీ నివేదించింది. వీటిలో హెచ్‌పీవీ, కాలేయ క్యాన్సర్‌కు దారితీసే హెపటైటిస్ వైరస్‌లు, కడుపు నొప్పి, అల్సర్స్, తీవ్రమైన గ్యాస్ సమస్యలకు కారణం అయ్యే హెలికోబాక్టర్ పైలోరి బ్యాక్టీరియా ఉన్నాయి. పరిశోధన బృందం 2022 నుండి 36 రకాల క్యాన్సర్ కేసుల డేటాను.. అలాగే 185 దేశాలలో 2012--22 మధ్య ఈ వ్యాధికి మూలమైన 30 ప్రమాద కారకాల సమాచారాన్ని విశ్లేషించి నివేదికను రూపొందించింది. ప్రపంచవ్యాప్తంగా అత్యధిక క్యాన్సర్ కేసులకు ధూమపానం ప్రధాన కారణమని వెల్లడించింది. ఆ తరువాతి స్థానాల్లో ఇన్ఫెక్షన్లు, మద్యపానం ఉన్నాయి. భవిష్యత్తులో క్యాన్సర్ భారాన్ని తగ్గించుకోవడానికి ప్రమాద కారకాలను నివారించడం అత్యంత శక్తివంతమైన మార్గాలలో ఒకటి అని పరిశోధన వెల్లడించింది.

### దేశాలకు అనుగుణంగా..

పురుషుల క్యాన్సర్లలో 45% నివారించదగినవిగా ఉండగా.. మహిళల్లో ఇది 30% ఉంది. నివారణ స్థాయి పురుషులలో అధిక స్థాయిలో ఉండడానికి కారణం.. ధూమపాన ప్రియులు పురుషుల్లో ఎక్కువగా ఉండడమే. యూరప్‌లో నివసించే మహిళల్లో క్యాన్సర్ దరి చేరకుండా ఫుల్‌స్టాప్ పెట్టే మొదటి మూడు కారణాల్లో ధూమపానం, ఇన్ఫెక్షన్లు, ఊబకాయం ఉన్నాయి. సబ్--సహారా ఆఫ్రికాలో మహిళల్లో నివారించగల క్యాన్సర్లలో ఇన్ఫెక్షన్ల వాటా దాదాపు 80% ఉంది. అంటే ఈ క్యాన్సర్లను పరిష్కరించడానికి ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు తీసుకునే చర్యలు ప్రతి ప్రాంతం లేదా దేశానికి అనుగుణంగా ఉండాలని నివేదిక వివరించింది.

### సగం వాటా వాటిదే..

నేచర్ మెడిసిన్ జర్నల్‌లో ప్రచురితమైన ఈ నివేదిక ప్రకారం ధూమపానం, వాయు కాలుష్యంతో ఊపిరితిత్తుల క్యాన్సర్, హెలికోబాక్టర్ పైలోరి ఇన్ఫెక్షన్‌తో ముడిపడి కడుపు క్యాన్సర్, హ్యూమన్ పాపిలోమా వైరస్‌తో గర్భాశయ క్యాన్సర్.. నివారించగల మొత్తం క్యాన్సర్ కేసుల్లో ఇవి దాదాపు సగం ఉంటాయి. ధూమపానం నియంత్రణ, హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ చేపట్టిన దేశాల్లో క్యాన్సర్ కేసులు తగ్గాయని నివేదిక తెలిపింది. ధూమపానం ప్రపంచవ్యాప్తంగా పురుషుల్లో అతిపెద్ద ముప్పుగా పరిణమించింది.

### మహిళల్లో 30% నివారించవచ్చు..

నివేదిక ప్రకారం.. మహిళల్లో 92 లక్షల కొత్త క్యాన్సర్ కేసుల్లో సుమారు 30% నివారించవచ్చు.

సబ్ సహారా ఆఫ్రికా వంటి తక్కువ, మధ్యస్థాయి ఆదాయ దేశాల్లో సరై?వకల్ క్యాన్సర్ కేసులు అధికం.

అధిక ఆదాయ దేశాలైన ఉత్తర అమెరికా, యూరప్‌లో మహిళల్లో క్యాన్సర్‌కు స్మోకింగ్ ప్రధాన కారణం.

పురుషుల్లో 43 లక్షల నివారించదగ్గ క్యాన్సర్ కేసుల్లో 25% ధూమపానం కారకంగా నిలిచింది.

ఇన్ఫెక్షన్‌తో కూడిన క్యాన్సర్ కేసులు పురుషుల్లో ఆఫ్రికా, ఆసియా, దక్షిణ అమెరికాలో ఎక్కువ.

# స్పామ్ కాల్స్.. ఇక బ్లాక్!

ఫిర్యాదుల అవసరం లేకుండానే నిషేధం

స్పామ్ నంబర్‌గా టెల్కోలు గుర్తిస్తే చర్యలు

కసరత్తు చేస్తున్న టెలికం నియంత్రణ సంస్థ




అవాంఛిత, మోసపూరిత కాల్స్, సందేశాలు ప్రపంచానికి సవాల్‌గా మారాయి. వ్యక్తుల భద్రతకు ముప్పుగా పరిణమించడంతోపాటు ఆర్థిక నష్టాలకూ ఇవి కారణం అవుతున్నాయి. మన దేశంలో 95% మంది మొబైల్ యూజర్లకు ప్రతిరోజూ స్పామ్ కాల్స్, సందేశాలు వెల్లువెత్తుతున్నాయంటే సమస్య తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. ఈ నేపథ్యంలో స్పామ్ కాల్స్‌కు చెక్ పెట్టేందుకు టెలికం నియంత్రణ సంస్థ (ట్రాయ్) సిద్ధమవుతోంది. కస్టమర్ అందుకున్న కాల్, మెసేజ్‌ను టెలికం కంపెనీ స్పామ్‌గా గుర్తిస్తే ఆ నంబర్‌ను బ్లాక్ లిస్టులోకి చేర్చాలని భావిస్తోంది. అలాగే అధికారిక ఫిర్యాదు లేకపోయినా స్పామ్ మెసేజ్‌లు పంపే మొబైల్ నంబర్‌ను డిస్‌కనెక్ట్ చేయాలన్న ప్రతిపాదనపై ట్రాయ్ కసరత్తు చేస్తోంది. టెలికం కంపెనీలతో ఈ మేరకు చర్చిస్తోంది. ప్రస్తుతం టెల్కోలు 10 రోజుల వ్యవధిలో ఐదు ప్రత్యేక ఫిర్యాదులను స్వీకరిస్తే స్పామర్‌పై చర్య తీసుకుంటున్నాయి. తాజా ప్రతిపాదన ప్రకారం ఒక నంబర్‌ను వరుసగా 10 రోజులపాటు అనుమానిత స్పామ్‌గా ఏఐ టెక్నాలజీ గుర్తిస్తే.. ఆ నంబర్‌కు వ్యతిరేకంగా ఎటువంటి ఫిర్యాదు లేకపోయినా కూడా చర్య తీసుకోవచ్చు. ఇది అమల్లోకి వస్తే స్పామ్ కాల్స్, మెసేజెస్ కట్టడికి టెలికం కంపెనీలు చేపడుతున్న చర్యలకు మరింత ఊతం ఇచి?చనట్టు అవుతుంది.

### రియల్ టైమ్‌లో విశ్లేషించి..

ప్రస్తుతం దేశంలో ఏదైనా అవాంఛిత సమాచారాన్ని స్పామ్‌గా గుర్తించడానికి నిర్దిష్ట నియమాలు లేవు. కాల్స్, సందేశాలు పంపినవారి రోజువారీ వినియోగ తీరు, కాల్స్ ఎంత సమయం మాట్లాడుతున్నారు, ఎన్ని సందేశాలు పంపిస్తున్నారు, ఎవరెవరికి, ఏ ప్రాంతంలో ఉన్నవారికి ఈ కాల్స్ చేస్తున్నారు వంటి అంశాలను టెల్కోలు ఉపయోగిస్తున్న ఏఐ సాంకేతికత రియల్ టైమ్‌లో విశ్లేషించి.. అవాంఛిత కాల్స్, మెసేజెస్‌ను గుర్తించి వినియోగదారులను అప్రమత్తం చేస్తున్నాయి. కాల్‌ను అంగీకరించడం లేదా తిరస్కరించడం అనేది కస్టమర్ నిర్ణయంపైనే ఆధారపడి ఉంటుంది. అయితే అనుమానిత స్పామ్‌గా గుర్తించిన అనేక కాల్స్ నిజమైన కాలర్ల నుంచి వచి?చనవే ఉంటున్నాయి. వాటిలో గిగ్ వర్కర్లతోపాటు ఇతర వాణిజ్య సంస్థలు ఉన్నాయి.

### వ్యవస్థీకృతంగా మోసాలు..

2024 సెపట?టంబర్ నుంచి 2026 జనవరి మధ్య 7,100 కోట్ల స్పామ్ కాల్స్, 290 కోట్ల స్పామ్ సందేశాలను గుర్తించినట్లు ఎయిర్‌టెల్ ప్రకటించింది. 8 లక్షలకుపైగా మోసపూరిత లింక్స్‌ను బ్లాక్ చేసినట్లు వెల్లడించింది. సైబర్ నేరగాళ్లు ఆధునిక సాంకేతికతను ఉపయోగిస్తూ కాల్ సెంటర్లతో వ్యవస్థీకృతంగా మోసపూరిత కార్యకలాపాలు సాగిస్తున్నట్లు తెలిపింది. సైబర్ నేరగాళ్ల కారణంగా ప్రపంచవ్యాప్తంగా రూ. 92.7 లక్షల కోట్ల ఆర్థిక నష్టం వాటిల్లిందని భారతీ ఎయిర్‌టెల్ చీఫ్ రెగ్యులేటరీ ఆఫీసర్ రాహుల్ వాట్స్ వెల్లడించారు. 250కిపైగా కొలమానాలను పరిగణనలోకి తీసుకొని స్పామ్ కాల్స్, సందేశాలను గుర్తిస్తున్నట్టు చెప్పారు.

టెల్కోలు ఏఐ సొల్యూషన్స్ సాయంతో ప్రతి నెలా సుమారు 40 కోట్ల కాల్స్, సందేశాల ను అనుమానిత స్పామ్‌గా గుర్తిస్తున్నాయి.

నమోదు కాని టెలీమార్కెటర్ల నుంచి వస్తున్న వాటిలో 7.5 కోట్ల కాల్స్, ఎస్ఎంఎస్‌లు ప్రతిరోజూ బ్లాక్ అవుతున్నాయి.

స్పామర్లపై టెల్కోలకు రోజుకు సగటున 10,000 ఫిర్యాదులు మాత్రమే అందుతున్నాయని సమాచారం.

2025 ఫిబ్రవరిలో 1,16,213 స్పామ్ ఫిర్యాదులు టెల్కోలకు అందగా 2025 డి సెంబర్‌లో ఆ సంఖ్య 3,34,317కు చేరింది.

ఫిర్యాదులలో ఎక్కువ భాగం నమోదు కాని టెలిమార్కెటర్లపైనే ఉంటున్నాయి.

టెలిమార్కెటింగ్ కంపెనీల ప్రతినిధులు సాధారణంగా 10 అంకెల మొబైల్ నంబర్ ద్వారా కాల్స్ చేస్తున్నారు.

భారత్‌లో 116 కోట్ల మంది మొబైల్ సబ్‌స్క్రైబర్స్ ఉన్నారు. వారిలో అవాంఛిత కాల్స్‌ను నివారించేందుకు ట్రాయ్ తీసుకొచి?చనడు నాట్ డిస్టర్బ్ (డీఎన్‌డీ) సేవలను 22 కోట్ల మంది మాత్రమే ఎంపిక చేసుకున్నారు.

# రక్షణ మొదలు క్రీడల వరకు అన్ని రంగాల్లోనూ అతివల ముద్ర



## అన్నింటా 'ఆమె'

అడ్డంకులను అధిగమిస్తూ.. అవహేళనలు, అవమానాలను దాటుకుంటూ నేడు అన్ని రంగాలనూ ఆమె జయిస్తోంది. దేశ రక్షణ మొదలు క్రీడల వరకు.. ప్రభుత్వ కొలువుల నుంచి ప్రైవేటు ఉద్యోగాల దాకా అన్నింటా తనదైన ముద్ర వేస్తోంది. పంచాయతీ నుంచి పార్లమెంట్ వరకు నిర్ణయాలు తీసుకోవడంలో ఆమె మార్క్ స్పష్టంగా కనిపిస్తోంది. ఇంటి బడ్జెట్ తయారు చేయడం నుంచి దేశ బడ్జెట్ రూపొందించే స్థాయి దాకా అతివ హవా కొనసాగుతోంది. దేశంలో నారీ శక్తి ఇప్పుడు కేవలం నినాదానికే పరిమితం కాకుండా అదొక నిరంతర ప్రవాహంగా మారింది. నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వివిధ రంగాల్లోని మహిళామణుల సమాహారం.

### దేశ రక్షణకు పాటుపడుతూ..

దేశ రక్షణ రంగంలోనూ అతివలు చురుగ్గా రాణిస్తున్నారు. స్క్వాడ్రన్ లీడర్ భావన కాంత్ (పోరాటంలో మొదటి మహిళా యుద్ధ పైలట్), కల్నల్ సోఫియా ఖురేషి (విదేశాలలో ఆర్మీ బృందానికి నాయకత్వం వహించిన మొదటి మహిళ) ఉన్నారు. భారత నావికాదళ యుద్ధనౌకకు మొదటి మహిళా కమాండర్‌గా ప్రేరణ దేవస్థలీ గుర్తింపు పొందారు. రక్షణ రంగం (డిఫెన్స్) లో భావనా కాంత్‌తోపాటు అవని చతుర్వేది మోహనా సింగ్ దేశ తొలితరం ఫైటర్ పైలట్లుగా ఖ్యాతిగాంచారు. అంతరిక్షం రంగంలో రీతూ కరిధాల్ (రాకెట్ ఉమెన్ ఆఫ్ ఇండియా) మంగళయాన్, చంద్రయాన్--2 మిషన్లలో కీలకపాత్ర పోషించారు. గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో పారామిలిటరీ దళాల్లో పూర్తిగా పురుషులతో కూడిన సీఆర్‌పీఎఫ్ బృందానికి సిమ్రాన్ బాలా నాయకత్వం వహించారు. 'భారత క్షిపణి మహిళ'గా పేరుగాంచిన డాక్టర్ టెస్సీ థామస్ డీఆర్‌డీవోలో కీలకమైన క్షిపణి ప్రాజెక్టులను ముందుండి నడిపించారు. భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో)లో 20--30% మంది మహిళలు పనిచేస్తున్నారు.

### ఆటల్లో ఐకాన్‌లుగా..

క్రీడారంగంలో మేరీ కోమ్ (బాక్సింగ్) మిథాలీ రాజ్ (క్రికెట్) వంటి క్రీడల్లో ఐకాన్‌లుగా మారారు. పి.వి. సింధు (బ్యాడ్మింటన్) రెండు ఒలింపిక్ పతకాలు సాధించిన మొదటి భారతీయ మహిళగా చరిత్ర సృష్టించారు.

### వివిధ రంగాల్లో ముందంజ...

దేశంలో 20% స్టార్టప్ సంస్థలకు మహిళలు నాయకత్వం వహిస్తున్నారు. 2022 నాటికి అగ్రశ్రేణి కంపెనీలలో సీఈవో/ఎండీ పాత్రలలో మహిళా ప్రాతినిధ్యం 55% పెరిగింది. ప్రముఖ వ్యక్తులలో ఫల్గుణి నాయర్ (నైకా), కిరణ్ మజుందార్--షా (బయోకాన్) అగ్రభాగాన కొనసాగుతున్నారు. ఇప్పుడు సాఫ్ట్‌వేర్ పరిశ్రమలో 30% మంది, వ్యవసాయ శ్రామికశక్తిలో దాదాపు 42% మంది అతివలు ఉన్నారు. జార్ఖండ్‌లోని 'రాణి మిస్త్రీలు'(క్వీన్ మేస్త్రీలు) భవన నిర్మాణ రంగంలోకి ప్రవేశించడం ద్వారా సంప్రదాయ పాత్రలకు మించి ముందుకు సాగుతున్నారు. ఇంకా సవాళ్లు.. : అనేక రంగాల్లో మహిళలు పురోగతి సాధిస్తున్నప్పటికీ మహిళలు ఇప్పటికీ గణనీయమైన సవాళ్లను ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా లింగ వేతన అంతరం ఎక్కువగా కనిపిస్తోంది. పురుషులతో పోలిస్తే ఒకే రకమైన పనికి మహిళలకు తక్కువ వేతనం లభిస్తోంది. ప్రధానంగా వ్యవసాయ రంగంలో లింగ వేతన అంతరం ఎక్కువగా ఉంటోంది. గ్రామీణ మహిళలు పెద్ద సంఖ్యలో వ్యవసాయంలో జీతం లేని కుటుంబ కార్మికులుగా పనిచేస్తున్నారు. కార్పొరేట్, సైన్స్, టెక్నాలజీ రంగాల్లో మహిళలు ఉన్నతస్థాయి నాయకత్వ స్థానాలకు వెళ్లడానికి కష్టపడుతున్నారు, సీనియర్ స్థాయిల్లో వారి ప్రాతినిధ్యం తగ్గుతోంది.

### 'బోర్డు'ల్లోనూ ఆమె

ప్రైవేట్ సంస్థల్లో 29% బోర్డు డైరెక్టర్ పదవులను, ప్రభుత్వ సంస్థల్లో 20% డైరెక్టర్ల పోస్టుల్లో మహిళలు కొనసాగుతున్నారు. ఈ ఏడాది జనవరి నాటికి దేశంలోని మొత్తం సంస్థల డైరెక్టర్ల పదవుల్లో 32 శాతం అతివలు ఉన్నారు. బోర్డులో కనీసం ఒక మహిళ ఉన్న ప్రైవేట్ కంపెనీలు మొత్తం పురుష బోర్డుల కంటే సగటున 16% నుంచి 29% ఎక్కువ నిధులను సేకరించాయి. 2015 తర్వాత స్థాపించిన కంపెనీలు పాత సంస్థల కంటే (16%) ఎక్కువ వైవిధ్యాన్ని (20% మహిళలు) కలిగి ఉన్నాయి. బోర్డులో కనీసం ఒక మహిళ ఉన్న ప్రైవేట్ కంపెనీలు, పూర్తిగా పురుషుల బోర్డులు ఉన్న వాటి కంటే ఏడాదిలోగా పబ్లిక్‌గా ఇష్యూకు వెళ్లే అవకాశం 10 రెట్లు ఎక్కువగా ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.

# శత్రు భయంకర క్షిపణి

ఇరాన్‌పై ఇంతకు మునుపెన్నడూలేనంతగా విచ్చలవిడిగా దాడులు చేస్తున్న అమెరికా బలగాలు తాజాగా తమ అమ్ములపొదిలోని మరో నూతన క్షిపణిని ఇరాన్ మీదకు ప్రయోగించాయి. ప్రపంచంలో ఆయుధాల తయారీరంగ దిగ్గజం లాక్‌హీడ్ మార్టిన్ ప్రత్యేకంగా అమెరికా బలగాల కోసం అభివృద్ధిచేసి ఇచ్చిన 'ప్రెసిషన్ స్ట్రైక్ మిసైల్(పీఆర్ఎస్ఎం) సైతం ఇప్పుడు ఇరాన్‌పై దాడులకు సిద్ధమైంది. యుద్ధంలో పీఆర్ఎస్ఎంను తొలిసారిగా ఉపయోగించినట్లు అమెరికా అధికారికంగా ధృవీకరించింది. "చరిత్రలోనే తొలిసారిగా దీర్ఘ శ్రేణి క్షిపణి పీఆర్ఎస్ఎంను ఇరాన్‌పై మొదలెట్టిన 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ'లో ఉపయోగించాం. తీవ్రమైన దాడులను విజయవంతంగా పూర్తిచేసింది. క్షిపణుల సాయంతో శత్రుసేనలను ఎటూ పాలుపోకుండా చేస్తున్న మా సాయుధ బలగాల శక్తియుక్తులను చూసి గర్వపడకుండా ఉండలేకపోతున్నా"అని అమెరికా సెంట్రల్ కమాండ్ కమాండర్ అడ్మిరల్ బ్రాడ్ కూపర్ తన సామాజిక మాధ్యమ 'ఎక్స్'ఖాతాలో వ్యాఖ్యానించారు. క్షిపణి లాంచర్ అయిన హైమొబిలిటీ ఆర్టిలరీ రాకెట్ సిస్టమ్(హైమార్స్)ఎం142 నుంచి పీఆర్ఎస్ఎంను ప్రయోగించిన వీడియోను అమెరికా సెంట్రల్ కమాండ్ తన ఖాతాలో షేర్‌చేశారు.



దాడిచేస్తే తప్పించుకోవడం కల్ల..

అమెరికాలోని మేరీల్యాండ్ కేంద్రంగా పనిచేసే లాక్‌హీడ్ మార్టిన్ సంస్థ 2023 డిసెంబర్‌లో ఈ రకం క్షిపణులను అమెరికా బలగాలను అప్పగించింది. కనిష్టంగా 60 కిలోమీటర్ల నుంచి గరిష్టంగా 500 కిలోమీటర్ల పరిధిలోని లక్ష్యాలను అత్యంత ఖచ్చితత్వంలో నాశనంచేయడం పీఆర్ఎస్ఎంల ప్రత్యేకత. రాకెట్లను ప్రయోగించే వాహనాలైన మల్టిపుల్ లాంచ్ రాకెట్ సిస్టమ్(ఎంఆర్ఎల్ఎస్)తోపాటు హైమొబిలిటీ ఆర్టిలరీ రాకెట్ సిస్టమ్(హైమార్స్)ల నుంచి క్షిపణిని ప్రయోగించవచ్చు. ముఖ్యంగా ఎంఎల్ఆర్ఎస్ఎం--270, హైమార్స్ఎం--142 వాహనాల మీద నుంచి కొత్త క్షిపణులను ఎంతో సులభంగా ప్రయోగించవచ్చు. దీని దాడి నుంచి తప్పించుకోవడం అసాధ్యం. క్షిపణిని ఇతర రకాల లాంచర్‌ల నుంచి సైతం ప్రయోగించవచ్చు. అత్యవసర సమయాల్లో ఎలాగైనా ఇతర లాంచర్‌ల నుంచి ప్రయోగించేందుకు వీలుగా 'ఓపెన్ సిస్టమ్ ఆర్కిటెక్చర్'విధానంలో దీనిని రూపొందించారు. వేర్వేరు ఇతర కంపెనీల లాంచర్ నుంచి ఎంతో వేగంగా దీనిని ప్రయోగించవచ్చు.

అత్యంత సురక్షితం..

యుద్ధక్షేత్రాలకు తరలించే క్రమంలో పొరపాటున పేలిపోయే అవకాశమే ఉండదు. ప్రయోగించకముందే రవాణా సమయంలో పొరపాటున కిందపడినా, అగ్?నికి ఆహుతైనా, పదునైన వస్తువులు గుచ్చుకున్నా ఇది పేలదు. కేవలం ప్రయోగించాక ట్రిగ్గర్‌ను క్రియాశీలంచేశాక మాత్రమే భారీస్థాయిలో పేలిపోయి పెనువినాశనం సృష్టిస్తుంది. ఆర్మీ టాక్టికల్ మిసైల్ సిస్టమ్ (ఏటీఏసీఎం)గా పిలిచే దీర్ఘశ్రేణి పాత తరం ఎంజీఎం--140 బాలిస్టిక్ క్షిపణుల స్థానంలో కొత్త పీఆర్ఎస్ఎంలను తీసుకొచ్చారు. ఇవి గగనతలం నుంచి గగనతలానికి ప్రయోగించే క్షిపణులు. పాత క్షిపణుల పరిధి కేవలం 300 కిలోమీటర్లుకాగా కొత్త క్షిపణుల పరిధి 500 కిలోమీటర్లు. దీంతో పాత లాంచర్‌ల మీద నుంచే మరింత ఎక్కువ దూరాలకు బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించే వీలు చిక్కిందని అమెరికా ఆర్మీ అధికారులు చెప్పారు. దుబాయ్ సమీపంలోని రస్ అల్ ఖైమా సమీపంలోని మూసండం ద్వీపకల్పం ఇరాన్‌కు కేవలం 400 కిలోమీటర్ల దూరంలో ఉంది. అంతే పరిధితో పనిచేసే పీఆర్ఎస్ఎంలతో ఇరాన్‌పైకి నిరాటంకంగా దాడిచేయాలని అమెరికా భావిస్తోంది. రష్యాతో 1987లో కుదుర్చుకున్న మధ్య శ్రేణి అణ్వాస్త్రాల నిరోధక చట్టం అమల్లో ఉంటే పీఆర్ఎస్ఎస్‌ల వినియోగానికి అవరోధాలు ఎదురయ్యేవి. 2019లో ఈ ఒప్పందం నుంచి ట్రంప్ తప్పుకోవడంతో కొత్త క్షిపణుల తయారీ, వినియోగానికి అమెరికా తలుపులు బార్లా తెరిచిందని యుద్ధరంగ నిపుణులు చెబుతున్నారు.

# రక్తపోటు ఉన్నవారు ఏయే ఆహారాలను తీసుకోవాలి.. వేటిని మానేయాలి..?

మారిన జీవన విధానం, ఆహారపు అలవాట్ల కారణంగా చాలా మంది రక్తపోటు బారిన పడుతున్నారు. వయసుతో సంబంధం లేకుండా అందరూ ఈ సమస్యను ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా యువత ఈ సమస్య బారిన ఎక్కువగా పడుతున్నారు. ఒక్కసారి రక్తపోటు సంబంధిత మాత్రలు వాడడం మొదలు పెడితే వాటిని జీవితాంతం వాడాల్సిందే. అలాగే రక్తపోటు గుండె జబ్బులు, స్ట్రోక్ లు వచ్చే అవకాశాలను పెంచుతుంది. కనుక రక్తపోటును అదుపులో ఉంచుకోవడంతో పాటు ఈ సమస్య బారిన పడకుండా ఎవరిని వారు కాపాడుకోవాలి. జీవనశైలిలో, ఆహారపు అలవాట్లల్లో కొన్ని మార్పులు చేసుకోవడం వల్ల రక్తపోటును సులభంగా తిప్పికొట్టవచ్చు. అలాగే ఈ మార్పులు రక్తపోటు బారిన పడకుండా కాపాడడంలో కూడా ఎంతో సహాయపడతాయి. రక్తపోటును అదుపులో ఉంచుకోవడానికి జీవనశైలిలో చేసుకోదగిన మార్పుల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

### పొటాషియం ఉండే ఆహారాలు..



ప్రతిరోజూ వ్యాయామం చేయాలి. రోజూ 30 నుండి 40 నిమిషాల పాటు వ్యాయామం చేయడం వల్ల రక్తపోటు అదుపులో ఉంటుంది. రక్తపోటు స్థాయిలు అదుపులో ఉండాలంటే శరీర బరువు అదుపులో ఉండడం కూడా చాలా ముఖ్యం. కనుక క్రాష్ డైట్స్ వంటి వాటితో కాకుండా ఆరోగ్యంగా బరువు తగ్గేలా చూసుకోవాలి. అలాగే చక్కెర కలిగిన ఆహారాలను తీసుకోవడం మానేయడం ద్వారా కూడా రక్తపోటును అదుపులో ఉంచుకోవచ్చు. కార్బొహైడ్రేట్స్ ఎక్కువగా ఉన్న ఆహారాలను కూడా తీసుకోవడం తగ్గించాలి. దీని వల్ల రక్తపోటు అదుపులో ఉంటుంది. రక్తపోటుతో బాధపడే వారు అరటిపండ్లు, చేపలు, పాలు, చిలగడదుంపలు వంటి పొటాషియం ఎక్కువగా ఉండే ఆహారాలను తీసుకోవాలి. ఇటువంటి ఆహారాలు రక్తపోటును తగ్గించడంలో ఎంతో సహాయపడతాయి. అయితే మూత్రపిండాల వ్యాధులతో బాధపడే వారు మాత్రం పొటాషియం ఎక్కువగా ఉండే ఆహారాలను తీసుకునే ముందు వైద్యుడిని సంప్రదించడం మంచిది.

### గ్రీన్ టీ, సెలెరీ జ్యూస్..

అలాగే ఉప్పును తీసుకోవడం తగ్గించాలి. ఉప్పును తక్కువగా తీసుకోవడం వల్ల కొందరిలో రక్తపోటు అదుపులో ఉంటుంది. ప్రాసెస్ చేసిన ఆహారాలు రక్తపోటును పెంచుతాయి. కనుక వీటికి కూడా దూరంగా ఉండడం మంచిది. ధూమపానం కారణంగా కూడా రక్తపోటు పెరుగుతుంది. ధూమపానాన్ని మానేయడం వల్ల హృదయనాళ ఆరోగ్యం మెరుగుపడుతుంది. తద్వారా రక్తపోటు స్థాయిలు అదుపులో ఉంటాయి. రక్తపోటుకు కారణాల్లో ఒత్తిడి కూడా ఒకటి. కనుక ఒత్తిడి దరి చేరకుండా చూసుకోవాలి. యోగా, ధ్యానం, లోతైన శ్వాస వ్యాయామాలు చేయడం ద్వారా ఒత్తిడిని తగ్గించుకోవచ్చు. అలాగే డార్క్ చాక్లెట్ కూడా రక్తపోటును తగ్గించడంలో సహాయపడుతుంది. డార్క్ చాక్లెట్ లో 60 శాతం కోకో ఉండేలా చూసుకోవాలి. గ్రీన్ టీ, సెలెరీ జ్యూస్ వంటివి కూడా రక్తపోటును తగ్గించడంలో దోహదపడతాయి. అల్లం తీసుకోవడం ద్వారా ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుందన్న సంగతి తెలిసిందే. అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందించడంతో పాటు రక్తపోటును తగ్గించడంలో కూడా అల్లం సహాయపడుతుంది.

### మెగ్నీషియం ఉండే ఆహారాలు..

నిద్రలేమి కూడా రక్తపోటును పెంచుతుంది. కనుక రోజూ 6 నుండి 8 గంటల పాటు నాణ్యమైన నిద్ర పోయేలా చూసుకోవాలి. పచ్చి వెల్లుల్లిని లేదా వెల్లుల్లి పొడి తీసుకోవడం ద్వారా కూడా రక్తపోటును అదుపులో ఉంచుకోవచ్చు. ప్రోటీన్ ఎక్కువగా ఉండే ఆహారాలు గుడ్లు, గింజలు, శనగలు వంటి ఆహారాలు కూడా రక్తపోటును తగ్గించడంలో సహాయపడతాయి. ఆల్కహాల్ ను తీసుకోవడం మానేయడం ద్వారా కూడా రక్తపోటును అదుపులో ఉంచుకోవచ్చు. కూరగాయలు, పాల ఉత్పత్తులు, చిక్కుళ్లు, చికెన్, తృణ ధాన్యాలు వంటి ఆహారాలు మెగ్నీషియంను కలిగి ఉంటాయి. వీటిని తీసుకోవడం వల్ల కూడా రక్తపోటును తగ్గించుకోవచ్చు. బెర్రీ జాతికి చెందిన పండ్లల్లో పాలీఫినాల్స్ ఎక్కువగా ఉంటాయి. వీటిని తీసుకోవడం వల్ల రక్తపోటు నియంత్రణలో ఉండడంతో పాటు హృదయ ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది. తగిన ఆహారాలను తీసుకుంటూ, జీవనశైలిలో మార్పులు చేసుకోవడం ద్వారా రక్తపోటును అదుపులో ఉంచుకోవడంతో పాటు రక్తపోటు బారిన పడకుండా ఎవరిని వారు కాపాడుకోవచ్చని వైద్యులు చెబుతున్నారు. అయితే ఈ చిట్కాలను పాటించినప్పటికి రక్తపోటు అదుపులో ఉండకపోతే వెంటనే వైద్యుడిని సంప్రదించి తగిన చికిత్స తీసుకోవడం మంచిదని వైద్యులు సూచిస్తున్నారు.

# ఏఐ వల్ల భారీగా ఉద్యోగాలేమీ పోలేదు




న్యూఢిల్లీ: కృత్రిమ మేధతో భారీ సంఖ్యలో ఉద్యోగాలేమీ పోలేదని ఏఐ సంస్థ ఆంత్రోపిక్ ఒక నివేదికలో వెల్లడించింది. దీని వల్ల టెక్నాలజీ నైపుణ్యాలు అవసరమయ్యే ఉద్యోగాల్లో యువ ఉద్యోగుల నియామకాలు మాత్రమే నెమ్మదించిన సంకేతాలు కనిపిస్తున్నాయని వివరించింది. ఏఐ సామర్థ్యం కొండంత ఉన్నప్పటికీ, ప్రస్తుతం వినియోగించుకుంటున్నది గోరంతేనని పేర్కొంది. కోడింగ్, ఇన్ఫర్మేషన్ ప్రాసెసింగ్, అనాలిసిస్, రొటీన్ డిజిటల్ విధులను నిర్వర్తించే వైట్ కాలర్ ఉద్యోగాల్లో ఏఐ వినియోగం ఎక్కువగా ఉంటుందని తెలిపింది. కంప్యూటర్ ప్రోగ్రామర్లు, కస్టమర్ సర్వీస్ రిప్రజెంటేటివ్స్, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, మార్కెట్ రీసెర్చ్ అనలిస్టులు, ఫైనాన్షియల్..ఇన్వెస్ట్‌మెంట్ అనలిస్టుల్లాంటి ఉద్యోగ విధులను ఆటోమేట్ చేసేందుకు భారీగా అవకాశాలు ఉన్నందున, ఆయా ఉద్యోగాలకు రిస్క్?లు ఉంటాయని నివేదిక తెలిపింది. మరోవైపు, వంటవాళ్లు, మోటార్‌సైకిల్ మెకానిక్‌లు, లైఫ్‌గార్డ్‌లు, బార్‌టెండర్లు, డ్రెస్సింగ్ రూమ్ అటెండెంట్స్‌లాంటి మాన్యువల్ సామర్థ్యాలు అవసరమయ్యే ఉద్యోగాలకు ధోకా ఉండదని పేర్కొంది. అమెరికా లేబర్ స్టాటిస్టిక్స్ బ్యూరో డేటా ప్రకారం 2022 ఆఖరు నుంచి టెక్నాలజీ వినియోగం ఎక్కువగా ఉండే విభాగాల్లో యువ ఉద్యోగుల నియామకాలు మాత్రమే తగ్గినట్లు తెలుస్తోందని వివరించింది. ఏఐతో భారీగా ఉద్యోగాల్లో కోత పడుతోందంటూ ఆందోళన వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఆంత్రోపిక్ నివేదిక ప్రాధాన్యం సంతరించుకుంది.

**యువ వర్కర్ల నియామకాలు మాత్రమే తగ్గాయి**
**కృత్రిమ మేధతో ప్రోగ్రామర్లు, అనలిస్ట్ కొలువులకు రిస్క్?లు**
**వంటవాళ్లు, మెకానిక్‌ల ఉద్యోగాలు సేఫ్**
**ఆంత్రోపిక్ నివేదిక**

# 40 ఏళ్లు దాటిన వారు రోజూ ఈ పోషకాలు అందేలా చూసుకోవాలి.. ఎంతో మేలు జరుగుతుంది..

జీవితంలో 40 ఏళ్లు పూర్తి కావడం ఆరోగ్యపరంగా ఒక ముఖ్యమైన దశగా చెప్పవచ్చు. 40 ఏళ్ల తరువాత ఆరోగ్య సమస్యలు ఒక్కొక్కటిగా వస్తూ ఉంటాయి. శరీరంలో రోగనిరోధక శక్తి తగ్గడం, ఎముకలు బలహీనంగా మారడం, రక్తపోటు, డయాబెటిస్ వంటి సమస్యలు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. కనుక ఈ దశలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడం చాలా అవసరం. 40 ఏళ్లు దాటిన తరువాత జీవిత వేగాన్ని తగ్గించాల్సిన అవసరం ఏమాత్రం లేదు. సరైన జాగ్రత్తలు తీసుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకుంటే సరిపోతుంది. ఈ వయసులో శరీరానికి అవసరమయ్యే ముఖ్యమైన పోషకాలు, సప్లిమెంట్స్ ను తీసుకుంటూ చక్కని జీవనశైలిని పాటిస్తే అనారోగ్య సమస్యలు దరి చేరకుండా ఉంటాయని వైద్యులు చెబుతున్నారు. 40 ఏళ్ల వయసులో ఎటువంటి సప్లిమెంట్స్ ను, పోషకాలను తీసుకోవాలో.. వైద్యులు వీటి గురించి ఏం చెబుతున్నారో ఇప్పుడు తెలుసుకుందాం.

### విటమిన్ బి12, విటమిన్ డి3..

వయసు పెరిగే కొద్ది విటమిన్ బి12 శోషణ తగ్గుతుంది. విటమిన్ బి12 సప్లిమెంట్స్ ను తీసుకోవడం వల్ల నరాల ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఎర్రరక్తకణాల ఉత్పత్తి మెరుగుపడుతుంది. శక్తి స్థాయిలు నిల్వ ఉంటాయి. వయసు పైబడే కొద్ది శరీరంలో వాపు పెరుగుతుంది. కనుక ఒమెగా 3 ఫ్యాటీ ఆమ్లాలను తీసుకోవాలి. వీటిని తీసుకోవడం వల్ల గుండె ఆరోగ్యం, మెదడు పనితీరు, కంటి ఆరోగ్యం మెరుగుపడతాయి. అలాగే 40 ఏళ్ల తరువాత ఎముకల ధృడత్వం తగ్గడం ప్రారంభమవుతుంది. కనుక తగినంత క్యాల్షియం ఉండే ఆహారాలను లేదా సప్లిమెంట్స్ ను తీసుకోవాలి. దీని వల్ల ఎముకలు బలంగా ఉంటాయి. ఎముకలు విరిగే ప్రమాదం తగ్గుతుంది. 40 ఏళ్ల తరువాత విటమిన్ డి3 లోపం సాధారణంగా కనిపిస్తుంది. కనుక విటమిన్ డి3 సప్లిమెంట్స్ ను తీసుకునే ప్రయత్నం చేయాలి. వీటిని తీసుకోవడం వల్ల శరీరం క్యాల్షియంను గ్రహించే సామర్థ్యం పెరుగుతుంది. ఎముకలు, కండరాలు బలంగా తయారవ్వడంతో పాటు రోగనిరోధక శక్తి పెరుగుతుంది.

### పొటాషియం, జింక్..

గుండె, కండరాల పనితీరుకు పొటాషియం సప్లిమెంట్స్ ను తీసుకోవాలి. వీటిని తీసుకోవడం వల్ల గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది. నరాల సంకేతాలు సరిగ్గా పని చేస్తాయి. అదే విధంగా వయసు పెరిగే కొద్ది శరీరంలో రోగనిరోధక శక్తి తగ్గడం, గాయాలు నయం అయ్యే సామర్థ్యం తగ్గడం జరుగుతుంది. కనుక జింక్ సప్లిమెంట్స్ ను తీసుకోవాలి. ఈ సప్లిమెంట్స్ ను తీసుకోవడం వల్ల వాపులు తగ్గడంతో పాటు రోగనిరోధక శక్తి పెరుగుతుంది. కండరాలు, నరాల పనితీరుకు మెగ్నీషియం చాలా అవసరం. మెగ్నీషియం సప్లిమెంట్స్ ను తీసుకోవడం వల్ల ఎముకలు బలంగా తయారవుతాయి. రక్తపోటు అదుపులో ఉంటుంది. రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి. కణాలను రక్షించడానికి, థైరాయిడ్ గ్రంథి పనితీరుకు సెలీనియం చాలా అవసరం. దీనిని తీసుకోవడం వల్ల శరీరంలో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఈ విధంగా శరీర ఆరోగ్యాన్ని బట్టి తగిన సప్లిమెంట్స్ ను తీసుకుంటూ చక్కని జీవనశైలిని పాటించడం వల్ల 40 ఏళ్లు దాటిన తరువాత కూడా ఉత్సాహంగా పని చేసుకోవచ్చని వైద్యులు చెబుతున్నారు.



# వైరల్ ట్రెండ్‌లో ప్రియాంక.. తన 'చిక్' మూమెంట్స్ ఇవేనట!



గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా సోషల్ మీడియాలో నిరంతరం యాక్టివ్‌గా ఉంటారు. తాజాగా ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో వైరల్ అవుతున్న 'క్రైండా చిక్' ట్రెండ్‌లో భాగమయ్యారు. శనివారం తన అధికారిక ఖాతాలో కొన్ని ఫొటోలను షేర్ చేస్తూ, తన జీవితంలో ఏయే అంశాలు తనకు స్టైలిష్‌గా, ప్రత్యేకంగా అనిపిస్తాయో వివరించారు. "30 ఏళ్ల వయసులో జీవితాన్ని మళ్లీ కొత్తగా ప్రారంభించడం, ఎలాంటి ప్రణాళిక లేకుండానే ఖండాలు దాటి వెళ్లడం, ఎదుటివారు మనల్ని తక్కువగా అంచనా వేయడం" వంటివి తనకు 'చిక్' అనిపిస్తాయని ప్రియాంక పేర్కొన్నారు. వీటితో పాటు "మెట్ గాలాలో నా భర్తను కలవడం, ఎటువంటి వివరణ ఇవ్వకుండా నిర్మొహమాటంగా 'నో' చెప్పగలగడం, ఇస్రో మెయిలింగ్ లిస్ట్‌లో ఉండటం" వంటి ఆసక్తికర విషయాలను కూడా పంచుకున్నారు. "ఈ ట్రెండ్‌ను ద్వేషించడం కూడా ఒక రకమైన చిక్" అంటూ ఈ పోస్ట్‌కు సరదాగా క్యాప్షన్ జతచేశారు. స్వీయ ప్రేమను, ఆత్మవిశ్వాసాన్ని చాటిచెప్పడమే ఈ ట్రెండ్ ప్రధాన ఉద్దేశం. తన వ్యక్తిగత జీవితానికి సంబంధించి మరిన్ని విశేషాలను తెలియజేస్తూ.. "నా బాలీవుడ్ హీరోను పెళ్లి చేసుకోవడం, నా ప్రాణ స్నేహితురాలి బిడ్డతో నా బిడ్డ బెస్ట్ ఫ్రెండ్ అవ్వడం, ఒక చిన్నారికి సురక్షితమైన ప్రపంచాన్ని అందించడం" కూడా చిక్ మూమెంట్స్ అని తెలిపారు. ఇక సినిమాల విషయానికొస్తే.. ప్రియాంక చోప్రా త్వరలో ఎస్.ఎస్. రాజమౌళి దర్శకత్వంలో రూపొందుతున్న 'వారణాసి' చిత్రంలో నటిస్తున్నారు. ఈ సినిమాలో ఆమె మహేశ్ బాబు సరసన 'మందాకిని' అనే కీలక పాత్రలో కనిపించనున్నారు. పృథ్వీరాజ్ సుకుమారన్ కూడా నటిస్తున్న ఈ చిత్రం.. 'శాంభవి' అనే గ్రహశకలం నుండి వారణాసి నగరాన్ని కాపాడటం అనే కథాంశంతో భారీ యాక్షన్-అడ్వెంచర్‌గా తెరకెక్కనుంది. ఈ చిత్రం 2027 ఏప్రిల్‌లో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశం ఉంది.

**ఇన్‌స్టాగ్రామ్‌లో వైరల్ అవుతున్న 'క్రైండా చిక్' ట్రెండ్‌లో చేరిన ప్రియాంక**

**తనకు స్టైలిష్‌గా అనిపించే పలు విషయాలను పంచుకున్న గ్లోబల్ బ్యూటీ**

**30 ఏళ్లలో మళ్లీ మొదలుపెట్టడం, మెట్ గాలాలో భర్తను కలవడం 'చిక్' అని వెల్లడి**

**రాజమౌళి దర్శకత్వంలో మహేశ్ బాబు సరసన 'వారణాసి' చిత్రంలో నటిస్తున్న ప్రియాంక**



# మంచి కథలతో రండి.. అవకాశమిస్తాం...



## కొత్త దర్శకులకు అక్కినేని నాగార్జున బంపర్ ఆఫర్

**స్టూడియో అంటే కేవలం డబ్బులు సంపాదించడం మాత్రమే కాదన్న నాగార్జున**

**సినీ రంగానికి తిరిగి సేవ చేయాలనేది తన అభిమతమని వెల్లడి**

**మంచి కథ ఉన్నవారు నేరుగా అన్నపూర్ణ స్టూడియోను సంప్రదించవచ్చన్న నాగార్జున**



మంచి కథలతో వచ్చే కొత్తవారికి అవకాశాలు ఇచ్చి సినిమాలు నిర్మించేందుకు తమ అన్నపూర్ణ స్టూడియోస్ సిద్ధంగా ఉందంటూ టాలీవుడ్ 'కింగ్' అక్కినేని నాగార్జున అదిరిపోయే ప్రకటన చేశారు. 'పళ్ళ బురుసు' సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ... మంచి కథ ఉన్నవారు ఎవరైనా సరే నేరుగా అన్నపూర్ణ స్టూడియోను సంప్రదించవచ్చని పిలుపునిచ్చారు. స్టూడియో అంటే కేవలం లీజుకు ఇచ్చి డబ్బులు సంపాదించడం మాత్రమే కాదని, తిరిగి సినీ రంగానికి సేవ చేయాలనే ఉద్దేశంతోనే కొత్త దర్శకులతో చిత్రాలను నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల 'లెనిన్' సినిమాతో మంచి విజయాన్ని సాధించామని, ఇప్పుడు 'పళ్ళ బురుసు' నిర్మించి రిలీజ్ చేస్తున్నామని చెప్పారు. రాబోయే రోజుల్లో 'రంభ, ఊర్వశి, మేనక'తో పాటు తన ప్రతిష్ఠాత్మక 100వ చిత్రం 'కింగ్ 100' కూడా అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్‌పై రాబోతున్నట్లు నాగార్జున వెల్లడించారు. కాగా, గోమతి రెడ్డి, సుధాకర్ రెడ్డి, మురళీధర్ గౌడ్, ప్రజ్వల్ యాద్మా ప్రధాన పాత్రల్లో ఉదయ్ చౌహన్ దర్శకత్వంలో తెరకెక్కిన 'పళ్ళ బురుసు' చిత్రం అన్నపూర్ణ స్టూడియోస్, ఎపిక్ స్టూడియోస్ సంయుక్త నిర్మాణంలో ఆగస్టు 14న ప్రేక్షకుల ముందుకు రానుంది.

# అంతరిక్షంలో ప్రసవం.. సురక్షితమేనా..?




మనుషులు విశ్వాంతరాళంలో విస్తరించాలనే ఆలోచనతో ఎప్పటి నుంచో పరిశోధనలు చేస్తున్నారు శాస్త్రవేత్తలు. అంగారకుడిపై కాలనీలు, చంద్రునిపై నివాసాల గురించి చర్చ జరుగుతోంది. అయితే, అంతరిక్షంలో మానవ మనుగడ సాగాలంటే అక్కడ పునరుత్పత్తి సాధ్యమేనా? గర్భధారణ, ప్రసవం సురక్షితంగా జరుగుతాయా? అన్న అంశంపై ఇటీవల జరిగిన పరిశోధనలు దిగ్భ్రాంతి కలిగించే విషయాలను వెల్లడించాయి.

అంతరిక్షంలో..

'రిప్రొడక్టివ్ బయోమెడిసిన్ ఆన్‌లైన్' జర్నల్‌లో ప్రచురితమైన తాజా అధ్యయనం ప్రకారం.. ప్రస్తుత పరిస్థితుల్లో అంతరిక్షంలో ప్రసవం ఏమాత్రం సురక్షితం కాదు. భూమికి దూరంగా, అనంతవాయువుల మధ్య ఉండే వాతావరణం మానవ పునరుత్పత్తి వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ప్రధాన అడ్డంకులు ఏంటి..?

అంతరిక్షంలో ఉండే శక్తివంతమైన కాస్మిక్ కిరణాలు మన కణాల్లోని ఐఎన్ఏను దెబ్బతీస్తాయి. ఇది పురుషుల్లోని శుక్రకణాలను, మహిళల్లోని అండాలను బలహీనపరుస్తుంది. ఫలితంగా పిండం ఎదుగుదల ఆగిపోవడం లేదా జన్యుపరమైన లోపాలు తలెత్తే ప్రమాదం ఉంది.

సూక్ష్మ గురుత్వాకర్షణ ..

భూమిపై ఉండే గురుత్వాకర్షణ శక్తి పిండం అభివృద్ధికి, గర్భాశయంలో శిశువు స్థితికి ఎంతో కీలకం. శూన్యంలో పిండం ఎదుగుదల ఎలా ఉంటుందనే దానిపై జంతువులపై జరిపిన ప్రయోగాలు మిశ్రమ ఫలితాలను ఇచ్చాయి. ఒత్తిడి - రిథమ్.. అంతరిక్ష ప్రయాణాల్లో కలిగే మానసిక ఒత్తిడి, నిద్ర వేళల్లో మార్పులు హార్మోన్ల సమతుల్యతను దెబ్బతీస్తాయి.

పునరుత్పత్తి వ్యవస్థపై ప్రభావం..

సుదీర్ఘకాలం అంతరిక్షంలో గడిపే వ్యోమగాముల్లో సంతానోత్పత్తి సామర్థ్యం తగ్గే అవకాశం ఉందని పరిశోధనలు చెబుతున్నాయి. రేడియేషన్ ప్రభావం వల్ల భవిష్యత్తులో క్యాన్సర్ వచ్చే ముప్పు కూడా పొంచి ఉంది. తక్కువ కాలం ప్రయాణించే వారిపై పెద్దగా ప్రభావం ఉండకపోయినప్పటికీ.. అక్కడే నివాసం ఉండాలనుకునే వారికి మాత్రం ఇది పెను సవాలే.

అంతరిక్షంలో మానవ కాలనీలు ఏర్పాటు చేయడం సాంకేతికంగా సాధ్యమే కావొచ్చు. కానీ, ఒక ప్రాణం భూమికి వెలుపల సురక్షితంగా జన్మించగలదా? అన్న ప్రశ్నకు సైన్స్ వద్ద ఇంకా పూర్తిస్థాయి సమాధానం లేదు. దీనిపై మరిన్ని లోతైన పరిశోధనలు జరగాల్సి ఉంది.

గమనిక: ఇది కేవలం సమాచారంగా మాత్రమే భావించండి. ఈ సమాచారం ఆధారంగా ఆరోగ్య సమస్యలకు సంబంధించిన నిర్ణయాలు తీసుకోవద్దు. అందుకోసం వైద్య నిపుణులను సంప్రదించండి.

# 11 ఏళ్లకే సోషల్ మీడియా అలవాటైందా? 16 ఏళ్లకల్లా ఏం జరుగుతుందో తెలుసా?

**చిన్న వయసులో సోషల్ మీడియా వాడకంపై అధ్యయనం**

**11-12 ఏళ్లకే అకౌంట్ తెరిచినవారిలో చదువులో స్కోర్లు తక్కువ**

**15-16 ఏళ్లకు గణితంలో మరింత పెరిగిన వ్యత్యాసం**

**ఆ తేడా ఆరు నెలల విద్యకు సమానమని అంచనా**

**పదేపదే ఫోన్ చూడటం ఏకాగ్రతను దెబ్బతీయొచ్చని హెచ్చరిక**

**అకౌంట్ తెరవడం ఆలస్యం చేయడం మంచిదని పరిశోధకుల సూచన**



చేతిలో స్మార్ట్‌ఫోన్ ఉంటే చాలు.. క్షణాల్లో ప్రపంచం పిల్లల ముందుకొచ్చేస్తోంది. రీల్స్.. చాటింగ్.. నోటిఫికేషన్లు.. లైక్‌లు.. ఇలా సోషల్ మీడియా వారి రోజువారీ జీవితంలో భాగమైపోయింది. అయితే పిల్లలను సోషల్ మీడియాలోకి ఎప్పుడు అనుమతించాలన్నదే ఇప్పుడు అసలు ప్రశ్న. చిన్న వయసులోనే ఈ అలవాటు మొదలైతే చదువుపై ప్రభావం పడొచ్చని తాజా అధ్యయనం హెచ్చరిస్తోంది.

11 ఏళ్లకే మొదలైతే..

ఇటలీలో ఐదు వేల మందికిపైగా విద్యార్థులపై ఈ పరిశోధన జరిగింది. 11, 12 ఏళ్లకే సోషల్ మీడియా అకౌంట్ తెరిచిన పిల్లల పరీక్ష ఫలితాలను.. 14 ఏళ్ల తర్వాత అకౌంట్ తెరిచిన వారితో పోల్చారు. 13-14 ఏళ్ల వయసులోనే గణితం, ఇటాలియన్ భాషలో వీరి స్కోర్లు తక్కువగా కనిపించాయి.

ఆరు నెలల చదువు తేడా!

15-16 ఏళ్లకు చేరేసరికి ఈ వ్యత్యాసం మరింత స్పష్టమైంది. ముఖ్యంగా గణితంలో తేడా పెరిగింది. ఇటాలియన్ భాషలోనూ ప్రభావం కనిపించింది. మొత్తం వ్యత్యాసం దాదాపు ఆరు నెలల పాఠశాల విద్యకు సమానంగా ఉందని పరిశోధకులు అంచనా వేశారు. అయితే సోషల్ మీడియా వాడకమే దీనికి నేరుగా కారణమని అధ్యయనం నిరూపించలేదు.

అసలు సమస్య ఇదే..

ఫోన్‌ను ఎంతసేపు వాడుతున్నారనే దానికంటే.. ఎన్నిసార్లు చెక్ చేస్తున్నారన్నది ముఖ్యమని పరిశోధకులు చెబుతున్నారు. నోటిఫికేషన్లు, మెసేజ్‌లు, లైక్‌ల కోసం పదేపదే ఫోన్ చూడటం ఏకాగ్రతను దెబ్బతీయొచ్చు. చదువుతున్న సమయంలోనూ దృష్టి సోషల్ మీడియా వైపు మళ్లుతుంది. దీంతో ఎక్కువసేపు ఒక విషయంపై దృష్టి పెట్టడం కష్టమవుతుంది.

తల్లిదండ్రులు ఇలా చేయండి

పిల్లలకు సోషల్ మీడియాను పూర్తిగా నిషేధించాల్సిన అవసరం లేదని పరిశోధకులు స్పష్టం చేశారు. వీలైతే అకౌంట్ ఇవ్వడాన్ని ఆలస్యం చేయాలి. చదువు, భోజనం సమయంలో ఫోన్‌ను దూరంగా ఉంచాలి. పడకగదిలో ఫోన్‌కు చోటివ్వకపోవడం మంచిది. అవసరం లేని నోటిఫికేషన్లు ఆపేయాలి.

### ఈ లక్షణాలు కనిపిస్తే..

చదువుతున్నప్పుడు పదేపదే ఫోన్ చూడటం, రాత్రిళ్లు నిద్ర మానేసి రీల్స్ చూడటం, ఫోన్ లేకపోతే అసహనానికి గురికావడం వంటి లక్షణాలను తల్లిదండ్రులు గమనించాలి. మార్కులు తగ్గే వరకు వేచి చూడకుండా.. ఏకాగ్రతపై ప్రభావం పడకుండా ముందుగానే అల వాట్లను నియంత్రించడం మంచిది.

# అతి వద్దు సుమీ!



అమ్మాయిలకు అందంపైనా, ఆరోగ్యంపైనా స్పృహ రోజు రోజుకీ పెరుగుతోంది. దీంతో తక్కువ సమయంలోనే బరువు తగ్గాలని కొందరు... దృఢంగా మారిపోవాలని మరికొందరు అతిగా వ్యాయామాలు చేస్తున్నారు. ఇలా చేస్తే ప్రయోజనాల సంగతి దేవుడెరుగు... దుష్ప్రభావాలు తప్పవంటున్నారు నిపుణులు. అది ఎలాంటి పరిస్థితికి దారితీస్తుందో తెలుసా?

ఒత్తిడి పెరుగుతుంది...

వ్యాయామం చేయడం వల్ల ఫీల్‌గుడ్ హార్మోన్లు విడుదలై ఒత్తిడి హార్మోన్లను తగ్గిస్తాయి. అయితే, మితిమీరి వర్కవుట్స్ చేయడం వల్ల కార్టిసాల్ అనే స్ట్రెస్ హార్మోన్ కూడా ఎక్కువగా విడుదలవుతుంది. దీంతో శరీరమే కాదు... మనసూ అలసిపోతుంది. కాబట్టి తీసుకునే ఆహారాన్ని బట్టి రోజూ 45 నిమిషాల నుంచి గంట వరకూ కసరత్తులకు కేటాయించుకుంటే సరిపోతుంది.

ఎక్కువ తినేలా చేస్తుంది...

అధిక వ్యాయామం వల్ల గ్రెలిన్ వంటి ఆకలి హార్మోన్లు ఉత్పత్తి అవుతాయి. దీంతో కసరత్తులతో కరిగించిన కెలోరీలు కంటే ఎక్కువగా ఆహారం తీసుకునేలా చేస్తాయి. దీంతో నాజూగ్గా మారాలన్న లక్ష్యం పక్కకెళ్లి... మరింత బరువు పెరిగే ప్రమాదం ఉంది.

హార్మోన్ల హెచ్చుతగ్గులు...

మితంగా చేసే వ్యాయామం... హార్మోన్లను సమతుల్యం చేస్తుంది. అదే విశ్రాంతి లేకుండా అతిగా చేస్తే శరీరంపై ఒత్తిడి పెరిగి అవి హెచ్చుతగ్గులకు గురవుతాయి. ముఖ్యంగా కార్టిసాల్ ఎక్కువగా ఉత్పత్తి అయ్యి ఇతర హార్మోన్లను దెబ్బతీస్తుంది. ఈస్ట్రోజన్, ప్రొజెస్టరాన్ తగ్గుతాయి. నెలసరిని క్రమం తప్పిస్తాయి. భవిష్యత్తులో ఆస్టియోపోరోసిస్ వంటి వ్యాధుల బారిన పడేలానూ చేస్తాయి. కాబట్టి ఆ సమయం గంట దాటకుండా ఉంటే మేలు

# అవసరంలేకున్నా యాంటీబయోటిక్స్ వాడితే ప్రాణాపాయం.. ఐఎంఏ హెచ్చరిక






చిన్నపాటి జ్వరం వచ్చినా, ఒళ్లు నొప్పులు అనిపించినా వెంటనే మెడికల్ షాప్ కి వెళ్లి యాంటీబయోటిక్స్ కొనేస్తున్నారా? అయితే మీకు ప్రాణాపాయం తప్పదు..! యాంటీబయోటిక్స్‌ను విచక్షణారహితంగా వాడటం వల్ల మానవాళికి 'యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్' అనే అదృశ్య ముప్పు పొంచి ఉందని వైద్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు 'ఇండియన్ మెడికల్ అసోసియేషన్' సహకారంతో దేశవ్యాప్తంగా భారీ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ఏఎంఆర్..

సాధారణంగా శరీరంలోని హానికారక బ్యాక్టీరియాను చంపడానికి యాంటీబయోటిక్స్ వాడతాం. అయితే అవసరం లేకున్నా వాడటం లేదా డాక్టర్ చెప్పిన కోర్సును మధ్యలోనే ఆపేయడం వల్ల సదరు బ్యాక్టీరియా ఆ మందులను తట్టుకునే శక్తిని పెంచుకుంటుంది. ఫలితంగా భవిష్యత్తులో ఆ మందులు శరీరంలో పని చేయవు. చివరకు చిన్నపాటి ఇన్ఫెక్షన్లు కూడా నయం కాక ప్రాణాపాయానికి దారితీస్తాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ (ఔషా) ఇప్పటికే ూవీ=ను గ్లోబల్ హెల్త్ ఎమర్జెన్సీగా ప్రకటించింది.

వినూత్న కార్యక్రమాలు..

ఈ ముప్పును అరికట్టేందుకు 12 రాష్ట్రాల్లోని ప్రతి జిల్లాలోనూ వినూత్న కార్యక్రమాలు చేపట్టారు. పాఠశాలలు, నివాస సముదాయాల్లో వైద్యులతో అవగాహన సదస్సులు నిర్వహించారు. ఢిల్లీ, హర్యానా, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో భారీ ర్యాలీలు చేపట్టి ప్రజలకు 'ఏఎంఆర్' తీవ్రతను వివరించారు. తప్పుడు మందుల వినియోగం వల్ల చికిత్స విఫలమైన కేసులను ఉదహరిస్తూ నిపుణులు ప్రజలను అప్రమత్తం చేశారు. కేవలం డాక్టర్ ప్రిస్క్రిప్షన్ ఉంటేనే యాంటీబయోటిక్స్ వాడాలని స్పష్టం చేశారు.

ఏమంటున్నారంటే..?

జలుబు, దగ్గు వంటి వైరల్ ఇన్ఫెక్షన్లకు యాంటీబయోటిక్స్ పనిచేయవు. కాబట్టి సొంత వైద్యం వద్దు. డాక్టర్ ఐదు రోజులు మందులు వాడాలని చెబితే, రెండు రోజుల్లో నయం అయిందని ఆపేయకూడదు. దీనివల్ల బ్యాక్టీరియా మందులను తట్టుకునేలా రూపాంతరం చెందుతుంది. చేతులు శుభ్రంగా కడుక్కోవడం, శుభ్రమైన నీరు తాగడం ద్వారా ఇన్ఫెక్షన్లు రాకుండా చూసుకోవచ్చు. తద్వారా యాంటీబయోటిక్స్ అవసరమే పడదు. ఈ రోజు మనం వాడుతున్న అనాలోచిత యాంటీబయోటిక్స్, రేపటి తరం చికిత్సకు మందులే లేకుండా చేస్తున్నాయి.

గమనిక: ఇది కేవలం సమాచారంగా మాత్రమే భావించండి.. ఈ సమాచారం ఆధారంగా ఆరోగ్య సమస్యలకు సంబంధించిన నిర్ణయాలు తీసుకోవద్దు. అందుకోసం వైద్య నిపుణులను సంప్రదించండి.

Printed, Polished, Owned by BESTHA SHIVA RAMUDU & Printed UTTEJITA PRINTERS H.NO -801, BUDHAWAR PETA, KURNOOL, ANDHRA PRADESH - 518001. APTEL2023/88704 & Published at D.No.4-458, PAIGEAR, NANDAVARAM, V&P. KURNOOLD.T. (A.P)-518343,CELL:9494741301.